




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


అసోంలో బిజెపి, బెంగాల్‌లో తృణమూల్ ఆధిక్యత

తమిళనాట డిఎంకె, కేరళంలో యుడిఎఫ్

ఎగ్జిట్ పోల్స్ అంచనా 05


సంపుటి 09, సంచిక: 150 | గురువారం | 30-04-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## పది పరీక్షల్లో 95.15% పాస్

### ములుగు టాప్.. హైదరాబాద్ లాస్ట్

- సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99%, ప్రైవేట్ పాఠశాలల్లో 95% ఉత్తీర్ణత
- టెన్త్‌లోనూ బాలికలదే పైచేయి
- జూన్ 5 నుంచి 12 వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు
- మే 14 వరకు పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం
- పది పరీక్ష ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు

**అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష షెడ్యూల్**

జూన్ 5– ప్రథమ భాష
జూన్ 6– ద్వితీయ భాష
జూన్ 7– తృతీయ భాష
జూన్ 8–గణితం
జూన్ 9– సామాన్యశాస్త్రం–పార్ట్ 1
జూన్ 10– సామాన్యశాస్త్రం–పార్ట్ 2
జూన్ 11– సాంఘిక శాస్త్రం
జూన్–12– ఒఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలో 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 2.19 అధిక శాతంతో బాలికలే మొదటి స్థానంలో నిలిచారు. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదవ్వగా, ప్రైవేటు పాఠశాలల్లో 95.81 శాతం ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 96.26 శాతం, బాలురు 94.07 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,731 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదవ్వగా, 6 ప్రైవేటు పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా 99.30 శాతంతో ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలువగా,అత్యల్పంగా 89.23 శాతం మార్కులతో హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని ఎస్‌సిఇఆర్‌టి (రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ మండలి) కార్యాలయంలోని గోదావరి ఆడిటోరియంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్, ప్రభుత్వ పరీక్షల సంచాలకులు పి.వి.శ్రీహరి, ఎస్‌సిఇఆర్‌టి సంచాలకులు రమేష్‌తో కలిసి ప్రభుత్వ సలహాదారు కె.కేశవ రావు బుధవారం పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,26,166 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా, 4,97,312 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో తెలుగు మీడియంలో తరువాయి 2లో

---

ఉద్యోగుల పెండింగ్ బకాయిలు

## రూ.వెయ్యి కోట్లు విడుదల

స్కాలర్‌షిప్ సమస్య పరిష్కరిస్తాం

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాల మేరకు ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం రూ.1000 కోట్ల నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఈ మేరకు నిధులు విడుదల చేశారు. ఈ మేరకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో ఇచ్చిన హామీ నెరవేర్చారు. డిప్యూటీ సిఎం కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం గత ఏడాది ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల సందర్భంగా ప్రభుత్వం నెలకు రూ.700 కోట్లు విడుదల తరువాయి 2లో

---

'తుమ్మిడిహెట్టి'ని 150 మీటర్లలో నిర్మిస్తాం...

## మహారాష్ట్రను ఒప్పించండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- నేడు అపాయింట్‌మెంట్ తీసుకొని చర్చించే బాధ్యత మంత్రి ఉత్తమ్‌కు అప్పగింత
- మహారాష్ట్రతో కూడా సంప్రదింపులు జరపాలని ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్



ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే మహారాష్ట్ర లో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని, దీనిపై మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ బ్యారేజ్ నిర్మాణం చేపడితే ఆదిలాబాద్ తో పాటు తెలంగాణలో మెట్ట ప్రాంతాల రైతుల కు సాగు తాగు నీరు అందుతుందని, తక్కువ ఖర్చుతో గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ కు నీటిని తెచ్చుకునే వీలుంటుందని చెప్పారు. ప్రాజెక్ట్ ప్రాధాన్యత దృష్ట్యా వెంటనే మహారాష్ట్ర తో సంప్రదింపులు జరపాలని తరువాయి 2లో

---

హైదరాబాద్ మెట్రో రైల్

## సర్కార్ చేతికి...

### ఎల్ & టితో పూర్తయిన ఒప్పందం

రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ

మెరుగ్గా మెట్రో విస్తరణ పనులు, ప్రణాళిక, సేవలు



ప్రజాపక్షం/హైదరాబాద్

ఇప్పటివరకు ఎల్ అండ్ టి ఆధీనంలో ఉన్న హైదరాబాద్ మెట్రో రైలును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్1ను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఈ మేరకు ఎల్ అండ్ టీ తో కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో హెచ్ఎంఆర్ఎల్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, హెచ్ఎంఆర్ఎల్ ఎండి సర్ఫరాజ్ అహ్మద్, ఎల్అండ్‌టి, తరువాయి 2లో

---

## ఫొంతనేదీ?




- పెట్రోల్, డీజిల్ సరఫరాలో ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పూర్తి భిన్నం
- ఎలాంటి కొరతలేదని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- పెట్రోల్ బంక్‌ల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనం
- కావలసినంత పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉన్నాయి : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ సరఫరా విషయంలో ప్రభుత్వ ప్రకటనలకు క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. కొరతను నివారించడానికి అవసరాలకు మించి చమురు సరఫరా చేస్తున్నామని అధికారులు ప్రకటిస్తుండగా సమస్య మాత్రం అంతకు అంత తీవ్రమవుతుంది. అవసరాలకు మించి 210 శాతం డీజిల్, 132 శాతం పెట్రోలు సరఫరాను పెంచినట్లు ప్రభుత్వం బుధవారం ప్రకటించగా, ఆదివారం నుంచే చమురు సరఫరాను 126 శాతానికి పెంచామని, ఎలాంటి కొరత లేదని పౌరసరఫరా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. మంత్రులు, ఉన్నతాధికారులు ఎలాంటి కొరత లేదంటే, బుధవారం ఏకంగా హైదరాబాద్‌లో 40 శాతం పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. ఒక ప్రాంతంలో 10 బంకులు ఉంటే వాటిలో 5 నుంచి 6 బంకుల వద్ద నో స్టాక్ బోర్డులను పెట్టారు. రాష్ట్ర రాజధాని కేంద్రం హైదరాబాద్‌లోనే ఇలాంటి పరిస్థితి ఉండగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇంధన కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని బంకుల్లో మాత్రమే ఇంధనం అందుబాటులో ఉండటంతో హైదరాబాద్‌తో పాటు జిల్లాల ప్రధాన పట్టణాల్లో కూడా పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలైన్ల కారణంగా భారీ ట్రాఫిక్ జామ్‌లతో మరిన్ని ఇబ్బందులు పెరుగుతున్నాయి. చమురు కొరత కారణంగా పలు చోట్ల వాహనదారులు కిలోమీటర్ల మేర లైన్లలో నిలబడి గంటల తరబడి వేచి ఉన్నా తరువాయి 12లో

---

బెంగాల్ తుదివిడతలో

## 91.66% పోలింగ్



**కోల్‌కతా :** బెంగాల్‌లో కొన్ని చోట్ల చెదురుముదురు ఘటనలు మినహా రెండో దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాత్రి 8 గంటల వరకు 91.66 శాతం పోలింగ్ నమోదైంది. అయితే అప్పటికే క్యూలైన్‌లో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ నమోదు 95 శాతం దాటే అవకాశముంది. బెంగాల్‌లో 294 స్థానాలు ఉండగా ఏప్రిల్ 23న 152 నియోజకవర్గాల్లో పోలింగ్ ముగియగా బుధవారం 142 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో 1,448 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 3.21 కోట్ల మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని తరువాయి 12లో

---

## ఉన్న చట్టాలు చాలు

- విద్వేష ప్రసంగాల సమస్యల పరిష్కారంపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- మేం జోక్యం చేసుకోవాల్సినంత శాసనపరమైన శూన్యత ఏమీలేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** విద్వేషపూరిత ప్రసంగాల సమస్యను పరిష్కరించడానికి ప్రస్తుతం ఉన్నటువంటి చట్టాలు సరిపోతాయని, తాను జోక్యం చేసుకోవాల్సినంతగా 'శాసనపరమైన శూన్యత' ఏమీ లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇలాంటి కేసుల్లో శిక్షను నిర్ణయించడమనేది పూర్తిగా చట్ట సభ పరిధిలోనే ఉంటుందని గుర్తుచేసింది. ఇలాంటి కేసుల్లో శిక్షను నిర్ణయించడమనేది పూర్తిగా చట్టసభ పరిధిలోనే ఉంటుందని గుర్తుచేసింది. విద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించిన పలు పిటిషన్లపై వెలువరించిన తీర్పులో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన తరువాయి 12లో

---

అణు ఒప్పందం కుదిరేదాకా

## ఇరాన్ బ్లాకేడ్

ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** అణుఒప్పందం కుదిరే వరకూ ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి ఇజ్రాయెల్‌కు చెందిన ఛానెల్–12తో ట్రంప్ మాట్లాడుతూ, అణు ఒప్పందానికి వచ్చేవరకూ ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేసేది లేదని, ఇరాన్ నుండి చమురు నౌకలను బాహ్య ప్రపంచంలోకి వెళ్ళనిచ్చేదిలేదని స్పష్టం చేశారు. బాంబు దాడులు చేయడం కంటే అమెరికా నావికాదళం ఇరాన్‌పై దిగ్బంధనం కొనసాగిస్తేనే మరింత ప్రభావంతమైన ఫలితాలు వస్తాయని అన్నారు. చమురు ఎగుమతులు చేసుకోలేకపోతే, ఇరాన్ ఇంధన మౌలిక వ్యవస్థలు త్వరలోనే విచ్ఛిన్నమవుతాయన్నారు. దిగ్బంధనం ద్వారా ఇరాన్ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చివేస్తామని అన్నారు. ఇరాన్‌కు ప్రధాన ఎగుమతి కేంద్రమైన ఖర్గ్ ద్వీపంలో చమురు నిల్వలు పేరుకుపోతున్నాయని, ఇక నిల్వచేయడానికి చోటే లేని పరిస్థితులు రానున్నాయని అన్నారు. ఎలా చర్చలు జరపాలో ఇరాన్‌కు తెలియడంలేదని, చాలా త్వరగా ఇరాన్ బుద్ధి తెచ్చుకుని ఒప్పందం చేసుకుంటే మంచిదని ట్రంప్ ఇంతకుముందు చెప్పారు.




# ఇక బంధనాలు లేని స్వేచ్ఛావ్యాపారి యుఎఇ

## జిసిసి సమావేశం రోజే ఒపెక్ నుండి వైదొలగాలని నిర్ణయం

## భారత్ సహా గ్లోబల్ సౌత్‌కు లాభావకాశాలు




**అబుధాబి:** స్వతంత్ర విధానంతో, ఇటీవల తను పెట్టిన భారీ పెట్టుబడులకు మరింత లాభాలు సమకూర్చుకుని నష్టాలు లేకుండా పెరుగుతున్న చమురు డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) ఒపెక్,ఒపెక్ ప్లస్ చమురు ఉత్పాదక దేశాల కూటమి నుండి బయటకు వచ్చిందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. దాదాపు యుఎఇ ఇంధన మంత్రి ఇంధనశాఖా మంత్రి సుహైల్ మొహ్మద్ అల్‌‒మజ్రూయీ రాయిటర్స్ వార్తాసంస్థకు చెప్పిందీ ఇదే. ఐక్యతే ప్రధాన ఎజెండాగా జి.సి.సి (గల్ఫ్ సహకార మండలి) సమావేశం రోజునే ముహూర్తంగా ఎంచుకున్న యు.ఎ.ఇ ఒపెక్,ఒపెక్ ప్లస్ నుండి వైదొలగుతున్నట్లు తన ఏకపక్ష నిర్ణయం ప్రకటించింది. ఒపెక్‌లో మూడో అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉన్న యు.ఎ.ఇ. రోజుకు 50 లక్షల బ్యారెళ్ళ చమురును ఉత్పత్తి చేయగల సామర్థ్యంగల మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ, గల్ఫ్,ఒపెక్ ఐక్యతను కాపాడటంకోసమే తన ఉత్పత్తిని ఇప్పటివరకూ రోజుకు 30 లక్షలు లేదా 30.50 లక్షల బ్యారెళ్ళకు పరిమితం చేసుకుంది. హోర్ముజ్ సంక్షోభం లేకపోయి ఉంటే చమురు మిగులు ఏర్పడి ఉండేది. దీనివల్ల ధరలు తగ్గేవి. యుఎఇ ముడి చమురు కొనుగోలుకు ఎక్కువ మంది ఆసక్తి చూపించేవారు. ఒపెక్ మొత్తం ముడి చమురు ఉత్పత్తిలో 90 శాతం ఆసియా మార్కెట్లకే వెళతాయి. ప్రధానంగా జపాన్ (31.4 బిలియన్ డాలర్లు), చైనా (22.1 బి.డాలర్లు), థాయ్‌లాండ్ (14.7 బి.డాలర్లు), భారత్ (13.5 బిలియన్ డాలర్లు), దక్షిణ కొరియా (11.9 బిలియన్ డాలర్లు) దేశాలు యు.ఎ.ఇ చమురు కొనుగోలు చేస్తాయి. తన ప్రపంచ ఇంధన మార్కెట్‌ను, వర్తమాన పరిస్థితులను చాలా క్షుణ్ణంగా అధ్యయనం చేశాకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పిన విషయం అండర్‌లైన్ చేసుకోవాలి. ఇకమీదట చమురు ఉత్పత్తి, విక్రయం, మార్కెట్ అవకాశాలపై యుఎఇ స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటుంది.

ఆంక్షల చట్రంలో ఉండటంవల్ల ఊపిరి సలపడంలేదని, స్వతంత్రను యుఎఇ కోల్పోయిందని, ఈ కూటమిలో ఉండటంవల్ల మౌలిక సదుపాయాలున్నాగానీ మార్కెట్ స్థిరీకరణ చర్యల్లో భాగంగా కూటమి మాటకు కట్టుబడి ఉత్పత్తిని తగ్గించుకోవాల్సి వచ్చింది. భవిష్యత్తుల్లో ఇంధన డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని, ఈ డిమాండ్‌ను స్వతంత్ర నిర్ణయాల ద్వారా అందిపుచ్చుకుని ముందుపీఠిన ఉండాలని మజ్రూయీ కోరుకుంటున్నారు. పైగా హోర్ముజ్ జలసంధిని ఒమన్‌తో కలిసి నిర్వహించేందుకు అమెరికా ఎదుట ఇరాన్ ఒక ప్రతిపాదన చేయడం మరో అంశం. హోర్ముజ్ జలసంధి పంచాయతీ ఇప్పుడప్పుడే తెగే అవకాశం లేదు. ఒకవేళ పరిష్కారమైనాగానీ అనేక దశాబ్దాలుగా ఈ కూటమిలో అనేక అంశాలపై కొనసాగుతున్న విభేదాలు, ప్రస్తుత యుద్ధం, యుఎఇపై ఇరాన్ దాడులవల్ల కలిగిన భారీ నష్టం, భవిష్యత్ పరిణామాలు వంటివన్నీ బయటకు వెళ్ళేందుకే ఆ దేశాన్ని ప్రోత్సహించాయి.

ఒపెక్ కూటమిలో మిగిలిన దేశాలు కూడా యుఎఇ బాట పడితే ఆర్థిక పండితులు భావించినట్లు కూటమి విచ్ఛిన్నం కావడం ఖాయం. ఇది ట్రంప్‌కు ఎంతో మేలు చేస్తుంది. వెనిజులా చమురును భారీ ఎత్తున తన దేశ కంపెనీల ద్వారా ప్రపంచమార్కెట్‌లోకి తెచ్చి లాభపడేందుకు ట్రంప్ కాచుకుని ఉన్నారు. పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడే గ్లోబల్ సౌత్ దేశాల మార్కెట్‌ను యుఎఇ అందిపుచ్చుకునేందుకు వీలు కలుగుతుంది.

1967లో యుఎఇ ఒపెక్ కూటమిలో సభ్యత్వం తీసుకుంది. అరవై ఏళ్ళ అనుభవం, అసంతృప్తుల తర్వాత మరో 48 గంటల్లో కూటమి నుండి వైదొలగుతోంది. ఇప్పటికే ఒపెక్ దేశాల మధ్య రాజకీయ,భౌగోళిక కారణాలవల్ల అంతర్గత విభేదాలు కొనసాగుతున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధావకాశాన్ని యుఎఇ ఉపయోగించుకుంది.ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం చమురు నిల్వలలో 79.5 శాతం ఈ దేశాలలోనే ఉన్నాయి. పశ్చిమాసియాలోనే 67.2 శాతం నిల్వలు ఉన్నాయి.ప్రపంచ చమురు మార్కెట్‌ను ఈ కూటమి స్థిరీకరించి తన నియంత్రణలో ఉంచుకుంది. ఇకపై మార్పులు వస్తాయి.

### ఉగ్రవాద శక్తులకు నిధుల సరఫరా పేరుతో

# 35 ఇరాన్ వ్యాపార సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు



**వాషింగ్టన్:**ఇరాన్‌కు చెందిన 35 వ్యాపార సంస్థ లు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ రూపేణా ఇరాన్‌ను తనకు అనుకూలంగా లొంగదీసుకునేందుకు మరిం త ఒత్తిడి పెంచింది. ఇరాన్ షాడో బ్యాంకింగ్ రంగంలో వారు నిర్వహించిన పాత్రలకుగాను ఈ ఆంక్షలు విధించినట్లు ట్రంప్ యంత్రాంగం పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడానికి ఐఆర్‌జిసి సహా ఇరాన్ సాయుధ బలగాలు కొంతమంది వ్యక్తులు, సంస్థలతో సంబంధాలు నిర్వహిస్తున్నాయని, వారిని లక్ష్యంగా చేసుకుని ఈ ఆంక్షలు విధించామని అమెరికా ఆర్థికమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఇరాన్ తనకు అనుకూలమైన శక్తులను పెంచిపోషించేందుకు, ఆయుధాలు, క్షిపణులు సమకూర్చేందుకు డబ్బులు బదిలీ చేస్తోందని, ఇందుకోసం తమ ఆర్థిక వ్యవస్థలను ఉపయోగించుకుంటోందని పేర్కొంది. ఇరాన్ షాడో బ్యాంకింగ్ వ్యవస్థ ఈ ఐఆర్‌జిసి,సాయుధ బలగాలకు ఒక కీలకమైన ఆర్థికవనరుగా ఉపయోగపడుతూ, హింస, ఉగ్రవాదాన్ని పెంచిపోషించే ఇరుగా మారిందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు. ఈ నెట్‌వర్క్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా అక్రమ నిధులు ఉగ్రవాద కార్యకలాపాలకు ఊతం ఇస్తున్నాయిని, దీనివల్ల అమెరికా మిత్రదేశాలకు, సిబ్బందికి, ప్రపం చ దేశాలకు ముప్పు కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలు పెట్టుకుంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు.

జలసంధి మీదుగా ప్రయాణం చేసే నౌకల నుండి సుంకాలు వసూలు చేయాలని చాలాకాలంగా ఇరాన్ ఆలోచిస్తోంది. అందులో భాగంగా ఈ వసూళ్ళు ప్రారంభమయ్యాయని కొద్ది రోజుల క్రితం ఇరాన్ ప్రకటించినప్పటికీ ఏ దేశానికి చెంది న నౌక ఈ సుంకం చెల్లించి హోర్ముజ్‌ను దాటి వెళ్ళిందనే విషయాన్ని మాత్రం వారి నాయకత్వం ప్రకటించలేదు. ఈ పరిస్థితుల్లో చైనాకు చెందిన ''టీపాట్'' రిఫైనరీలతో వ్యాపారం చేస్తున్న బ్యాంకులపై కూడా ఆంక్షలు విధిస్తామని అమెరి కా హెచ్చరిక చేసింది. ప్రపంచవ్యాప్తంగా మతపరమైన ఉగ్రవాదానికి, ప్రభుత్వాలను కూల్చివేసి ఇస్లామ్ ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు వివిధ దేశాల్లో ఉగ్రవాద పోరాటానికి ఇరాన్ నిధులు సమకూరుస్తోందని చాలా కాలంగా అమెరికా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేవిధంగా ఈ సంస్థలు, వ్యక్తులు పదుల వేల సంఖ్యలో డాలర్లను తరలించేందుకు ఈ సంస్థలు, వ్యక్తులు సహకరించారని ఆరోపిస్తూ అమెరికా ఈ 35 సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధించింది. హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణం చేసేందుకు ఇరాన్ ప్రభుత్వానికిగానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌కు గానీ డబ్బులు చెల్లించే ఏ సంస్థలు లేదా వ్యాపార కేంద్రాలతో సంబంధాలు పెట్టుకోవద్దని, వ్యాపార లావాదేవీలు నిర్వహించవద్దని, అలా సంబంధా లు పెట్టుకునే వారు కూడా తీవ్రమైన ఆంక్షలు ఎదుర్కోవలసి వస్తుందని విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయాలకు చెందిన బ్యాంకులకు మరో హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ చమురు దిగుమతి చేసుకుని శుద్ధిచేసి మళ్ళీ ఎగుమతులు చేయడంలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్న షాన్ డాంగ్‌లోని చైనాకు చెందిన స్వతంత్ర టీ పాట్ కంపెనీలు, సంస్థలకు ప్రధానంగా ఈ హెచ్చరిక వర్తిస్తుందని కూడా ట్రంప్ యంత్రాంగం స్పష్టం చేసింది. డాలర్లలో లావాదేవీలు నిర్వహించేందుకు, అమెరికా వస్తువులను కొనుగోలు చేసేందుకు కొన్ని సంస్థలు అమెరికా ఆర్థిక వ్యవస్థను ఉపయోగించుకున్నాయని పేర్కొంది. ఐతే అమెరికా విధించిన ఈ ఆంక్షలను చైనా తీవ్రంగా ఖండించింది. చట్టవిరుద్ధమైన, ఏకపక్ష ఆంక్షలను వ్యతిరేకిస్తున్నట్లు తెలియజేసింది.62 రోజులుగా (ఫిబ్రవరి 28 నుండి) అమెరికా, ఇజ్రాయెల్‒ఇరాన్‌మధ్య కొనసాగుతున్న యుద్ధం ముగింపు చర్చలు ఇప్పటికీ ప్రతిష్టంభనలో ఉన్నా యి. ఐతే యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు మూడు దశల్లో చర్చలు జరిపేందుకు గడచిన సోమవారం ఇరాన్ ప్రతిపాదించిన ప్రణాళికపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌తో తమకు మెరుగైన ఒప్పందం కావాలని, ఆదరాబాదరాగా నాసిరకం ఒప్పందం చేసుకోవడానికి తాము సిద్ధంగా లేమని, తమకు ఎలాంటి తొంద రా లేదని ట్రంప్ యంత్రాంగం పదే పదే ప్రకట లు చేస్తోంది. ఈ దశలో గతంకంటే భిన్నంగా ఇరాన్ తన మిత్ర దేశాలను కూడగట్టేందుకు గట్టి ప్రయత్నాలు ప్రారంభించింది.

# అమెరికా ఏకాకి కాకూడదు

* రెండు దేశాల భాగస్వామ్యం ఇప్పుడు మరింత ముఖ్యం
* అమెరికా కాంగ్రెస్‌లో బ్రిటన్ రాజు ఛార్లెస్ ప్రసంగం

**వాషింగ్టన్:**అమెరికా‒బ్రిటన్ మధ్య ఉన్న మైత్రీబంధం ఈ భూగోళంలో మరెక్కడా లేదని బ్రిటన్ రాజు ఛార్లెస్ అన్నారు. ఈ రెండు దేశాలమధ్యా ఉన్న మైత్రి, భాగస్వామ్యం గతంకంటే ఇప్పుడు మరింత ఎక్కువ అవసరం ఉందని అన్నారు. అమెరికా ఏకాకి అవుతున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అమెరికా, పాశ్చాత్యదేశాలమధ్య ఐక్యత బలపడాలని, అమెరికా ఏకాకి కాకూడదని అన్నారు. ఈ మైత్రీబంధం రాబోయేకాలంలో మరింతగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. నాలుగు రోజులు అమెరికా పర్యటనలో భాగంగా ట్రంప్ ఇచ్చిన విందు కార్యక్రమంలో రాజు ఛార్లెస్‌తో పాటు రాణి కామిల్లా పాల్గొన్నారు. ఆ తర్వాత అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఉక్రేన్‌ను రక్షించడం కోసం పాశ్చాత్యదేశాలన్నీ ఐక్యం కావాలని పిలుపు ఇచ్చా రు. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం లో కలిసి రాలేదని బ్రిటన్‌తోసహా పాశ్చాత్యదేశాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తరుణంలో ఆయన అమెరికా పర్యటనకు వెళ్ళారు.



# నైజీరియాలో కాల్పులు : 29 మంది మృతి

**అబూజా:**పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియాలో ఒక సాయుధ దుండగుడు 29 మందిని కాల్చి చంపాడు. ఇదే సమయంలో మరోచోట ఒక అనాథాశ్రమంపై దాడిచేసి ఉగ్రవాదులు 23 మంది పిల్లల్ని కిడ్నాప్ చేశారు. తర్వాత వీరిలో 15 మందిని విడిపించారు. కాగా అడమవ రాష్ట్రం గుయాకు గ్రామంలో అనేక గంటలసేపు సాయుధవ్యక్తి ఈ కాల్పులు కొనసాగించాడని, దీనివల్ల భారీగా ఆస్తినష్టం సంభవించిందని అధికారులు చెప్పారు. అడమవ గవర్నర్ అహ్మదు ఉమరు ఫింతిరి ఈ ఘటనపట్ల తీవ్రంగా చలించిపోయారు. కన్నీటి పర్యంతమయ్యారు. తన ప్రజలను అమానుషంగా కాల్చి చంపారన్నారు. ''నా సోదరులు, సోదరీమణులు కాల్పుల్లో మరణించిన ప్రదేశంలో నేను నిలబడి ఉన్నాను, ఇది అమానవీయ సంఘటన, ఈ ఘటనకు బాధ్యుడైన నిందితుణ్ణి శిక్షించకుండా ఊరికే వదిలిపెట్టకూడదు, ఇది పిరికిపంద చర్య'' అని ఆగ్రహావేశాలు,ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక్కడ చురుకైన పాత్ర వహిస్తున్న ఐఎస్ఐఎల్ సంస్థకు తెర వెనుక ప్రధానంగా అల్‌ఖైదాతోపాటు మరో అతిపెద్ద అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ మద్దతు ఇస్తూ నిధులు, ఆయుధాలు సమకూరుస్తూ ప్రోత్సాహం ఇస్తున్నాయి. ఐతే ఏ సంస్థ ఈ కాల్పుల వెనుక ఉందనే విషయం వెంటనే తెలియరాలేదు. కాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా, ఇతర కన్జర్వేటివ్ నాయకులు ఈ చర్యను ఖండించారు. నైజీరియా ప్రభుత్వం క్రైస్తవుల ఊచకోతను అడ్డుకోవడంలో విఫలమవుతోందని ట్రంప్ అన్నారు.

# 95.15% పాస్

(మొదటి పేజీ తరువాయి)

89.14 శాతం, ఇంగ్లీష్ మీడియంలో 95.86 శాతం, ఉర్దూ మీడియంలో 86.71 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

**రీ కౌంటింగ్, వెరిఫికేషన్..**

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు గురువారం నుంచి మే 14వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మార్కుల రీ కౌంటింగ్ కోసం రూ. 500లు , రీ వెరిఫికేషన్ కోసం ఒక్కో సబ్జెక్ట్‌కు రూ. 1000లను చెల్లించాల్సి ఉంటుంది. కాగా జూన్ 5 నుంచి 12వ తేదీ నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా మే14వ తేదీ వరకు అడ్వాన్సుడు సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారు. అయితే ఆయా సబ్జెక్ట్ పరీక్షకు రెండు రోజుల ముందు వరకు రూ.50ల ఆలస్య రుసుముతో ఫీజును చెల్లించేందుకు అవకాశం .

**మేనేజ్‌మెంట్ వారీగా ఉత్తీర్ణత శాతం**

| | |
|---|---|
| ప్రభుత్వ పాఠశాలల్లో | 86.18 శాతం ఉత్తీర్ణత |
| జెడ్‌పి పాఠశాలల్లో | 93.53 '' |
| మోడల్ పాఠశాలల్లో | 97.83 '' |
| కెజిబివి పాఠశాలల్లో | 98 '' |
| టిజి రెసిడెన్షియల్ పాఠశాలల్లో | 98.64 '' |
| మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో | 98.08 '' |
| సాంఘీక సంక్షేమ పాఠశాలల్లో | 99.1 '' |
| గిరిజన సంక్షే పాఠశాలల్లో | 98.13 '' |
| ఆశ్రమ పాఠశాలల్లో | 96.58 '' |
| బిసి సంక్షేమ పాఠశాలల్లో | 98.99 '' |
| ఎయిడెడ్ పాఠశాలల్లో | 92.37 '' |
| ప్రైవేటు పాఠశాలల్లో | 95.81 '' |

**సబ్జెక్ట్‌లవారీగా ఉత్తీర్ణత ...**

| | |
|---|---|
| ప్రథమ భాషలో | 99.12 శాతం |
| ద్వితీయ భాషలో | 99.97 '' |
| తృతీయ భాషలో | 98.98 '' |
| గణితంలో | 97.46 '' |
| సామన్యశాస్త్రంలో | 98.41 '' |
| సాంఘీక శాస్త్రంలో | 99.61 '' |

# దేశ వ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్రంలో కూడా పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్రంలో కూడా ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీలు కలిసి పరిస్థితిని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయని కేంద్ర బొగ్గగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అవసరానికి మించి పెట్రోల్,డీజిల్‌ను నిల్వ చేయవద్దని, దేశంలో సరిపడా నిల్వలు ఉన్నాయని వివరించారు. ప్రతి ఒక్కరికీ అవసరమైన మేరకు పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంటుందని, కొరత ఉన్నదనే తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా,లభ్యత అంశంపైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులతో హైదరాబాద్‌లోని దిల్ కుషా అతిథి గృహంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొంతమంది రాజకీయ నాయకులు, సోషల్ మీడియా ద్వారా ధరలు పెరుగుతాయని తప్పుడు ప్రచారం చేయడంతో ప్రజల్లో భయం నెలకొందని, తద్వారా అవసరానికి మించి నిల్వ చేసుకుంటున్నారన్నారు. గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఉందని పెద్ద ఎత్తు న ప్రచారం జరుగుతోందని, అంతకుముందు ఎల్‌పిజి కొరత అని ప్రచారం చేశారని, కానీ ఎక్కడా కొరత లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు సుమారు 6400 కిలోలీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతుండగా, ప్రస్తుతం 10,300 కిలో లీటర్లకు పెంచామని, హైదరాబాద్ నగరంలో సాధారణంగా 3200 కిలోలీటర్లు సరఫరా ఉండగా, ఇప్పుడు 6400 కిలోలీటర్లకు పెంచామని వివరి ంచారు. డీజిల్ సరఫరాను కూడా 8000 కిలో లీటర్ల నుంచి



15,500 కిలో లీటర్లకు పెంచామన్నారు. మొత్తం 4325 పెట్రోల్ పంపుల్లో ఉదయం వరకు 106 పంపుల్లో మాత్రమే తాత్కాలికంగా స్టాక్ సమస్య కనిపించిందని, ఈ సమస్య కూడా ముందస్తు చెల్లింపు లు చేయకపోవడం,ఆలస్యంగా సరఫరా కావడంతో స్టాక్ సమస్య ఏర్పడిందన్నారు. ఇళ్లలో పెట్రోల్ నిల్వ చేయడం ప్రమాదకరమని, ముఖ్యంగా వేసవిలో అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నదని సూచించారు. బల్క్ వినియోగదారులు (ఇండస్ట్రీస్, కంపెనీలు) రిటైల్ పెట్రోల్ బంకుల వద్ద కొనుగోలు చేయకుండా, నేరుగా ఆయిల్ కంపెనీలకు ఇండెంట్ ఇవ్వాలని, 24 గంటల్లో సరఫరా చేసే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు.

# సర్కార్ చేతికి...

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌టిఎంఆర్‌హెచ్‌ఎల్ ప్రతినిధులు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో ఎల్‌అండ్‌టి లిమిటెడ్, ఎల్‌అండ్‌టి మెట్రో రైల్ లిమిటెడ్ సంస్థలతో షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్‌టిఎంఆర్‌హెచ్‌ఎల్‌కు ఉన్న వంద శాతం షేర్లను రూ.1,461.47 కోట్ల ఈక్విటీ విలువను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఒప్పందంపై హెచ్‌ఎంఆర్‌ఎల్ తరఫున ఎండి సర్ఫరాజ్ అహ్మద్, ఎల్‌అండ్‌టి లిమిటెడ్ తరఫున డి.కె.సేన్, ఎల్‌టిఎంఆర్‌హెచ్‌ఎల్ తరఫున కెవిబి.రెడ్డి సంతకాలు చేశారు.

ఈ ఒప్పందం ప్రకారం ఎల్‌అండ్‌టీ హామీతో ఎల్‌టిఎంఆర్‌హెచ్‌ఎల్‌పై ఉన్న రూ.13,538.53 కోట్ల అప్పును (2026, ఏప్రిల్ 30వ తేదీ నాటికి) తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేస్తారు. ఈ లావాదేవీకి ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా ఐడిబిఐ క్యాపిటల్ వ్యవహరించగా, లీగల్ అడ్వైజరీ సేవలను సరఫ్ అండ్ పార్ట్‌నర్స్ సంస్థ అందించింది.

**ప్రయాణికులకు అనుకూలంగా**

హైదరాబాద్‌లో ఎల్‌అండ్‌టి మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ సంస్థ 2017, నవంబర్ నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 కిలోమీటర్ల నెట్‌వర్క్‌తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్‌1ను నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మెట్రో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 86 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్‌1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్‒1, ప్రతిపాదిత ఫేజ్‒2 నెట్వవర్క్ రూపకల్పన, పనులు, ప్రణాళిక, అమలు, సేవల అందజేతలో సమన్వయం సాధ్యమవుతుంది. భవిష్యత్‌లోనూ హైదరాబాద్ నగరానికి మరింత సమగ్ర, ఆధారపడదగిన, ప్రయాణికులకు అనుకూలమైన మెట్రో రైలు నెట్‌వర్క్ ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

**ముఖ్యమంత్రితో ఎల్‌అండ్‌టి చైర్మన్ భేటీ**

ఎల్‌అండ్‌టి నుంచి మెట్రో రైల్‌ను స్వాధీనం చేసుకునే ఒప్పందానికి ముందుగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఎల్‌అండ్‌టి చైర్మన్, ఎండి ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారిద్దరి మధ్య చర్చలు జరిగాయి.

# రూ.వెయ్యి కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారంగా 2026 మార్చి వరకు ప్రతినెల ఉద్యోగులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం అమలు చేసింది. అయితే, ఉద్యోగుల ఆర్థిక అవసరాలను, వారు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ మొత్తాన్ని రూ.1000 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ నెలకు సంబంధించిన రూ.1000కోట్లను యుద్ధప్రాతిపదికన విడుదల చేశా రు.

**పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పట్ల సానుకూలత**

పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అత్యంత సానుకూలంగా స్పందించింది. అక్టోబర్ 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జిపిఎఫ్ బకాయిలన్నింటినీ ఈ నిధులతో పూర్తిగా క్లియర్ చేశారు. తమ పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరటనిచ్చే అంశం. ఉద్యోగుల ఆరోగ్య అవసరాలకు సంబంధించి మెడికల్ బిల్లులను ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా, ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు చెల్లించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం మెడికల్ బిల్లుల చెల్లింపులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. మెడికల్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లకు మోక్ష ం, ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడకూడదని ప్రభు త్వం నిర్ణయించిం ది. ఉప ముఖ్యమంత్రి చొరవతో పెద్ద మొత్తంలో నిధులు విడుదల కావడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

**స్కాలర్‌షిప్‌ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం**

రాష్ట్రంలోని పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న స్కాలర్‌షిప్ నిధుల సమస్యపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రజాభవన్‌లో బుధవారం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన స్కాలర్‌షిప్‌ల పెండింగ్ అంశంపై చర్చించారు. గత కొంతకాలంగా ఆగిపోయిన స్కాలర్‌షిప్ బకాయిలను క్లియర్ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు.

# ఒప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఆదేశించారు. మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వెంటనే లేఖ రాయాలని, గురువారం ఆయన అపాయింట్ మెంట్ తీసుకొని, నేరుగా కలిసి చర్చించే బాధ్యతను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సిఎం రేవంత్ రెడ్డికి అప్పగించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజ్ అవసరం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ రైతుల తరపున విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎక్కడైనా ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ ఇంజనీర్లు, నిపుణులతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్య సభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, సిఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఈఎన్సీ శ్రీధర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా చేపడుతున్న జియో టెస్టింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. వానలు పడేలోపు పనులు పూర్తి చేయాలని పునరుద్ఘాటించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టే కార్యాచరణ వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

**150 మీటర్లలో నిర్మిస్తే 100 టిఎంసిలు**

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ని ఎంత ఎత్తున నిర్మించాలి,ఎంత ఎత్తు నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే వీలుందనే అంశాలపై సమీక్షా సమావేశంలో తొలుత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాణహిత‒చేవెళ్ల ప్రాజెక్ట్ మీద ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం దాదాపు రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పటికే 71.5 కిలో మీటర్ల కాలువ నిర్మాణ పని జరిగిందని అధికారులు సిఎం కు వివరించారు. బ్యారేజీ 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే కనీ సం 100 టిఎంసి నీటిని వినియోగించుకునే వీలుంటుందని, తెలంగాణ ప్రయోజనాలు నెరవేరు తాయని సూచించారు. ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలన్నిటిని సద్వినియోగం చేసుకునేందుకు 150 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మించాలని నిపుణులు సూచించారు. గతంలో జరిగిన చర్చల ప్రకారం మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తు నిర్మించేందుకు అంగీకరించిందని, 152 మీటర్ల ఎత్తు నిర్మిస్తే మహారాష్ట్ర పరిధిలో ముంపు ప్రభావం ఉంటుందని, మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తు నిర్మిస్తే తక్కువ ఖర్చు తో నీటిని తీసుకునే వీలుందని ఇంజనీరింగ్ నిపుణులు సూచించారు.

### ప్రభుత్వ విధులతో సంబంధం లేకపోతే

# ప్రాసిక్యూషన్‌కు ముందస్తు అనుమతి అవసరం లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ విధులతో సంబంధం లేకపోతే ప్రాసిక్యూషన్‌కు ముందస్తు అనుమతి అవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. నమోదైన కేసులోని ఆరోపణలు అధికారిక విధులతో అనుసంధానమై ఉన్నప్పుడే ప్రభుత్వ అనుమతి అవసరమని, లేకపోతే ఆ రక్షణ వర్తించదని పేర్కొంది. ఇడి నమోదు చేసిన కేసును కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా దాఖలు చేశారని వాదిస్తూ దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ మేనేజర్ (వెస్ట్) వి. గోపాల్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎన్. తుకారాంజీ కొట్టివేస్తూ పై విధంగా తీర్పు చెప్పారు.



పిటిషనర్ తరఫున న్యాయవాది వాదిస్తూ, రూ.10వేల లంచం తీసుకోవడం, ఆదాయానికి మించిన ఆస్తులున్నాయనే ఆరోపణలతో సిబిఐ కేసు నమోదు చేసి, కింది కోర్టు శిక్ష విధించిందని, అయితే హైకోర్టు ఆ తీర్పును రద్దుచేసి నిర్దోషిగా ప్రకటించిందని వివరించారు. అనంతరం ఇడి సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసి, అది ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న తన క్లయింట్‌పై కేసు నమోదు చేసేముందు ప్రాసిక్యూషన్‌కు అవసరమైన ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని, అందువల్ల ఈడీ కేసును కొట్టివేయాలని కోరారు.

ఇదిలా ఉండగా, ఇడి తరఫు న్యాయవాది వాదిస్తూ, పిటిషనర్ లంచం తీసుకోవడంతో పాటు ఆదాయానికి మించి సుమారు రూ.3కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపారు. ఇదే అంశం పై సహనిందితురాలైన పిటిషనర్ భార్య దాఖలు చేసిన పిటిషన్‌ను ఇప్పటికే హై కోర్టు తిరస్కరించిందని పేర్కొన్నారు. ఇడి నమోదు చేసిన ఆరోపణలకు పిటిషనర్ అధికారిక విధులతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఇరుపక్షాల వాదనలు పరిశీలించి న న్యాయమూర్తి, సిఆర్‌పిసి సెక్షన్ 197 కింద ప్రభుత్వ ఉద్యోగులకు సంపూర్ణ రక్షణ లభించదని, ఆరోపణ లు, అధికారిక విధుల మధ్య సంబం ధం ఉన్నప్పుడే ఆ రక్షణ వర్తిస్తుందని వ్యాఖ్యానించారు. ఈ కేసులో ఆ సంబంధం లేకపోవడంతో ప్రభుత్వ అనుమతి అవసరం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేశారు.

# పరీక్షలను అడ్డుకుంటే కఠిన చర్యలు: ఉన్నత విద్యా మండలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ రాలేదనే కారణంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లను ఇవ్వకుండా పరీక్షలను అడ్డుకుకోవడం నిబంధనలకు విరుద్ధమని తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టిజిసిహెచ్‌ఇ) హెచ్చరించింది. ఏ విద్యార్థినైనా పరీక్షలు రాయకుండా అడ్డుకుంటే సంబంధిత కళాశాలలపైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఈమేరకు టిజి సిహెచ్ ఇ చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, శ్రీరామ్ వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరి కొన్ని కళాశాలలకు ఎలాంటి గుర్తింపు లేకుండానే పలు కోర్సులలో అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అడ్మిషన్లు పొందే ముందే విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలలకు గుర్తింపు ఉందా? లేదా? ముందే చూసుకోవాలని విద్యా మండలి సూచించింది. అనుమతి లేని కళాశాలల్లో అడ్మిషన్లు పొందితే విద్యార్థులదే పూర్తి బాధ్యత అని తెలిపింది. ఇలాంటి కళాశాలలో అడ్మిషన్లు పొందితే ఆ కళాశాల ద్వారా వచ్చే సర్టిఫికెట్లు చెల్లుబాటు కాకపోవచ్చని, స్కాలర్‌షిప్‌లు కూడా రావని సూచించింది. తప్పుడు,మోసపూరిత ప్రకటనలతో మోసపోవద్దని ఉన్నత విద్యా మండలి తెలిపింది.

# కెసిఆర్‌కు ప్రజలంటే చులకన

### టిజెఎస్ అధ్యక్షుడు ఎం.కోదండరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్‌కు ప్రజలంటే చులకన భావమని,అందుకే ఆయన ప్రజలకు దూరంగా ఉంటారని టిజెఎస్ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన ధర్నాచౌక్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 'సిపిఐ రాష్ట్ర కార్యాలయంలోని మఖ్దూంభవన్'లో అన్ని ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు వేర్వేరుగా వరసుగా ధర్నా చేశామని, చివరకు ధర్నాచౌక్ స్వాధీనం కార్యక్రమాన్ని కూడా నిర్వ హించామని ఆయన గుర్తు చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ చెప్పలేదని, తాను కూడా మంత్రి పదవిని అడగలేదని స్పష్టం చేశారు. తెలంగాణ జన సమితి(టిజెఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టిజెఎస్ జెండాను కోదండరామ్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన తనను కలిసిన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అధికారంలోనికి రాగానే కెసిఆర్‌లో మార్పు వచ్చిందని,ప్రజలకు దూరంగా ఉంటున్నారని, నిరంకుశ పాలన కొనసాగుతోందని తాము గతంలోనే చెప్పామని, ఆ మాటలనే ప్రస్తుతం కెసిఆర్ కుటుంబ సభ్యులు మాట్లడుతున్నారని, కెసిఆర్ మారిన మర మనిషి అనేది వాస్తవమేనని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తమపైన అనేక పోలీసు నిఘా పెట్టారని, ఇంట్లో నుంచి బయటకు వెళ్తే అరెస్టులు చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం మాట్లాడే, నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉన్నదని వివరించారు.



**12న జరిగే ప్లీనరీలో పలు నిర్ణయాలు :** ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో వ్యవహరించాల్సిన తీరు, పార్టీ నిర్మాణం తదితర అంశాలలో మే 12న జరిగే టిజెఎస్ ప్లీనరీలో నిర్ణయం తీసుకుంటామని ఆ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ ం.కోదండరామ్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో అనేక నిర్బంధాలు, పోలీసుల నిఘా, నియంత అరెస్టులను, దాడులను తట్టుకుని నిలబడ్డామన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసమే తమ పార్టీ పనిచేస్తుందని, గడిచిన 8 సంవత్సరాలుగా అనేక అంశాలను ప్రస్తావించిందని, నిరుద్యోగ, కార్మిక, ఉద్యమకారుల ఆకాంక్షలు తదితర అంశాలపైన పోరాటం చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్, సలీమ్ పాషా, అరుణ్ కుమార్, ఆకుల శ్రీనివాస్, సత్యనారాయణ, ఎం. నరసయ్య, హనుమంతరెడ్డి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇండ్ల స్థలాలకై ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?

### గుడిసె వాసులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలి
### ఎర్రజెండా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం
### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
### వరంగల్ లో వివిధ పార్టీల నుంచి సిపిఐలో భారీ చేరికలు



**ప్రజాపక్షం/వరంగల్ :** ఇండ్ల స్థలాల కోసం పేదలు ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ గవిచర్ల క్రాస్ వద్ద గల జీకే ఫంక్షన్ హాల్ లో లక్ష్మీ పురానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 400 కుటుంబాలు బుధవారం సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా సిపిఐలో చేరిన వారికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత అనేక సంవత్సరాల నుండి నిరుపేదలు ఇండ్లు,ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు, గుడిసె వాసులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల, గుడిసె వాసుల సమస్యల పరిష్కారం ఎర్ర జెండా పార్టీతోనే పరిష్కారం అవుతాయని అన్నారు. దేశంలో రానున్న రోజులలో కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని, ప్రజలు చట్టసభల్లో కమ్యూనిస్టులు బలంగా ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సిపిఐ ఉద్యమిస్తున్నదని, ముఖ్యంగా నిరుపేదలైన గుడిసెవాసులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలకు పట్టాల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నదని అన్నారు.ఎర్రజెండా పోరాటాలతో పేదలకు భూములు, ఇండ్లు దక్కుతాయని, ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్ కే. బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, నాయకులు సంగి ఎలేందర్, ల్యాదెళ్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

## మే 1న సిఎంతో ఆర్‌టిసి జెఎసి భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆర్‌టిసి జెఎసి ప్రతినిధి బృందం మే నెల ఒకటవ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు కలవనున్నారు. ఆర్‌టిసి సమ్మె విరమణకు చొరవ చూపిన సిఎంకు ధన్యవాదాలు తెలపనున్నారు. ఇటీవల ఆర్‌టిసి సమ్మె సందర్భంగా జరిగిన చ ర్చల్లో ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారాని కి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఆర్‌టిసి ఉద్యోగులు సమ్మె చేయగా జెఎసి నాయకులతో 24వ తేదీ సుమారు 15 గంటల పాటు చర్చలు జరిపిన డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల కమిటీ ఎట్టకేలకు వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందిస్తూ సమ్మె విరమింపజేశారు. ముఖ్యంగా ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఆర్‌టిసి కార్మి క సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం, ఉద్యోగులకు 11 శాతం పిఆర్‌సి ప్రకటనతో పాటు ఇతర డిమాండ్లపై సానుకూలతను వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న వరంగల్ నర్సంపేట డిపోకి చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరనున్నట్లు జెఎసి నేతలు తెలిపారు.

## సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు కొత్త దిశ

### టిసిసిపి నివేదికను ఆవిష్కరించిన డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో నిలుస్తోందని మరోసారి స్పష్టమైంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రూపొందించిన ట్రాన్స్‌ఫార్మింగ్ సైబర్ క్రైమ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2024–25 పనితీరు నివేదికను రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. సైబర్ నేరాల నివారణ, అమలు చర్యలు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌లో సాధించిన విజయాలను ఈ నివేదికలో సమగ్రంగా ప్రస్తావించారు. టిజిసిఎస్‌బి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి డిజి విజిలెన్స్, టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ అధ్యక్షత వహించగా, ఐపిఎస్ అధికారులు ఎఆర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్స్ ఎస్‌పి బి.సాయిశ్రీతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందనున్న డిజిపి బి.శివధర్ రెడ్డిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆయన నాయకత్వంలో తెలంగాణలో ఆధునిక, సమన్వయంతో కూడిన, ప్రజా కేంద్రిత పోలీసింగ్‌కు కొత్త ఊపొచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేకంగా సైబర్ నేరాలపై సమర్థవంతమైన ప్రతిస్పందన, సాంకేతిక వినూత్నత, విభాగాల మధ్య సమన్వయం పెంపులో ఆయన కీలక పాత్ర పోషించినట్లు శిఖాగోయల్ తెలిపారు. టిజిసిఎస్‌బి చేపట్టిన పలు కార్యక్రమాలకు ఆయన మార్గదర్శకత్వం ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. తన సేవలను విజయవంతంగా ముగిస్తున్న శివధర్ రెడ్డికి అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# జోరందుకున్న ధాన్యం కొనుగోళ్లు

### 8.50 లక్షల మెట్రిక్ ధాన్యం సేకరణ పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరి ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్న ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా ఏర్పాటు చేయాలనుకున్న 8,525 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ద్వారా కొనుగోళ్లను ప్రారంభించింది. ఇందులో ఐకెపి ఆధ్వర్యంలో 2,623 కేంద్రాలు, సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు, ఇతర సహకార సంస్థల ద్వారా 353 కేంద్రాలు పని చేస్తున్నాయి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6,500 లారీలను అందుబాటులో ఉంచారు. అన్ని జిల్లాల్లో దాదాపు 43 వేల మంది శిక్షణ పొందిన సిబ్బంది కొనుగోళ్లలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు సుమారు 8.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం మిల్లులకు తరలించారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఆటోమేటెడ్ డ్రైయర్లు, క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు. గత సీజన్ గన్నీ బ్యాగ్‌ల సమస్యతో ఇబ్బందులు ఎదురుకాగా దానిని దృష్టిలో పెట్టుకుని ఈసారి అదనంగా, సుమారు 20 కోట్ల గన్నీ సంచులు ముందుగానే నిల్వ ఉంచారు, తద్వారా కొనుగోళ్లు ఎక్కడా నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు రైతుల నుంచి దాదాపు రూ.2031 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా.. ఇందులో దాదాపు రూ.323 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశారు.



**ఇతర పంటల కొనుగోళ్లు :** ధాన్యంతో పాటు రాష్ట్రంలో ఇతర పంటల కొనుగోళ్లు కూడా కొనసాగుతున్నాయి. ఈసారి 43.20 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనా ఉండగా ఇప్పటివరకు 3.46 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు చేశారు.దాదాపు రూ.830.69 కోట్ల విలువైన కొనుగోళ్లతో 64,779 మంది రైతులు లబ్ధి పొందారు. 1.25 లక్షల మెట్రిక్ టన్నుల శనగ పంట దిగుబడి అంచనా కాగా ఇప్పటివరకు 30,220 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేశారు. దీనివల్ల 15,933 మంది రైతులు లబ్ధి పొందారు. పొద్దుతిరుగుడు పంటకు 19,808 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేయగా, ఇప్పటివరకు 3,492 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయగా. 2,512 మంది రైతుల లబ్ధి పొందారు.

## బెంగళూరులో రెవెన్యూ క్లబ్ ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కర్నాటక వంటి రాష్ట్రాలు తమ సంస్థల ద్వారా ఆదాయ మార్గాలను సృష్టించుకుని, స్వయం సమృద్ధిని సాధించడం, అధికారుల నైపుణ్యాభివృద్ధిని సంస్థాగతంగా అభివృద్ధి చేయడం వంటి అంశాలు తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తాయని టిజి ఇజెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ఇలాంటి అధ్యయన పర్యటనల ద్వారా మంచి పద్ధతులను గుర్తించి, వాటిని తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా స్వీకరించడం అత్యంత ప్రాము ఖ్యమైనదన్నారు. కర్నాటక అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (కెఎఎస్), రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో రెవెన్యూ క్లబ్, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కర్నాటక సిఎం సిద్ధరామయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఇజెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి, కో చైర్మన్ కె.రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభు త్వ సేవల్లో అధికారులు సమగ్రత, సమర్థత కలిగి ఉండేందుకు రెసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఏ విధంగా ఉపయోగ పడుతుందని లచ్చిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సమాజంలో జైళ్ల శాఖ బాధ్యత కీలకం

### 'సికా'లో ఢిల్లీ జైళ్ల సిబ్బందికి శిక్షణ
### ప్రారంభించిన డిజిపి శివధర్ రెడ్డి

**ప్రజాపక్షం /హైదరాబాద్:** సమాజంలో జైళ్ల శాఖ బాధ్యత కీలకమని, ఖైదీలను సరిదిద్దుతూ తిరిగి వారిని సమాజంలో భాగస్వాములను చేయడం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్: చంచల్‌గూడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా)లో ఢిల్లీ జైళ్ల సిబ్బందికి ప్రాథమిక ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని తెలంగాణ డిజిపి ప్రారంభించారు. ఈ ఏడాదిలో మొత్తం 381 మంది ఢిల్లీ జైళ్ల సిబ్బందికి దశల వారీగా శిక్షణ ఇవ్వనుండగా, తొలి విడతలో 62 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. వీరిలో అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, మహిళా వార్డర్లు, తెలంగాణ జైళ్ల శాఖ సిబ్బంది కూడా ఉన్నారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ జైళ్లలో క్రమశిక్షణ, నిష్పక్షపాతం, మానవతా దృక్పథంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జైళ్ల శాఖ నిర్వహణ అత్యంత సంక్లిష్టమైనదని, శిక్షణార్థులు వృత్తిపరమైన నైపుణ్యం, క్రమశిక్షణతో పాటు మానవతా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఖైదీల పట్ల గౌరవభావంతో మెలిగినప్పుడే ఆశించిన సంస్కరణలు సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. తెలిసో, తెలియకో చట్ట వ్యతిరేకంగా వ్యవహరించినందువల్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలలో మార్పు తీసుకువచ్చి సమాజంలో సత్ప్రవర్తనతో జీవించేలా వారిని మార్చాలన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన పేరిట అడపా దడపా వస్తున్న విమర్శలను జైళ్ల శాఖలో ఉద్యోగం చేస్తున్న వారు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. శిక్షణలో అసిస్టెంట్ సూపరింటెండెంట్లకు, వార్డర్లకు విలువలతో కూడిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ సంస్కరణలు పరిపాలనను బలోపేతం చేస్తాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 'సికా' ఉన్నత ప్రమాణాలతో శిక్షణ అందిస్తూ గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. తొమ్మిది నెలల పాటు జరిగే ఈశిక్షణలో జైలు నియమాలు, క్రిమినల్ చట్టాలు, మానవ హక్కులు, సైకాలజీ, సోషియాలజీ వంటి అంశాలతో పాటు శారీరక శిక్షణ, యోగా, పరేడ్ కూడా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జైళ్ళ శాఖ ఐజి ఎన్.మురళీ బాబు, డిఐజిలు డాక్టర్ డి.శ్రీనివాస్, ఎం.సంపత్, సికా ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాస రెడ్డి, జైళ్ల శాఖ ఉన్నతాధికారులు, సికా అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి 60వ జన్మదినాన్ని సిబ్బంది ఘనంగా నిర్వహించారు.



## హైకోర్టుకు సిఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోర్టు ధిక్కరణ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం హైకోర్టు విచారణకు స్వయంగా హాజరయ్యారు.ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్నప్పుడు దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో ఆయన వ్యక్తిగతంగా హాజరయ్యారు. సూర్యాపేట జిల్లాలో నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న ఇద్దరు పార్ట్ టైం స్వీపర్లు ఇంక్రిమెంట్లతో పాటు కనీస వేతనాన్ని చెల్లించాలన్న గత ఉత్తర్వులను అమలు చేయలేదంటూ స్వీపర్లు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ విచారించారు. కోర్టు ఉత్తర్వులు అమలు చేసినట్టు రామకృష్ణారావు తరపున ప్రభుత్వ న్యాయవాది అఫిడవిట్ దాఖలు చేశారు దీంతో పిటిషన్ పై హైకోర్టు విచారణను ముగించింది.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో మెరిసిన సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్ఎస్‌సి ఫలితాల్లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 235 గురుకుల విద్యాసంస్థల నుండి మొత్తం విద్యార్థులు 16,845 అందులో బాలురు 6,211, బాలికలు 10,634 హాజరు కాగా, అందులో 16,693 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 6,127 మంది ఉత్తీర్ణత సాధిస్తే, బాలికలు 10,566 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 99.1 శాతం అందులో బాలుర ఉత్తీర్ణత శాతం 98.65 శాతం, బాలికల ఉత్తీర్ణత శాతం 99.36 శాతంగా ఉంది. 600 మార్కులకు గాను ఇస్లావత్ తిరుపతి 590, మంజుల 583, లహరి 583, వినయ్ కుమార్ 581, దుర్గం శివమణి 581, ప్రవీణ 580 సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంస్థ సాధించిన ఈ విశిష్ట ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా విద్యార్థుల ప్రతిభను అభినంది, ప్రభుత్వం చేపడుతున్న విద్యాసంస్కరణలు ఇది స్పష్టమైన ఫలితం అని పేర్కొన్నారు.

# మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

### నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదేళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్, పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తెలంగాణకు ఎలాంటి న్యాయం చేయలేదని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్‌లు తెలంగాణ ఏమి చేశాయని ప్రజలు వారికి ఓటు వేస్తారని ప్రశ్నించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అధికారం కోసం బిజెపి, బిఆర్ఎస్ పార్టీ లు పగటి కలలు కంటూ కాంగ్రెస్ పార్టీపై దుమ్మె త్తి పోస్తున్నాయని, వారి ఆశలు ఆడియాసలు అ వ్వడం తప్పదని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నదని, రూ.8 లక్షల కోట్లు అప్పు చేసి, పుట్టిన బిడ్డ నెత్తి మీద కూడా అప్పుల భారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అద్భుతమైన ప్రజాపాలన చేస్తున్నదని వివరించారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు రూ.500 బోనస్, సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత్ బస్ సౌకర్యం, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500 లకు గ్యాస్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ లాంటి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మల్లు రవి పేర్కొన్నారు.

# కాంగ్రెస్ భవన్ ఏర్పాటు ఎన్నో ఏళ్ల కళ

### దేశాన్ని కులాలు, మతాల పేరిట బిజెపి విభజిస్తోంది
### టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కాంగ్రెస్ భవన్ ఏర్పాటు ఎన్నో ఏళ్ల కల సాకారమవవటం సంతోషంగా ఉందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యాలయ నిర్మాణం అవసరమని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మహిళా శిశు సంక్షేమశాఖ పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, నగర మేయర్ ఉమారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందన్నారు. పార్టీ బలోపేతమయ్యేందుకు కార్యాలయాల నిర్మాణం అవసరమన్నారు. నిజామాబాద్‌లో నిర్మించబడుతున్న ఈ భవనం కార్యకర్తలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ప్రజాపాలనలో పారదర్శకత బాధ్యతాయుత సేవలను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ భవనాలు ఏర్పాటు చేయాలనేది ఎన్నో ఏళ్ల కల అని పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా మొదట సొంత జిల్లాలో పార్టీ కార్యాలయానికి భూమిపూజ చేయటం సంతోషకరమన్నారు. భవన నిర్మాణం పూర్తయ్యాక రాహుల్‌గాంధీ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణం పార్టీ కార్యకలాపాలకు కొత్త ఊపు తీసుకవస్తుందన్నారు. క్యాకర్తల సమన్వయానికి ఇది కీలక కేంద్రంగా మారుతుందన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతామని, త్యాగం అంటే కాంగ్రెస్ పార్టీ అని, దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన నేతలు కాంగ్రెస్ నాయకులన్నారు. దేశాన్ని కులాలు మతాల పేరిట బిజెపి విభజిస్తోందన్నారు. కవిత ప్రశ్నలకు జవాబు చెప్పలేక కెసిఆర్ సతమతమవుతున్నారని, కవిత పార్టీని స్వాగతిస్తున్నామని, పదేళ్ల బిఆర్ఎస్ పాపపు పాలనలో ఆమె పాత్ర కూడా ఉందన్నారు. ఎన్ని పార్టీలు వచ్చిన వచ్చే ఎన్నికల్లో 100 కు పైగా సీట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. సోనియాగాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ ఇస్తే, కేసీఆర్ తెలంగాణను 50 ఏళ్లు వెనక్కి నెట్టారన్నారు. రాష్ట్రంలో బిజెపి పార్టీ మొలకెత్తదు, ఆ పార్టీకి భవిష్యత్తు లేదని మళ్లీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ నిజామాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి ఇదొక కీలక మైలురాయి అని అన్నారు. పార్టీ కార్యకర్తల కోసం ప్రత్యేకంగా కార్యాలయం నిర్మాణం జరగడం ప్రజలకు మరింత సమీపంగా సేవలందించే అవకాశముంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని ఈ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి కూడా కేంద్రంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, డీసీసీ కార్పోరేషన్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు వైసాక్షి సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రైతుల రుణమాఫీ కోసం హైకోర్టుకు హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** రుణమాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్టు పెట్టి..మాట తప్పి రైతు నోట్లో మట్టి కొట్టిన రేవంత్ రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కాక రైతులు పడుతున్న కష్టాలు, కన్నీళ్లు చూసి చలించిపోయిన శాసనసభ ఉప ఫ్లోర్ లీడర్ న్యాయపోరాటానికి సిద్ధమైనారు. రైతుల రుణమాఫీ కోసం హైకోర్టులో మాజీ మం త్రి హరీష్‌రావు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సిద్దిపేట నియోజక వర్గంలో రుణమాఫీకి అర్హులైన రైతులు 43.363 రైతులుండగా, ప్రయోజనం పొందిన వారు 20.514 మంది మాత్రమే ఉన్నారన్నారు. రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతులు 22.849 మంది ఉన్నారని , నియోజకవర్గంలో కేవలం 47శాతం మాత్రమే ఉన్నారన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని ప్రకటించి ఆ పైన అప్పులను రైతులు చెల్లిస్తేనే మాఫీ వరిస్తుందని షరతు విధించిందన్నారు. దీంతో రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి అదనపు మొత్తం చెల్లించారు. ప్రభుత్వం మాఫీ చేస్తుందని ఆశపడితే ఇంతవరకు నిధులు విడుదల చేయకుండ రైతులను తీవ్ర ఇబ్బందులను గురిచేస్తుందన్నారు. బ్యాంకుల నుండి రైతులకు వత్తిడి,వడ్డీల భారం పెరిగిపోయి రైతులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. నియోజక వర్గంలో వేలాది మంది రైతుల కష్టాలను పరిగణలోకి తీసుకొని రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద హైకోర్టును ఆశ్రయించినట్లు ఎమ్మెల్యే హరీష్‌రావు తెలిపారు.ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు పడుతున్న ఇబ్బందులను కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.రైతుల ఖాతాల్లో వెంటనే రుణమాఫీ జమచేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన 22.849 రైతుల ఖాతాల్లో రుణ మాఫీ నిధులు జమచేసి, బ్యాంకుల వేధింపుల నుండి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ద్వారా తమ రైతులకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉందని హరీష్‌రావు విశ్వాసం వ్యక్తం చేశారు.



## ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: మహేష్‌కుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం,ఉపాధ్యాయుల మార్గదర్శకత ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతీ విద్యార్థి భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పరీక్షల్లో ఆశించిన ఫలితాలు రాని విద్యార్థులు నిరుత్సాహపడకుండా మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్.

Short Tender Notice No. Engg-03/CMC/PTC-C-46/2026-27, తేది: 29.04.2026

**NIT No.** Short Tender Notice No. Engg-03/CMC/PTC-C-46/2026-27, తేది: 29.04.2026, **పని పేరు:** 2 మంది డ్రైవర్లు పటాన్‌చెరు సర్కిల్-46లో హౌస్ కీపింగ్ మరియు డ్రైవర్ల నియామకం., **అంచనా విలువ / ఇసివి:** రూ.50.50లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 30.04.2026 ఉ.10.30గం.లకు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 06.05.2026 మ.3.00గం.ల వరకు, ఇ.ఇ. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, ఫోన్ నెం. 9154167952. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.in, పటాన్‌చెరు సర్కిల్-46లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 1620-PP/CL/ADVT/2026-27, Date: 29-04-2026



## స్టేట్-2 మార్కులతో 'జయ'ప్రభంజనం

**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఎస్ఎస్‌సి 2026 ఫలితాలలో జయ పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారు. డి. రిత్విక 596 మార్కులతో స్టేట్ 2 సాధించడంతోపాటు 11 మంది విద్యార్థులు 590పైగా మార్కులు సాధించారు. 61 మంది 580 ఆపైన, 143 మంది 570 ఆపైన, 238 మంది 560 ఆపైన, 330 మంది 550 ఆపైన, 586 మంది 500 ఆపైన మార్కులతో పాటు హాజరైన ప్రతి ముగ్గురిలో ఇద్దరు విద్యార్థులు 500 ఆపైన మార్కులు సాధించారని కరస్పాండెంట్ జయవేణుగోపాల్ రెడ్డి, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందించారు.

**590పైన సాధించిన విద్యార్థులు...**
దాసరి రిత్విక 596, బోడ ప్రసన్న 595, కట్ట దేవిప్రియ 594, పోతుగంటి శ్రీశ్వాస 594, బుడిగ సాన్విక 593, తిప్పణి శ్రీజరెడ్డి 593, కైరోజు హేమంత్ సాయి 592, భురెడ్డి హర్షిత 591, కక్కిరేణి ప్రజ్వల 591, నిమ్మల వైశాలి 591, తోవిటి సహస్ర 591తోపాటు స్కూల్ అందరూ విద్యార్థులు సగటు మార్కులు 540 సాధించినట్లు తెలిపారు. ప్రతిభన కనబరచిన విద్యార్థిని విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, సహకారం అందించిన తల్లిదండ్రులను వారు అభినందించారు.

## 'శ్లోక' విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/సూర్యాపేట** : స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్లోక ది స్కూల్ విద్యార్థులు తమ ప్రభంజనాన్ని చాటారు. పాఠశాలకు చెందిన సింగం అక్షిత 591/600 మార్కులు, శ్రీపాది శ్రీవిజ్ఞ 589/600, కొత్తపల్లి కౌశిక్ రెడ్డి 587/600, తొగరు కీర్తిక 582/600, కుంచం వైష్ణవి 581/600, యర్రంశెట్టి హర్షిత 580/600 మార్కులు సాధించగా 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 32 మంది ఉన్నారు. మొత్తం విద్యార్థులు 78కి గాను 500కు పైగా మార్కులు సాధించిన వారు 66 మంది. 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. పాఠశాల చైర్మన్ మారం వెంకట్‌రెడ్డి 10 ఫలితాలలో ప్రభంజనం చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. 591 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన సింగం అక్షితకు రూ.50వేల నజారానా ప్రకటించారు.

**తేజ టాలెంట్‌లో...** తేజ టాలెంట్ స్కూల్ విద్యార్థులు పది పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన ఎం. యశ్వంత్ 580/600 మార్కులు పొందారు. మొత్తం పాఠశాలలో 18 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ఇందులో 12 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించిన వారు ఉండగా, నూటికి నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

## కాకతీయ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన ఎస్ఎస్‌సి ఫలితాలలో కాకతీయ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. 600 మార్కులకు గాను భూక్య విష్ణు ప్రదీప్ 579, చింతల రక్షిత్ తేజ 573, మాలి హరిణి 573, మట్టపల్లి రోహన్ ఆదిత్య 571 మార్కులు సాధించారు. 35 మంది విద్యార్థులలో 31 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ గుండా హరి నారాయణ, ప్రిన్సిపాల్ గాలి రమేష్, డైరెక్టర్ జి.వి, ఉపాధ్యాయులు అభినందించారు.

## మత్తు పదార్థాల నెట్‌వర్క్‌ను ఛేదించాలి

నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్

పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు 10వ స్థానం




**ప్రజాపక్షం/నల్లగొండ:** యువత మత్తు పదార్థాల బారిన పడకుండా విస్తృత అవగాహన కల్పించడంతోపాటు, జిల్లాలోకి మత్తు పదార్థాలు వచ్చేందుకు ఆస్కారం ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తించి అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మత్తు పదార్థాల నివారణపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎన్‌కార్డ్ సమావేశంలో ఆయన మాట్లాడారు అన్ని పాఠశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు,సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని,సంక్షేమ హాస్టళ్లు, కళాశాలల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.అన్ని హాస్టళ్లలో సే నో టు డ్రగ్స్,బ్యానర్లు ఏర్పాటు చేసి,అన్ని మాధ్యమాల ద్వారా ప్రచారం చేపట్టాలన్నారు.నల్లగొండ డివిజన్‌లో 15 మత్తు పదార్థాల కేసులు నమోదయ్యాయని,నల్లగొండ,నార్కట్‌పల్లిలో నెట్‌వర్క్‌ను ఛేధించి అడ్డుకట్ట వేసేందుకు ఈగిల్ టీమ్స్‌ను యాక్టివేట్ చేయాలని, సోర్స్ నెట్‌వర్క్‌ను గుర్తించాలని ఆదేశించారు.బుధవారం వెలువడిన ఫలితాల్లో జిల్లా 98.47 ఉత్తీర్ణతతో 10వ స్థానంలో నిలిచినందుకు విద్యాశాఖ అధికారులు,సిబ్బంది,విద్యార్థులు,తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు.ఈ సమావేశంలో ఏఎస్‌పి రమేష్,స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,డీటీసీ వాణి,డీడబ్ల్యూఓ కృష్ణవేణి,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్,ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధురాలిపై దాడి.... బంగారం చోరీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడలో మంగళవారం రాత్రి ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఉండగా ఆమెపై దాడి చేసి బంగారం చోరీ చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన బైసాని లక్ష్మమ్మ మంగళవారం రాత్రి 9గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆమె ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై దాడి చేసి గొలుసు చోరికి పాల్పడ్డారు. ఈ ఘటనలో లక్ష్మమ్మకు గాయాలయ్యాయి. సమీపంలోని ఒక వాట్ ప్లాంట్ వద్ద ఉన్న సీసీ టీవీ ఫుటేజీలో అనుమానితులు వెళ్తున్న వీడియో రికార్డ్ అయింది. ఫుటేజీలో బంగారం దొంగతనానికి వచ్చిన అనుమానితులుగా భావిస్తున్నారు. వారు ఒక బైక్‌పై వచ్చారు. ఈ సమయంలో ఒక వ్యక్తి రెడ్ టీషర్ట్ ధరించి పల్సర్ బైక్‌పై వచ్చినట్లుగా స్పష్టంగా కనిపిస్తుంది.

# కొత్తాసుపత్రిలో వైద్యపరికరాలేవీ?

ప్రారంభానికి నోచుకోని వందపడకల ఆసుపత్రి

మేలో ముహూర్తం ఫిక్స్ అయ్యేనా..?

మెరుగైన వైద్య సేవల కోసం ప్రజల ఎదురుచూపులు




**ప్రజాపక్షం/నకిరేకల్:** అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుగా నకిరేకల్ 100 పడకల ప్రభుత్వ దవాఖాన పరిస్థితి తయారైంది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక సదుపాయాలతో ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి చేసినా,అవసరమైన వైద్య పరికరాలు అందక కొన్ని నెలలుగా ప్రారంభానికి నోచుకోవడం లేదు.భవనం సిద్ధంగా ఉంది.. సిబ్బంది మంజూరయ్యారు.. మౌలిక వసతులు పూర్తయ్యాయి.. కానీ పరికరాల కొరతతో దవాఖానా తలుపులు మాత్రం ఇంకా తెరుచుకోలేదు. దీంతో నకిరేకల్ ప్రజల ఆశలు మరోసారి నిరీక్షణలోనే నిలిచిపోయాయి.నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి, శాలిగౌరారం మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ ఆసుపత్రిలో ల్యాబ్, ఎక్స్‌రే, స్కానింగ్, ఫార్మసీ, రేడియాలజీ, అంబులెన్స్‌తో పాటు పలు ప్రత్యేక విభాగాల వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయి. నకిరేకల్‌లో నిర్మించిన ఈ100 పడకల దవాఖానా ప్రారంభమైతే కేవలం పట్టణానికే కాదు. పరిసర నాలుగు మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని నిర్మించిన ఈ ఆసుపత్రి ప్రారంభమైతే దాని ప్రాధాన్యం మరింత పెరగనుంది. చౌటుప్పల్ నుంచి సూర్యాపేట వరకు కామినేని ఆసుపత్రి మినహా జాతీయ రహదారి వెంట పెద్ద ఆసుపత్రి లేని పరిస్థితి ఉంది.ఈక్రమంలో నకిరేకల్ 100 పడకల ఆసుపత్రి ప్రారంభమైతే రోడ్డు ప్రమాదాలు,అత్యవసర వైద్య సేవలు, ప్రాణాపాయ స్థితుల్లో చికిత్స అందించడంలో ఇది కీలక కేంద్రంగా మారనుంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై తరచూ జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లో వైద్యం అందించడంలో ఈ దవాఖానా ప్రాణాధారంగా నిలవనుంది.

**30 పడకల నుంచి 100 పడకలకు**
నకిరేకల్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 2022లో 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు.దీనికి అనుగుణంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పక్కన జాతీయ రహదారి వెంట ఐదు ఎకరాల్లో రూ.32కోట్లతో మూడు అంతస్తుల నూతన వైద్యశాల భవనాన్ని నిర్మించారు. గతేడాదికే పనులు పూర్తికావాల్సి ఉన్నా ఎన్నికలు, ప్రభుత్వం మార్పు, నిధుల జాప్యంతో ఆలస్యం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే వేము ల వీరేశం ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ బిల్లులు విడుదల చేయించడంతో నిర్మాణం పూర్తయింది.

**118 పోస్టులు మంజూరు**
100 పడకల ఆసుపత్రికి అవసరమైన వైద్యులు, సిబ్బందితో కలిపి మొత్తం 118 పోస్టులను ప్రభు త్వం మంజూరు చేసింది. వీటిలో 76 పో స్టులు భర్తీ కాగా, 44 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇం దులో 27 మంది వైద్యులు,7మంది స్టాఫ్ నర్సు లు,6 మంది పారామెడికల్ సిబ్బంది, ఒక ఆఫీస్ సిబ్బంది, ఒక క్లాస్4 ఉద్యోగి పోస్టులు ఉన్నాయి. ఆసుపత్రి ప్రారంభానికి ముందే మిగిలిన పోస్టులు కూడా భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన తెలిపారు.

**వైద్యం అందిస్తాం :శోభారాణి**
**(ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్)**



ప్రస్తుతం రోజుకు 200 నుంచి 250 వరకు ఓపీ నడుస్తోంది. అందుబాటులో ఉన్న సిబ్బందితో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.వంద పడకల ఆసుపత్రి ప్రారంభమైతే అన్ని విభాగాల నిపుణ వైద్యులు అందుబాటులోకి వస్తారు.ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించగలం అని ఆమె తెలిపారు.

**మే చివరి నాటికి ప్రారంభించేందుకు కృషి**
**వేముల వీరేశం(ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే)**



నకిరేకల్‌లో నిర్మించిన 100 పడకల వైద్యశాల భవనం పూర్తయింది. పరికరాల కోసం నిధులు మంజూరయ్యాయి.కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది.మే నెల చివరినాటికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రిని ప్రారంభిస్తాం.ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన తెలిపారు.



## కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లలకు పంపాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం మండలంలోని గాంధీనగర్ పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షం వస్తే ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు కప్పి ఉంచాలని, అదేవిధంగా ధాన్యం కొన్న తర్వాత మిల్లులకు తీసుకువెళ్లే లారీలు, వాహనాలపై కూడా టార్పాలిన్లు కప్పి ఉంచాలని చెప్పారు. అనంతరం నవరత్న పార్‌బాయిల్డ్ రైస్ మిల్‌ను ధాన్యం దిగుమతులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలలో టెంట్, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవ్, తహశీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

# రెడ్డి సామాజికవర్గం పేదలను ఆదుకోవాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాజా బహదూర్ వెంకటరామారెడ్డి సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణం

సొసైటీ అభివృద్ధికి సహకరిస్తా: గుత్తా సుఖేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రెడ్డి సామాజిక వర్గంలోని పేద విద్యార్థుల చదువుల కోసం రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ కృషి చేయాలని రాష్ట్ర రోడ్డు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.బుధవారం నల్లగొండలోని ఆర్జాలబావి వేడుక కన్వెన్షన్ హాల్‌లో జరిగిన సొసైటీ సర్వసభ్య సమావేశం,నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో రెడ్డిలు ముందంజలో ఉంటారని అన్నారు.రెడ్డి సామాజిక వర్గంలో కూడా ఎంతోమంది పేదవారు ఉన్నారని వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.గ్రామాలలో ఉన్న రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సొసైటీ నుంచి ఆర్థిక సహకారం, తోడ్పాటు అందించాలని సూచించారు.రెడ్డిలు అంటే అందరూ ధనికులు లేరని,సామాన్య కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.సామాజిక సేవా కార్యక్రమాలలో రెడ్డిలు ముందంజలో ఉంటారని అన్నారు.శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులంలో అందరూ సంపన్నులు లేరని వాళ్ళలో కూడా కటిక పేదవారు ఉన్నారని అన్నారు.రైతు భరోసా ఎప్పుడు వేస్తారు అని రెడ్డిలే ఎదురు చూస్తున్నారని తెలిపారు.వ్యవసాయ రంగంలో అభివృద్ధి జరిగితేనే అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుందని అన్నారుఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి,రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి,ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్య క్షుడిగా బీరవెల్లి గోపాల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏడుదొడ్ల వెంకటరామిరెడ్డి,కర్నాటి కరుణా కర్ రెడ్డి, ఏపాల సత్యనారాయణ రెడ్డి,జాయింట్ సెక్రటరీలుగా అలుగుబెల్లి సురేందర్ రెడ్డి,దుబ్బాక వెంకట్ రెడ్డి,నీరుడు గోవర్ధన్ రెడ్డి,కోశాధికారిగా పాదూరి ఇంద్రసేనారెడ్డి లుపాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు

ఇందిరమ్మ ఇళ్లతో పాటు జర్నలిస్టులకూ ఇళ్ల స్థలాలు

మంత్రి కోమటిరెడ్డి హామీ



**ప్రజాపక్షం/నల్లగొండ** : దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పేదవాడి సొంతింటి కల నెరవేర్చడం కోసం ఒక్క ఇంటికి రూ.5 లక్షలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని తెలిపారు.బుధవారం నల్లగొండ పట్టణం 41వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద నిర్మించుకున్న ఇంటిని శ్రీనివాసరావు,పద్మ దంపతులతో మంత్రి గృహప్రవేశం చేయించారు.అనంతరం మీడియాతో మాట్లాడారు.రానున్న మూడేళ్లలో నల్లగొండ నియోజకవర్గంలో 10 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని, అవసరమైతే అదనంగా మరో 5వేల ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే పట్టణంలో సుమారు 700 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. దేవరకొండ రోడ్డు, నార్కట్‌పల్లి రోడ్డు,తిప్పర్తి రోడ్డు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలిస్తున్నామని,అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత ఇందిరమ్మ కాలనీ నిర్మాణం చేపడతామని చెప్పారు.గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలెక్టరేట్ వెనుక భాగంలో జర్నలిస్టులకు 8 ఎకరాల స్థలం కేటాయింపును క్యాబినెట్‌లో పరిశీలించారని,త్వరలో కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైతే సిఎం దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టులకు ఇళ్లు కట్టించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఓపిక పాటించాలని సూచించారు. మిల్లర్లు తేమ శాతం అధికంగా ఉందని ఇబ్బందులు పెడుతున్న నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియ కొంత ఆలస్యమైందని, ఇప్పటికే 50 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్, కార్పొరేటర్లు వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

**పద్మావతి నగర్‌లో వెంకటేశ్వర ఆలయానికి శంకుస్థాపన**
పట్టణంలోని 41వ డివిజన్ పద్మావతి నగర్ కాలనీ పార్క్‌లో రూ.2 కోట్లతో కాలనీవాసులు నిర్మిస్తున్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు.స్థానికంగా ఆలయ నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో మేలు చేస్తుందని, తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పార్క్ అభివృద్ధికి రూ.70లక్షలతో పనులు జరుగుతున్నాయని తెలిపారు.



## డ్రగ్స్‌తో జీవితం మసి... మానేస్తే ఖుషీ...

సమాజాన్ని, పిల్లలను పట్టిపీడిస్తున్న అంశం డ్రగ్స్

జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** డ్రగ్స్‌తో జీవితం మసి అవుతుంది వాటిని మానేస్తే జీవితం ఖుషి అవుతుందని, డ్రగ్స్ మన సమాజాన్ని, పిల్లలను పట్టి పీడిస్తున్న అత్యంత ప్రమాదకరమైన అంశమని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో బాలలు, మహిళా భద్రత, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, స్థానిక పౌరులతో కలిసి పట్టణ పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ర్యాలీ జిల్లా కేంద్రంలోని పిఎస్ఆర్ సెంటర్ నుండి పూల సెంటర్ మీదుగా గాంధీపార్క్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ అనేది అత్యంత ప్రమాదకర స్థాయిలో పాతుకుపోయిందని దీనిని కూకటివేళ్లతో సహా తీసివేయాల్సిన బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్క పౌరునిపై ఉందన్నారు. మహిళల, బాలల భద్రత విషయంలో పోలీసు శాఖ పటిష్టంగా కృషి చేస్తుందని దీని కోసం షీ టీం సిబ్బంది, భరోసా టీం సిబ్బంది, మానవ అక్రమ రవాణా నిరోధక బృందాలు పోలీసులతో కలిసి పనిచేస్తున్నాయన్నారు. మహిళలపై బాలలపై వేధింపులు జరిగిన వాటిని ఉపేక్షించకుండా వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు, 112 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇచ్చి పోలీసుల నుండి భద్రత పొందాలన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్, మానవ అక్రమ రవాణా నిరోధక టీం ఇన్‌స్పెక్టర్ శివకుమార్, పట్టణ ఎస్ఐలు ఐలయ్య, సాయిరాం, ఏడుకొండలు, వెంకన్న, షీ టీం ఎస్ఐ నీలిమ, భవాని నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు

**ప్రజాపక్షం/డిండి:** అకాల వర్షాల కారణంగా తడిసిన వరి ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి అన్నారు. బుధవారం చెరుకుపల్లి గ్రామంలో ఇంటింటికి సిపిఐ అనే కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజా ఆందోళనలకై ప్రజల నుండి విరాళాలను సేకరించారు. ఈకార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, సిపిఐ డిండి మండల కార్యదర్శి కనకాచారి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి హనుమంతు, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్‌కుమార్, యాదయ్య, జంగు, సైదులు, ఉపేందర్, సాగర్, నాగరాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తికొండగా గోలనుకొండ



**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు మండలం గోలనుకొండ గ్రామంలో ఘనంగా నిర్వహించిన నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన మరియు అభయ ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య సతీ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు బీర్ల అయిలయ్య , వారి కుటుంబ సభ్యులు గ్రామంలోని శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నవగ్రహ విగ్రహాలు , అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి, భక్తులకు దర్శనార్థం అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గోలనుకొండ ను భక్తి కొండగా మార్చారన్నారు. ప్రజలలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెరగాలంటే దేవాలయాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

# మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై నిఘా

కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా పెట్టాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం మినీ మీటింగ్ హాల్‌లో ఎన్‌సిఓఆర్‌డి (నార్కోటిక్స్ కోఆర్డినేషన్) సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అడిషనల్ ఎస్పి లక్ష్మీనారాయణతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ సంబంధించిన అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ కళాశాలలు , క్రీడా పోటీల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. విద్యార్థులను దుష్ప్రవర్తనల నుండి దూరంగా ఉంచేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ మరియు వార్డు స్థాయిలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, వాటి కార్యకలాపాలను క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. అలాగే ఇంటర్మీడియట్ కళాశాలల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి, దాని ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.జిల్లా విద్యా అధికారి (డిఈఓ) విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక నష్టాలను వివరించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ కాలేజీ, ఫ్యాక్టరీ, గ్రామాలలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. యువత డ్రగ్స్ కి అలవాటు పడకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి, డీఈవో సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి సాయి కృష్ణ, జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఢిల్లీ హైకోర్టు ఆన్‌లైన్ విచారణలో
# అశ్లీల దృశ్యాల కలకలం..



నిలిచిపోయిన కోర్టు కార్యకలాపాలు

**న్యూఢిల్లీ :** నేటి కాలంలో సాంకేతికత ఎంత ఉపయోగపడుతుందో, అదే స్థాయిలో దుర్వినియోగం అవుతుందనేందుకు తాజా ఉదాహరణ ఢిల్లీ హైకోర్టులో చోటుచేసుకుంది. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరుగుతుండగా ఒక వికృత ఘటన వెలుగు చూసింది. వర్చువల్ విచారణ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఒక ఆగంతకుడు అశ్లీల వీడియోను ప్లే చేయడంతో కోర్టు కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తేజాస్ కారియాలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉదయం తన విచారణలను కొనసాగిస్తోంది. సప్లిమెంటరీ లిస్ట్‌లోని కేసులను పరిశీలిస్తున్న సమయంలో, వర్చువల్ మీటింగ్‌లోకి ప్రవేశించిన ఒక వ్యక్తి ఒక్కసారిగా అశ్లీల కంటెంట్ స్క్రీన్ షేర్ చేశాడు. సదరు వ్యక్తి 'Shitjeet Sighn' అనే పేరుతో లాగిన్ అయినట్లు గుర్తించారు. విచారణ సమయంలో స్క్రీన్ మీద అశ్లీల వీడియో ప్లే కావడంతో షాక్‌కు గురైన కోర్టు సిబ్బంది వెంటనే వర్చువల్ లింక్‌ను నిలిపివేశారు. కొంత సమయం తర్వాత విచారణను తిరిగి ప్రారంభించగా, అదే వ్యక్తి మళ్లీ ప్రవేశించి రెండోసారి, ఆపై మూడోసారి కూడా అశ్లీల దృశ్యాలను ప్రదర్శించాడు. ఈ గందరగోళం మధ్య బ్యాక్‌గ్రౌండ్‌లో ఒక స్వరం వినిపించింది. 'ఇది అమెరికా నుండి జరుగుతున్న హ్యాకింగ్. వెంటనే మీటింగ్‌ను ఆపేయండి. తిరిగి దీన్ని ఆన్ చేయకండి. మీరు హ్యాక్ చేయబడ్డారు' అని ఆ వాయిస్ హెచ్చరించింది. దీంతో పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన చీఫ్ జస్టిస్.. వర్చువల్ ప్రొసీడింగ్స్‌ను పూర్తిగా నిలిపివేశారు. న్యాయవ్యవస్థలో పారదర్శకత, సమయపాలన కోసం ప్రవేశపెట్టిన వర్చువల్ విచారణలపై ఇటువంటి దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ సుప్రీంకోర్టు, ఇతర హైకోర్టుల విచారణల్లో ఇలాంటి అవాంతరాలు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించి, దీనిపై దర్యాప్తునకు ఆదేశించినట్లు సమాచారం. అశ్లీల కంటెంట్‌ను ప్రదర్శించిన వ్యక్తిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం రంగంలోకి దిగింది.

# నికోబార్ ప్రాజెక్టు అదిపెద్ద కుంభకోణం

**దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా జరుగుతున్న అత్యంత ఘోరమైన నేరాలలో కూడా ఒకటి**
**●అభివృద్ధి ముసుగులో జరుగుతున్న విధ్వంసం ● లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపాటు**



**శ్రీ విజయపురం :** అండమాన్ నికోబార్ దీవులల్లో చేపట్టిన గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుపై లోక్సభలో ప్రతిపక్షనేత రాహులుగాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. క్యాంప్‌బెల్ బే వద్ద చేపట్టిన గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్ 'దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా జరుగుతున్న అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, అదే విధంగా అత్యంత ఘోరమైన నేరాలలో కూడా ఒకటని విమర్శించారు. ఈ ప్రాజెక్ట్ వల్ల 160 చదరపు కిలోమీటర్ల వర్షారణ్యంలో లక్షలాది చెట్లను నరికివేయాల్సి వస్తుందని, ఇది అభివృద్ధి ముసుగులో జరుగుతున్న విధ్వంసం అని రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఈ విషయాన్ని తాను పార్లమెంటులో లేవనెత్తుతానని ఆయన తెలిపారు. 'నేను గ్రేట్ నికోబార్ అంతటా పర్యటించాను. నా జీవితంలో నేను చూసిన అత్యంత అసాధారణమైన అడవులు ఇవి. జ్ఞాపకానికి అందని పురాతనమైన చెట్లు. పెరగడానికి తరతరాలు పట్టిన అడవులు. ఈ ద్వీపంలోని ప్రజలు ఆదివాసీ వర్గాలు, వలసదారులు ఇద్దరూ కూడా అంతే అందమైనవారు. కానీ వారికి చట్టబద్ధంగా దక్కాల్సిన దానిని దోచుకుంటున్నారు' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. ప్రభుత్వం ఇక్కడ చేస్తున్న దానిని 'ప్రాజెక్ట్' అని పిలుస్తోందని, అయితే తాను చూసింది ప్రాజెక్టు కాదన్నారు. అది లక్షలాది చెట్లతో గొడ్డలి వేటకు సిద్ధంగా ఉన్నదని, 160 చదరపు కిలోమీటర్ల వర్షారణ్యం విధ్వంసం కానుంది. ప్రజల ఇళ్లను లాక్కుంటూ వారిని నిర్లక్ష్యం చేయడం అభివృద్ధి కాదు. ఇది అభివృద్ధి అనే ముసుగులో జరుగుతున్న విధ్వంసం' అని ఆయన ఉద్ఘాటించారు. అందువల్ల తాను సూటిగా చెబుతాను, చెబుతూనే ఉంటానన్నారు. గ్రేట్ నికోబార్‌లో జరుగుతున్నది మన జీవితకాలంలో ఈ దేశ సహజ, గిరిజన వారసత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న అతిపెద్ద కుంభకోణాలలో, అత్యంత ఘోరమైన నేరాలలో ఒకటని, దీనిని ఆపాలన్నారు. తాను చూసినదాన్ని భారతీయులు కూడా చూడాలని ఎంచుకుంటే, దీనిని ఆపవచ్చని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్, పవర్ ప్లాంట్, టౌన్‌షిప్‌తో కూడిన ఈ రూ. 81,000 కోట్ల ప్రాజెక్ట్, సముద్ర వాణిజ్యం, అనుసంధానం, భద్రతను పెంపొందిస్తుందని, తద్వారా దేశ భౌగోళికవ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను ప్రోత్సహించడంలో ఇది ఒక శక్తి గుణకంగా పనిచేస్తుందని కేంద్రం చెబుతోంది. సోషల్ మీడియాలో ఒక వీడియో సందేశంలో రాహుల్ మాట్లాడుతూ 'ఈ ద్వీపంలో నివసించే ప్రతి ఒక్కరూ ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు, కానీ వారిని ఈ ప్రాజెక్టు గురించి అడగలేదు, తమ భూమికి ఎలాంటి పరిహారం లభిస్తుందో వారికి తెలియదు. ప్రభుత్వం నేను ఇక్కడికి రావడం ఎందుకు ఇష్టపడలేదో, నన్ను ఇక్కడికి రాకుండా ఆపడానికి ప్రభుత్వం ఎందుకంత కసరత్తు చేసిందో ఇప్పుడు నాకు అర్థమైంది' అని అన్నారు. ఇది 'భారీ దొంగతనం' అని అభివర్ణించారు, ఈ విషయాన్ని పార్లమెంటులో లేవనెత్తమని ద్వీపవాసులు తనను కోరారని చెప్పారు. తాను ఆ పనిని సంతోషంగా చేస్తాను... ఈ విషయాన్ని యావత్ దేశానికి, ముఖ్యంగా యువతకు చెప్పాలన్నారు. ఎందుకంటే ఇదే మీ భవిష్యత్తు. ఇది బహుశా ఇప్పటి వరకు జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటి, భారతీయ ఆస్తికి, పర్యావరణ ఆస్తికి సంబంధించిన అతిపెద్ద దొంగతనాలలో ఒకటి అని ఆయన అన్నారు. మంగళవారం, గాంధీ ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న గిరిజన నాయకులను కలవడానికి నికోబార్ జిల్లాలోని క్యాంప్‌బెల్ బేకి వెళ్లారు. గిరిజన వర్గాలలోని ఒక వర్గం, కేంద్ర ప్రభుత్వం పారదర్శకత లోపించిందని, పర్యావరణపరమైన నష్టాలు ఉన్నాయని, గిరిజన హక్కులను నిరంతరం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తోంది. 26న అండమాన్ నికోబార్ దీవులకు చేరుకున్న గాంధీ, ఈ కేంద్రపాలిత ప్రాంతంలో కార్పొరేట్ ప్రభావాన్ని విమర్శించారు. అలాగే, అభివృద్ధిలో కార్పొరేట్ ప్రయోజనాల కంటే స్థానిక అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని నొక్కి చెప్పారు. తన పర్యటన సందర్భంగా, ఆయన నికోబరీస్ గిరిజన వర్గ సభ్యులతో ముచ్చటించారు. అలాగే, స్థిరపడిన వారి వర్గ సభ్యులను కూడా కలిశారు. ఆయన ఇందిరా పాయింట్‌ను సందర్శించి, దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి నివాళులర్పించారు. ప్రతిపాదిత ప్రాజెక్టు కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరిజన వర్గాలు ఆరోపించాయి. తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## పాక్‌కు సిగ్గుమాలిన క్లీన్‌చిట్ ఇస్తారా?

రక్షణశాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌పై కాంగ్రెస్ ఫైర్



**న్యూఢిల్లీ :** రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌పై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. బిష్కెక్‌లో జరిగిన ఎస్‌సిఒ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌కు సిగ్గుమాలిన క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన చేసిన దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్యలు దేశ వ్యతిరేకమైనవని కాంగ్రెస్ ఆరోపించింది. పాకిస్థాన్‌కు సంబంధించి ఈ కొత్త వైఖరి అంతా అమెరికాను 'బుజ్జగించడం', చైనాకు 'ప్రణాళికాబద్ధమైన లొంగుబాటు' అనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానంలో భాగమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ కూడా ఆరోపించారు. బిష్కెక్‌లో సింగ్ ప్రసంగిస్తున్న ఒక వీడియో క్లిప్‌ను రమేష్ ఎక్స్‌లో షేర్ చేశారు. అందులో సింగ్, 'ఉగ్రవాదానికి జాతీయత గానీ, మత సిద్ధాంతం గానీ లేదని మనం మర్చిపోకూడదు. నిజమైనా, ఊహాజనితమైనా ఏ ఫిర్యాదు కూడా ఉగ్రవాదానికి, మానవతా నష్టానికి సాకుగా మారదు' అని అన్నారు. దీనిపై రమేష్ స్పందిస్తూ రక్షణ మంత్రి, స్పష్టంగా ప్రధానమంత్రి ఆమోదంతో, ఆయన ఆదేశాల మేరకు, బిష్కెక్‌లో ప్రసంగిస్తూ పాకిస్థాన్‌కు సిగ్గుమాలిన క్లీన్ చిట్ ఇచ్చారు. పాకిస్తాన్ ఉగ్రవాదానికి కేంద్రం కాదా? అని రమేష్ ప్రశ్నించారు. భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్‌లో ఉగ్రవాద శిబిరాలు లేవా? పాకిస్తాన్‌లో భారత్‌కు వ్యతిరేకంగా భావజాల ప్రచారం జరగడం లేదా? ముంబయి, పహల్గామ్ ఉగ్రదాడులను పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులే సూత్రధారులుగా చేసి, అమలు చేయలేదా? అని ఆ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. '2020 జూన్ 19న చైనాకు ప్రధాని ఇచ్చిన విచిత్రమైన క్లీన్ చిట్ ఎంత దేశద్రోహమో, రక్షణ మంత్రి చేసిన దిగ్భ్రాంతికరమైన ప్రకటనలు కూడా అంతే దేశద్రోహమైనవి' అని ఆయన ఆరోపించారు. బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సులో సింగ్ ప్రసంగిస్తూ, ఉగ్రవాద కేంద్రాలు ఇకపై 'సమంజసమైన శిక్ష' నుండి మినహాయింపు పొందలేవనే భారతదేశపు దృఢ సంకల్పాన్ని ఆపరేషన్ సింధూర్ ప్రదర్శించిందని కూడా అన్నారు. 'ప్రభుత్వ ప్రేరేపిత' సరిహద్దు ఉగ్రవాదాన్ని విస్మరించవద్దని, ఈ ముప్పును ఎదుర్కోవడంలో ఎలాంటి 'ద్వంద్వ ప్రమాణాలకు' తావు ఉండకూడదని సింగ్ ఆ ప్రభావవంతమైన వర్గానికి పిలుపునిచ్చారు.

# రిగ్గింగ్ చేయడానికి బిజెపి యత్నం

కేంద్ర బలగాలు, ఎన్నికల పరిశీలకులు కాషాయ పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తున్నారు
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో రిగ్గింగ్ చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, కేంద్ర బలగాలు, ఎన్నికల పరిశీలకులు కాషాయ పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం ఆరోపించారు. అయితే, టిఎంసిపై ప్రజాగ్రహాన్ని పసిగట్టి గందరగోళం సృష్టించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ, బిజెపి మమతా బెనర్జీ ఆరోపణలను తోసిపుచ్చింది. పోలింగ్ జరుగుతున్న తన భవానిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించిన బెనర్జీ, ఈ అసెంబ్లీ ఎన్నికలలో అధికారులు ప్రజాస్వామ్య నియమాలను తీవ్రంగా ఉల్లంఘించారని ఆరోపించారు. భవానిపూర్ అసెంబ్లీ నియోజకవర్గం బెనర్జీకి రాజకీయ కంచుకోట కాగా, ఆమె ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారితో ప్రతిష్టాత్మక పోరులో నిమగ్నమై ఉన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికలలో నందిగ్రామ్‌లో ఆయన చేతిలో ఆమె ఓడిపోయారు. ఇప్పుడు జరుగుతున్న ఈ ఎన్నికలు ప్రతీకాత్మక రీమ్యాచ్‌గా పరిగణించబడుతున్నాయి. బిజెపి ఈ ఎన్నికలలో రిగ్గింగ్ చేయాలని చూస్తోందని ఆమె విలేకరులతో అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు శాంతియుతంగా జరుగుతాయని పేర్కొంటూ, ఇక్కడ గూండా రాజ్ ఉందా? అని బెనర్జీ ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల సంబంధిత హింసకు చరిత్ర ఉంది. 2021 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన హింసాకాండపై కలకత్తా హైకోర్టు సిబిఐ విచారణకు ఆదేశించింది. టిఎంసి కార్యకర్తలు, నాయకులు పోలీసులు, సిఎపిఎఫ్ సిబ్బంది చేతిలో అఘాయిత్యాలకు గురవుతున్నారని ఆరోపిస్తూ, తమ పార్టీ కార్యకర్తలు చావడానికి సిద్ధంగా ఉన్నారని బెనర్జీ అన్నారు. సాధారణంగా పోలింగ్ రోజున మధ్యాహ్నం తన కాళీఘాట్ నివాసం నుంచి బయటకు వచ్చి మిత్రా ఇన్‌స్టిట్యూషన్ స్కూల్‌లో ఓటు వేసే టిఎంసి అధినేత్రి, ఈసారి ఉదయం 8 గంటల లోపే బయటకు వచ్చి, దక్షిణ కోల్‌కతాలోని చెట్లా ప్రాంతంతో సహా నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆ తర్వాత ఆమె భవానీపూర్‌లోని చక్రబేరియాలో ఒక పోలింగ్ కేంద్రం వెలుపల కూర్చుని విలేకరులతో మాట్లాడారు. అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, కేంద్ర బలగాలు, పరిశీలకుల ద్వారా పోలింగ్ ప్రక్రియను ప్రభావితం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని ఆమె నిందించారు. బయటి నుంచి పలువురు పరిశీలకులు వచ్చి బిజెపి ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారని, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి, ఇలా ఓటింగ్ జరగగలదా?' అని బెనర్జీ అన్నారు. ముందుగానే టిఎంసి పార్టీ జెండాలన్నింటినీ తొలగించారని, బయటి వ్యక్తులు పోలింగ్ ప్రక్రియలో జోక్యం చేసుకుంటున్నారని కూడా ఆమె ఆరోపించారు. రాష్ట్రం వెలుపలి నుంచి కొందరు వ్యక్తులు నియోజకవర్గంలో అలజడి సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని, దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలని బెనర్జీ ఆరోపించారు. అధికారి అన్నారు.

# బస్సు వ్యాన్ ఢీ...

## ఆరుగురు మహిళలు మృతి, 8 మందికి గాయాలు



**సబర్‌కాంత:** గుజరాత్‌లోని సబర్‌కాంత జిల్లాలో బుధవారం ఒక జాతీయ రహదారిపై ప్రైవేట్ బస్సు వ్యాన్‌ను ఢీకొనడంతో ఆరుగురు మహిళలు మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. పోలీస్‌ల వివరాల ప్రకారం...ఆరావళి జిల్లాలోని మోడసా నుండి మహిళలను తీసుకువెళ్తున్న వ్యాన్‌ను, జిల్లాలోని షామ్లా జీ నుండి హిమ్మత్‌నగర్‌ను కలిపే జాతీయ రహదారి 48పై వేగంగా వస్తున్న బస్సు వెనుక నుండి ఢీకొట్టింది. ఆ మహిళలు సామాజిక కార్యక్రమాల కోసం పనిచేసే ఒక క్యాటరింగ్ బృందంలో భాగం. వారు పొరుగున ఉన్న ఆరావళి జిల్లాలోని మోడసా నుండి హిమ్మత్‌నగర్‌లోని హుంజ్ గ్రామంలో ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలు మృతి చెందారు. మరో ఏడుగురు మహిళలు,వ్యాన్ డ్రైవర్ గాయపడ్డారు. గాయపడిన వారిని హిమ్మత్‌నగర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని ఆసుపత్రి వైద్య అధికారి డాక్టర్ ధ్రుపద్ చౌహాన్ తెలిపారు. మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు.

## శ్రీలంక విడుదల చేసిన మత్స్యకారులు చెన్నైకి చేరిక



**చెన్నై :** శ్రీలంక నిర్బంధం నుంచి విడుదలైన తమిళనాడుకు చెందిన పదిహేను మంది మత్స్యకారులు బుధవారం ఉదయం చెన్నైకి చేరుకున్నారు. లోతైన సముద్రంలో చేపలు పడుతూ తమ ప్రాదేశిక సరిహద్దులు దాటారనే ఆరోపణలపై రామేశ్వరానికి చెందిన ఈ మత్స్యకారులను ఈ ఏడాది ప్రారంభంలో శ్రీలంక నౌకాదళం అరెస్టు చేసింది. ఇటీవల కొలంబోలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఆ ద్వీప దేశ మంత్రులతో జరిపిన చర్చల అనంతరం ఈ మత్స్యకారుల స్వదేశానికి రప్పించడం ఖరారైంది. మత్స్యకారులు తమ స్వస్థలాలకు చేరుకోవడానికి తమిళనాడు మత్స్యశాఖ రవాణా సౌకర్యం కల్పించింది. రాధాకృష్ణన్ రెండు రోజుల అధికారిక పర్యటన, శ్రీలంకలో ఒక భారత ఉపరాష్ట్రపతి జరిపిన మొట్టమొదటి ద్వైపాక్షిక పర్యటనగా నిలిచింది.

## హెచ్–1 బి విదేశీ ఉద్యోగుల వేతనాల పెంపుదలకు ఉన్నతాధికారి మద్దతు

**వాషింగ్టన్:** వివిధ వీసాలపై అమెరికా వచ్చి ఉద్యోగాలు చేసే విదేశీ ఉద్యోగులకు కనీస వేతనాలు పెంచాలనే ఫెడరల్ ప్రతిపాదనకు ఉత్తర కరోలినాలోని ఉన్నతస్థాయి కార్మికశాఖాధికారి లూక్ ఫార్లే తన పూర్తి మద్దతు తెలియజేశారు. హెచ్–1బి, హెచ్–1బి1, ఇ–3 వీసాలకింద వచ్చే విదేశీ ఉద్యోగులకు ఈ ఉన్నతాధికారి మద్దతు లభించింది. విదేశీ ఉద్యోగుల వేతనాలు తగ్గించాలని, వారి బంధువులను అమెరికాకు రాకుండా అడ్డుకోవాలని, వారి వీసాలను పరిమితం చేయాలని చట్టసభ సభ్యుల నుండి అనేక డిమాండ్లు వస్తున్న తరుణంలో ఈ పరిణామం సంభవించింది. అనర్హులను కూడా అమెరికాకు రప్పించి తక్కువ వేతనాలతో ఉద్యోగాలు చేయించుకుంటున్నారని,దీనివల్ల అమెరికన్లకు ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయని ట్రంప్ పాలనాకాలంలో తీవ్ర వ్యతిరేకత, విదేశీ ఉద్యోగులపై ఆగ్రహం పెరుగుతోంది. ''హెచ్–1 బి వీసాలవల్ల అమెరికన్లు, ఉత్తర కరోలినాలో కార్మికులకు ఉద్యోగాలు దొరకడంలేదు, హెచ్–1 బి వీసాలపై వచ్చిన ఉద్యోగుల వేతనాల్లో కోత విధించకూడదని ట్రంప్ యంత్రాంగం కొత్త నిబంధన ప్రతిపాదన చేసింది, దీనికి మద్దతు ఇస్తూ అధికారికంగా నా వ్యాఖ్యలను, వివరణలను తెలియజేశాను'' అని ఫార్లే ఒక ప్రకటనలో చెప్పారు. అమెరికా ప్రభుత్వ కార్మికశాఖాధిపతి బ్రియాన్ పాస్టెర్నక్‌కు ఒక లేఖ రాస్తూ, ప్రస్తుత వ్యవస్థలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, వీటిల్లో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని,మార్కెట్ రేటు కంటే తక్కువ వేతనాలకు యాజమానాలు విదేశీ ఉద్యోగులను నియమించుకుంటున్నారని వీటిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీనివల్ల అమెరికన్ కార్మికులపై ఒత్తిడి తగ్గుతుందని ఆ లేఖలో రాశారు. మార్చి 26న అమెరికా కార్మికశాఖ విదేశీ కార్మికులకు వేతనాల పెంపుదలకు సంబంధించి కొత్త ప్రతిపాదన చేసింది. దీనిపై మే 25వ తేదీ లోపు ప్రజలు తమ తమ వ్యాఖ్యానాలను తెలియజేయాలని కోరింది.

# అసోంలో బిజెపి, బెంగాల్‌లో తృణమూల్ ఆధిక్యత

తమిళనాడు డిఎంకె కేరళంలో యుడిఎఫ్
ఎగ్జిట్ పోల్స్ అంచనా

**న్యూఢిల్లీ:** అసోంలో బిజెపి ఘన విజ యం సాధిస్తుందని, పశ్చిమ బెంగాల్‌లో కూడా తృణమూల్ కాంగ్రెస్‌పై ఆపార్టీ స్వల్ప ఆధిక్యంలో ఉండగా, తమిళనాడులో డిఎంకెపార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని, కేరళంలో యుడిఎఫ్ వి జయం సాధిస్తుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనావేశాయి. అదేవిధంగా పుదుచ్చేరీలో ఎఐఎన్ఆర్‌సి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తిరిగి అధికార పగ్గాలు చేపడుతుందని కూడా అంచనావేశాయి. అసెంబ్లీ ఎన్నికల తుది విడత పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బుధవారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు బహిర్గతమయ్యాయి. అసోంలో బిజెపి ఘన విజయం సాధిస్తుందని, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌పార్టీపై ఈసారి బిజెపి చాలా స్పష్టమైన ఆధిక్యత సంపాదిస్తుందని ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన పలు సంస్థలు అంచనావేశాయి. అసోంలో బిజెపి క్లీన్ స్వీప్ చేస్తుందని యాక్సిస్ మై ఇండియా అంచనా వేసింది. బిజెపి దాని మిత్రపార్టీలకు 88 నుండి 100 వరకూ సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. కాంగ్రెస్ దాని మిత్రక్షాలకు 24 నుండి 36 స్థానాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలియజేసింది. ఐతే అసోంలో ఎన్‌డిఎకు 68 నుండి 72 స్థానాలు, కాంగ్రెస్ కూటమికి 22 నుండి 26 స్థానాలు వస్తాయని పీపుల్స్ పల్స్ సంస్థ చెప్పగా, మ్యాట్రిజ్ సంస్థ మాత్రం ఎన్‌డిఎకు 85 నుండి 95 స్థానాలు, కాంగ్రెస్ మిత్రులకు 25 నుండి 32 స్థానాలు వస్తాయని అంచనావేసింది. కాగా అసోం అసెంబ్లీలో మొత్త 126 స్థానాలు ఉండగా, అధికారం చేపట్టాలంటే ఏ పార్టీ, కూటమి అయినా 64 స్థానాలు దక్కించుకోవాలి. ఇక కేరళం రాష్ట్రంలో కాంగ్రెస్ సారథ్యంలోని యు.డి.ఎఫ్ కూటమి 78 నుండి 90 స్థానాలు సంపాదించుకుంటుందని, అధికార వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన 49 నుండి 62 స్థానాలు పొందితే, ఎన్‌డిఎకు 0–3 స్థానాలు వస్తాయని యాక్సిస్ మై ఇండియా స్పష్టం చేసింది. పీపుల్స్ పల్స్ మాత్రం యుడిఎఫ్‌కు 75 నుండి 85 స్థానాలు, ఎల్‌డిఎఫ్‌కు 55 నుండి 65 స్థానాలు, ఎన్‌డిఎకు 0–3 స్థానాలు లభిస్తాయని చెప్పగా, అధికార ఎల్‌డిఎఫ్‌కు 60 నుండి 65స్థానాలు, యుడిఎఫ్‌కు 70నుండి 75 స్థానాలు, ఎన్‌డిఎకు 3–5 స్థానాలు వస్తాయని మ్యాట్రిజ్ సంస్థ వెల్లడించింది. కేరళ అసెంబ్లీలో మొత్తం140 స్థానాలు ఉండగా, అధికారం పొందాలంటే ఏ కూటమి అయినా 71 స్థానాలు సంపాదించుకోవాలి. ఇక ఉత్కంఠతో అందరూ ఎదురుచూస్తున్న పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు 177 నుండి 187 స్థానాలు వస్తాయని, బిజెపికి 95 నుండి 110 స్థానాలు, వామపక్ష సంఘటనకు 0–1 స్థానం, కాంగ్రెస్‌కు 1–3 స్థానాలు వస్తాయని పీపుల్స్ పల్స్ అంచనావేయగా, బెంగాల్‌లో బిజెపికి 146 నుండి 161 స్థానాలు వస్తాయని, తృణమూల్‌పార్టీకి 125 నుండ 140 స్థానాలు వస్తాయని మ్యాట్రిజ్ అంచనావేయగా, పి–మార్క్ సంస్థ బిజెపికి 150నుండి 175 స్థానాలు, టిఎంసికి 118 నుండి 138 స్థానాలు వస్తాయని అంచనావేసింది. కాగా పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మొత్తం 294 స్థానాలు ఉండగా, ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ పార్టీ అయినాగానీ 148 స్థానాలు గెలుచుకోవాల్సి ఉంటుంది.తమిళనాడు రాష్ట్రంలో డిఎంకె కూటమి 125 నుండి 145 స్థానాలు గెలుచుకుంటుందని, బిజెపి–ఎఐఎడిఎంకె కూటమి 65 నుండి 80 స్థానాలు గెలుచుకుంటుందని, టివికెపార్టీ 18 నుండి 24 స్థానాలు పొందుతుందని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. ఇక మ్యాట్రిజ్ మాత్రం డిఎంకె–కాంగ్రెస్‌కు 122 నుండి 132 స్థానాలు, ఎఐఎడిఎంకె, బిజెపి కూటమికి 87 నుండి 100 స్థానాలు, టివికె పార్టీకి 10 నుండ 12 సానాలు వస్తాయని అంచనావేసింది. తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా అధికారం సంపాదించాలంటే ఏ పార్టీ అయినా 118 స్థానాలు గెలుచుకోవాలి. ఇక పుదుచ్చేరీలో యాక్సిస్ మై ఇండియా అంచనా ప్రకారం ఎన్‌డిఎకు 16 నుండి 20 స్థానాలు, డిఎంకె–కాంగ్రెస్‌కు 6 నుండి 8 స్థానాలు లభిస్తాయి. టివికెకు 2 నుండి 4 స్థానాలు వస్తాయి. పుదుచ్చేరి అసెంబ్లీలో మొత్తం 30 స్థానాలు ఉన్నాయి. కాగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ మే నాలుగో తేదీన జరుగుతుంది.

# దేశంలో తగ్గిన ఆసుపత్రి ఖర్చులు!

గ్రామీణ, పట్టణ ప్రజలకు
అందుబాటులో ఆరోగ్యం
ఎన్ఎస్ఒ నివేదికపై కేంద్రం ప్రకటన



**న్యూఢిల్లీ:** దేశంలో ఆరోగ్య సంరక్షణ గణనీయంగా అందుబాటులోకి వచ్చిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్.ఎస్.ఓ) నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం దేశంలో ఆసుపత్రి ఖర్చులు తగ్గాయని, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ అందుబాటులోకి వచ్చిందని, ప్రభుత్వ కృషి వల్ల రీ ఇంబర్స్‌మెంట్ లేని కుటుంబాలకు వైద్యఖర్చులు మితిమీరిపోకుండా తగ్గాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో దేశవ్యాప్తంగా 1,39,732 నివాసాలలో ఎన్ఎస్ఓ సర్వే నిర్వహించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 76,296 ఇళ్ళల్లో, పట్టణప్రాంతాలలో ఉన్న 63,436 నివాసాలలో ఈ సర్వే నిర్వహించారు. ఎన్ఎస్ఓ చేపట్టిన 80వ విడత ఇంటింటా ఆరోగ్య సర్వే కార్యక్రమంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ప్రభుత్వం నిశితంగా దృష్టికేంద్రీకరించి ప్రజారోగ్య సేవలను విస్తరించడంవల్ల, లక్ష్య నిర్దేశంతో ప్రభుత్వాల జోక్యం వల్ల ప్రజలకు గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో గతంకంటే ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎన్ఎస్ఓ నివేదిక పేర్కొంది. ఆర్యోగ్య సంరక్షణ రంగంలో కొద్ది సంవత్సరాలుగా చాలా స్థిరంగా ప్రభుత్వ పెట్టుబడుల పెరుగుదల వల్ల ఈ మేరకు ఫలితాలు లభించాయని మంత్రిత్వశాఖ తెలియజేసింది. కొన్ని కేసులకు మాత్రమే స్పెషలైజ్డ్ చికిత్స అవసరం అవుతుందని, వీటికి కూడా ఖర్చు పెద్దగా లేదని పేర్కొంది. బడ్జెట్ కేటాయింపులను ప్రభుత్వం గణనీయంగా పెంచిందని, దీనివల్ల ఆరోగ్య సంరక్షణరంగంలో మౌలిక వసతులు, సదుపాయాలు విస్తరించాయని,ప్రాథమిక,ద్వితీయశ్రేణి ఆరోగ్య సేవల విభాగాలు పటిష్టం కావడంవల్ల మానవ వనరులు కూడా దేశ గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో బలపడ్డాయని నివేదిక పేర్కొంది. దేశంలో ప్రజలు ఆసుపత్రులకు చేసే ఖర్చులు గణనీయంగా తగ్గాయని నివేదిక తెలిపింది. గత ఏడాదిలో ఆసుపత్రిపాలైన వారు చేసిన ఖర్చు సగటున రూ.11,285లుగా తేలిందని, దీన్నిబట్టి దేశంలో ఆసుపత్రి ఖర్చులు సగానికి సగం తగ్గాయని, ఖర్చు తగ్గిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.

## శబరిమల కేసు...నాస్తికుల ప్రవేశ హక్కుపై సుప్రీంకోర్టు ప్రశ్నలు

**న్యూఢిల్లీ:** కేరళ శబరిమల ఆలయంలోకి ప్రవేశ హక్కుపై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. ఆలయంలోకి ప్రవేశం కోరే వ్యక్తి భక్తుడా కాదా అన్నది ముందుగా నిర్ణయించాల్సిన అవసరం ఉందని కోర్టు స్పష్టం చేసింది. మహిళలపై మత వివక్షకు సంబంధించిన పిటిషన్లపై తొమ్మిది మంది న్యాయవర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ ప్రారంభించింది. ఉత్తర భారతదేశానికి చెందిన ఒక నాస్తికుడు శబరిమలలోకి ప్రవేశించగలడా అన్న అంశాన్ని కూడా కోర్టు పరిశీలిస్తోంది. ఆలయ ప్రవేశం కేవలం హక్కు మాత్రమేనా లేక భక్తితో సంబంధం ఉందా అన్న దానిపై స్పష్టతకు రావాలని ధర్మాసనం అభిప్రాయ పడింది. 'ప్రవేశ హక్కు కోరుతు న్న వ్యక్తి భక్తుడా కాదా అన్నది ముందుగా నిర్ణయించా లి' అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో ప్రధానంగా 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు గల మహిళల ప్రవేశంపై ఉన్న పరిమితులు చర్చకు వస్తున్నాయి. గతంలో ఈ నిషేధం శతాబ్దాలుగా కొనసాగిందని, అ యితే అది రాజ్యాంగ విరుద్ధమని కోర్టు పేర్కొంది. 2018లో సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయవర్తుల ధర్మాసనం 4:1 మెజారిటీతో తీర్పు ఇచ్చి, మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ కీలక వాదనలు వినిపించారు. ''మహిళలను వారి జీవితంలో ము ఖ్యమైన కాలంలో ఆలయంలోకి అనుమతించకపోవ దం అన్యాయం'' అని వాదించారు. ''దేవాలయంలోకి ప్రవేశించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 (1) కింద ప్రాథమిక హక్కు'' అని పేర్కొన్నారు. ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనాన్ని రద్దు చేసినప్పటికీ, మహిళలపై వయస్సు ఆధారంగా ని షేధం కొనసాగుతోందని ఆమె వాదించారు. ఇక న్యా యవర్తి జస్టిస్ బీవీ నాగరత్న వైవిధ్యాన్ని గౌరవించాల్సి న అవసరాన్ని ప్రస్తావించారు. ''మత వైవిధ్యం దేశ బ లం. దాన్ని రక్షించడం ద్వారా ఐక్యత సాధ్యమవుతుంది'' అని ఆమె అభిప్రాయపడ్డారు. 2018 తీర్పు త ర్వాత కొందరు మహిళలు మాత్రమే ఆలయంలోకి ప్ర వేశించగలిగారని, వారికి సరైన రక్షణ లభించలేదని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. మత ఆచారా లు, రాజ్యాంగ హక్కులు ...ఈ రెండింటి మధ్య సంతులనం ఎలా ఉండాలన్న అంశంపై సుప్రీంకోర్టు లోతుగా పరిశీలిస్తోంది. విచారణ ఇంకా కొనసాగుతోంది.

## పెట్రోల్‌లో 85% ఇథనాల్

# ఇంధన పరివర్తన దిశగా కేంద్రం అడుగులు

**న్యూఢిల్లీ:** ఇరాన్ యుద్ధం హార్మోజ్ జలసంధి సంక్షోభం దేశంలో ఇంధన రంగాన్ని అతలాకుతలం చేసింది. దేశంలో గ్యాస్, పెట్రోల్ డీజిల్‌పై భయానక పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో పెట్రోల్‌లో అధిక మొత్తంలో ఇథనాల్‌ను కలపడానికి సంబంధించిన నిబంధనల్ని ప్రతిపాదిస్తూ కేంద్రం ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. ఇది అమలయితే భవిష్యత్తులో ఇ85 పెట్రోల్‌తో వాహనాలు నడిచే అవకాశం ఉంది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఒక కొత్త ముసాయిదా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ ముసాయిదా నిబంధనల్లో పెట్రోల్‌లో 85 శాతం ఇథనాల్ కలిపే ఇ85 ఇంధనం చేర్చారు. ఇ100 కూడా ప్రతిపాదించారు. అంటే భవిష్యత్తులో పూర్తిగా ఇథనాల్‌తో వాహనాలను నడపొచ్చు. ఈ మార్పు దేశంలో ఇందన వ్యవస్థను పూర్తిగా మార్చివేస్తుంది. ఇప్పటి వరకు మన దేశంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపి వాడుతున్నారు. ప్రభుత్వం ఈ ముసాయిదానున ప్రజాభిప్రా టయ సేకరణ కోసం విడుదల చేసింది. ప్రజలు, పరిశ్రమ వర్గాల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తీసుకుని తుది నిర్ణయం తీసుకోనుంది. గతేడాడి ఏప్రిల్‌లో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపి ఇ20 పెట్రోల్‌ను దేశ వ్యాప్తంగా తీసుకువచ్చారు. ఈ నిర్ణయం ద్వారా భవిష్యత్తులో భారత్ తన ఇంధన అవసరాల కోసం పూర్తిగా ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటుంది.

**పాస్‌పోర్ట్ పోయినది**

నేను, వీసం నీరజ్ కుమార్, తండ్రి : వీసం వెంకటేశ్వర్లు, నివాసం: ఇం.నెం. 4-5-62/4, భవాని నగర్, జనగాం, జనగామ జిల్లా, తెలంగాణ. నా పాస్ పోర్ట్ నెం. ZA196614 పోగొట్టుకున్నాను / కనిపించడం లేదు. ఎంతో వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల దయచేసి క్రింది నెంబర్లకు సమాచారం ఇవ్వగలరని కోరుతున్నాను. సెల్: 7396906775, 8463913271.

# పెరిగిపోతున్న సైనిక వ్యయం

అంతర్జాతీయ మిలిటరీ వ్యయం పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) మూడు రోజుల క్రితం విడుదల చేసిన నివేదికలో ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం మునుపెన్నడూ లేని రీతిలో పెరిగింది. 2025 సంవత్సరంలో ఈ వ్యయం 2887 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది అంతకుముందు సంవత్సరం కంటే 2.9 శాతం ఎక్కువ. ఇందులో అత్యధికంగా అమెరికా 954 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. తరువాతి స్థానాలలో ఉన్న ఆరు దేశాల రక్షణ వ్యయం కలిపినా కూడా అమెరికాను అందుకోలేవు. భారతదేశం 92 బిలియన్ డాలర్‌లతో ఐదవ స్థానంలో ఉండడం విశేషం. ద్వితీయ స్థానంలో చైనా (336 బిలియన్ డాలర్లు), తృతీయ స్థానంలో రష్యా (190 బిలియన్ డాలర్లు), నాలుగవ స్థానంలో జర్మనీ (114 బిలియన్ డాలర్లు), ఆరవ స్థానంలో యునైటెడ్ కింగ్‌డమ్ (89 బిలియన్ డాలర్లు), ఏడవ స్థానంలో ఉక్రేన్ (84 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. ప్రపంచ మిలిటరీ వ్యయం వరుసగా 11 సంవత్సరాలుగా పెరుగుతూ వస్తోంది. అంతకుముందు ఏడాదితో పోల్చితే 2025లో అమెరికా సైనిక వ్యయంలో తరుగుదల కనిపించింది. అదే సమయం లో ఐరోపా దేశాల వ్యయంలో 14 శాతం, ఆసియా, ఓసియానా దేశాల ఖర్చులో 8.1 శాతం పెరుగుదల కనిపించింది. దీనికి ప్రధాన కారణం అమెరికా ఆ ఏడాది బైటి దేశాలలో ఖర్చు తగ్గించుకోగా, రష్యా– ఉక్రేన్ యుద్ధం, పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా మిగతా ఖండాల ఖర్చు పెరిగింది. అదే విధంగా ఐరోపా దేశాలు తమ ఆయుధ బడ్జెట్‌లను పెంచుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హుకూం జారీ చేశారు. మొత్తం సైనిక వ్యయంలో అత్యధికంగా ఖర్చు పెడుతున్నది అమెరికా, చైనా, రష్యాలే. వీటి వాటా 51 శాతంగా ఉంది. ఈ ఏడాది (2026) మరోసారి అమెరికా సైనిక వ్యయంలో భారీ పెరుగుదల ఉండనుంది. ఇరాన్‌పై యుద్ధమే దీనికి కారణం.

ద్వితీయ ప్రపంచ యుద్ధం నుంచి ప్రపంచంపై ఆధిపత్యం కోసం అగ్రదేశాలు రక్షణ బడ్జెట్‌లను పెంచుకుంటూ పోతున్నాయి. నాటి నుంచి అమెరికా అగ్రస్థానంలోనే ఉంది. 1949లో ఆ దేశ రక్షణ వ్యయం 53.5 ట్రిలియన్ డాలర్లుగా ఉండేది. అంటే అప్పట్లో అన్ని దేశాల సైనిక వ్యయంలో అది సగానికి ఎక్కువే (51.5 శాతం). దానిని కొనసాగిస్తూ వస్తోంది. ప్రపంచ దేశాలపై పెత్తనం, సామ్రాజ్యవాద కాంక్షతో ఈ మొత్తాన్ని పెంచుకూంటూ పోతోంది అమెరికా. అగ్రరాజ్య హోదాను ఆశిస్తున్న చైనా కూడా తన సైనిక వ్యయాన్ని భారీగా పెంచుకొని రెండవస్థానంలో నిలిచింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగింపు 80వ వార్షికోత్సవం సందర్భంగా చైనా తన సైనిక పాటవాన్ని బీజింగ్‌లో ప్రత్యేక పరేడ్ నిర్వహించి ప్రపంచానికి చాటి చెప్పింది. ఆ సందర్భంగా తమ వద్ద ఉన్న అధునాతన హైపర్ సానిక్ డిఎఫ్–61 క్షిపణులు, ఎఐ ఆధారిత డ్రోన్‌లు, అణ్వాస్త్రాలను తీసుకెళ్ళే ఆయుధాలను, నూతన నావికా పరిజ్ఞానాన్ని ప్రదర్శించింది. ఈ పరేడ్‌కు రష్యా, ఉత్తర కొరియా, వియత్నాం, తదితర దేశాల అగ్రనేతలు హాజరయ్యారు. ఇక రష్యా తన పూర్వ అగ్రరాజ్య హోదా అస్థిత్వాన్ని నిలబెట్టుకునేందుకు రక్షణ బడ్జెట్ పెంపును కొనసాగిస్తోంది. గతేడాది విక్టరీ పరేడ్ సందర్భంగా తన ఆధునిక ఆయుధాల ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఉక్రేన్ గగనతల డ్రోన్ దాడుల నడుమ దీనిని నిర్వహించింది. వీటి వెనుక ప్రపంచానికి తమ సైనిక సత్తాను చాటుకోవడమే లక్ష్యం.

సైనిక వ్యయం పెరగడానికి సామ్రాజ్యవాద కాంక్ష ఎంత కారణమో, అభద్రత సైతం అంతే కారణం. దీనిని మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ పెంచి పోషిస్తుంటాయి. అధిక లాభాలను అందించే తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు అలా వ్యవహరించడం సహజం. ఇందుకోసం వివిధ దేశాల ఎన్నికల్లో తమకు అనుకూలురలకు భారీగా నిధులు ఇవ్వడం అందరికీ తెలిసిన సత్యమే. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ఎన్నికల్లో ఆ విధంగా లబ్ధి చేకూరిన వారే. తమ వ్యాపారం సుసంపన్నంగా సాగేందుకు అంతర్జాతీయ మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ ఎప్పుడూ ప్రపంచంలో యుద్ధాలను, అస్థిరతలను కూలదోస్తుంటాయి. పోటీపడి నూతన ఆయుధాలను రూపొందించి, పరస్పర ప్రత్యర్థి దేశాలకు ఎరగా చూపుతుంటాయి. ఈ వ్యాపారంలో అందరూ ఉండరు. కేవలం కొన్ని దేశాలు మాత్రమే అంతర్జాతీయ ఆయుధ వ్యాపారంలో ఆధిపత్యం చెలాయిస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా గత పదేళ్ళలో 295 బిలియన్ డాలర్‌ల విలువైన ఆయుధాల వ్యాపారం సాగినట్లు వినికిడి.

అమెరికా ఇందులో ముందుంది. సొంతంగా ఆయుధాలను తయారు చేసుకోవడమే కాకుండా, అది పెద్ద ఆయుధ ఎగుమతిదారుగా కూడా ఉంది. అంతర్జాతీయ ఆయుధ వ్యాపారంలో ఆ దేశం సుమారు 39 శాతం వాటా కలిగి ఉంది. కాబట్టి అమెరికా విదేశాంగ విధానాలను ఆయుధ పరిశ్రమలు సైతం శాసిస్తుంటాయనేది జగమెరిగిన సత్యమే.

గతేడాది రెండు యుద్ధాలతో సతమతమతం అవుతున్న ప్రపంచానికి ఈ ఏడాది మరో యుద్ధం శరాఘాతంగా మారింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ రెండు నెలల క్రితం ప్రారంభించిన యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇది ప్రపంచ దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు గత ఏడాది భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య స్వల్పకాలం కొనసాగిన యుద్ధం, అలాగే పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య సాగుతున్న యుద్ధం, ఇవన్నీ కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను మరింత దెబ్బతీస్తున్నది. అదే సమయంలో యుద్ధాలను నిలువరించే పరిస్థితిలో ఐక్యరాజ్యసమితి లేకపోవడం, పూటకో మాట చెబుతున్న ట్రంప్ తీరుతో పరిస్థితి మరింత జటిలమవుతోంది. ఫలితంగా కుంగిపోతున్న ఆర్థిక వ్యవస్థలు కూడా సైనిక వ్యయాలను పెంచుకోవాల్సిన పరిస్థితులకు పలు దేశాలు నెట్టివేయబడుతున్నాయి. ఇప్పటికైనా అంతర్జాతీయ సమాజం విషమ పరిణామాలను గమనించి, యుద్ధాల నివారణకూ పూనుకోకపోతే ప్రపంచం మరింత ప్రమాదంలోకి కూరుకుపోవడం ఖాయం. ●



## ఖడ్గే కర్నాటక సిఎం అయితే స్వాగతిస్తాం

ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే రాష్ట్ర ముఖ్యమంత్రి అయితే అధికార కాంగ్రెస్ పార్టీలోని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తారు. ముఖ్యమంత్రి మార్పు అంశంపై పార్టీలో నెలకొన్న అంతర్గత రాజకీయాలు, గందరగోళం నడుమ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 'సుపరిపాలన' వాగ్దానాన్ని నెరవేర్చడమే అత్యంత ముఖ్యం. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, కర్ణాటకలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల ఫలితాలు మే 4న వెలువడిన తర్వాత, నాయకత్వ మార్పు, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఒక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఆయన (ఖడ్గే) గనుక ముఖ్యమంత్రి అయితే మేము చాలా సంతోషిస్తాం. ఆయన అపార అనుభవం కలిగిన సీనియర్ రాజకీయ నాయకుడు.

– కర్నాటక హోం మంత్రి జి.పరమేశ్వర

# గృహగణనలో గల్లంతైన బిసి ఇండ్లు

దేశవ్యాప్తంగా కులగణన, సామాజిక న్యాయం డిమాండ్‌లు పెరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కులగణన సర్వే–2024ను నిర్వహించింది. ఈ లెక్కలను ఇటీవల అధికారికంగా కూడా విడుదల చేసింది. ఈ సర్వే అన్ని రంగాల్లో బిసి, ఎస్సీ ఎస్టీ కులాల వెనకబాటును వెల్లడించింది. రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న బిసి సమూహానికి 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండిపోయింది. దీంతో ఈ విషయం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈసారి జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించింది. కానీ ఇటీవల జనగణన–2027లో భాగంగా మొదటి దశలో జరుగుతున్న ఇండ్ల జాబితా, ఇండ్ల గణనలో ఎస్సీ, ఎస్టీ ల కాలమ్ ఉండగా, బిసి కాలమ్ లేకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తుంది. బిసిలను కూడా ఒసి లతో కలిపి 'ఇతరులు'గా చూపిస్తున్నారు. ఈ సర్వేలో ప్రతి ఇల్లు, గుడి, బడితో పాటు పశువుల పాకను కూడా గణించాలన్నప్పుడు...బిసిల ఇళ్లను ప్రత్యేకంగా ఎందుకు లెక్కించరు? ప్రభుత్వం నిజంగా కులగణనకు కట్టుబడి ఉందా? లేక రాజకీయ ఒత్తిడిని తగ్గించేందుకు మాత్రమే ప్రకటనలు చేస్తున్నదా? అనే అనుమానాలకు తావిస్తోంది. బిసిల ఇళ్లను లెక్కించనప్పుడు ఫిబ్రవరి 2027లో జరిగే జనగణనలో బిసిల గణన ఎలా చేస్తారో స్పష్టతనివ్వాలని బిసి మేధావులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధికారికంగా ప్రకటించారు. కానీ గెజిట్ నోటిఫికేషన్‌లో కులగణన అంశం చేర్చలేదు. ఈ పరిణామాలు పరిశీలిస్తే... మరోసారి వ్యవస్థాగతంగా బిసి హక్కులు కాలరాయబడుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### హక్కులను కాలరాయడమే...

భారతదేశంలో ఇప్పటివరకు మతానికి సంబంధించి ఆచార వ్యవహారాల్లో ప్రామాణిక నిర్వచనం లేదు. మొన్న సుప్రీంకోర్టు మతం మారిన దళితులకు ఎస్సీ హోదా రద్దు అనే తీర్పుపై విమర్శలు వ్యక్తమైనాయి. అయినా ప్రస్తుత ఇండ్ల గణనలో ఎస్సీ మత హక్కులను టార్గెట్ చేసే విధంగా సర్వే కాలమ్స్ ఉన్నాయి. ఒక వ్యక్తి హిందువు, సిక్కు, బుద్ధిష్ట అయితేనే ఎస్సీ అని పెట్టాలి. లేదంటే 'ఇతరులు' కింద చేర్చాలనే కాలమ్స్ పెట్టారు. కానీ ఎస్టీలకు సంబంధించి ఏ మతమైనా ఎస్టీ అని రాయడం జరుగుతుంది. ఇది మత స్వేచ్ఛ, రాజ్యాంగ సమానత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇది దళితుల పట్ల వివక్షతను నొక్కి చెబుతుంది. మరోవైపు ఈసారి జరిగే గృహ గణనలో 'ఎన్యూమరేట్'కు అధిక అధికారాలున్నాయి. ఇంటి యజమాని లేకపోయినా, అతని అనుమతి లేకుండానే 34 కాలమ్స్ నింపడానికి అవకాశం ఉంది. తద్వారా ఇంటి యజమాని తన హక్కులు కోల్పోయే అవకాశం కూడా లేకపోలేదు. 2011 జనాభా లెక్కల్లో ఇంటి వివరాలు నమోదు చేశాక ఇంటి యజమాని వాటిని సరిచూసుకొని సంతకం పెట్టాల్సి ఉండేది. ప్రస్తుతం డిజిటల్ జనగణనలో దీనికి ఆస్కారం లేదు. కేవలం ఎన్యూమరేట్ సంతకం మాత్రమే ఉన్నది. ఇది డేటా కచ్చితత్వం, పారదర్శకతపై ప్రభావం చూపుతుంది. స్వీయ గణన చేసుకున్నవారికి ఇలాంటి సమస్యలు రావు. ఇది అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కావున ఇంటి యజమానికి తమ సమాచారాన్ని చూసుకునే అవకాశం కల్పించాలి. నమోదు చేసిన సమాచారం ప్రింట్ అవుట్ అందించాలి.

### కులగణన సామాజిక న్యాయానికి పునాది...

భారతదేశ ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు తెలుసుకొని ప్రయోజనం కల్పించడానికి జనగణనతో పాటు కులగణన చేయడం అత్యావశకం. కులగణన ద్వారా దేశ సంపదలో ఎవరి వాటా ఎంతో తెలుస్తుంది. భారతదేశంలో చివరిసారిగా పూర్తిస్థాయి కులగణన 1931లో జరిగింది. అనంతరం 2011లో సామాజిక, ఆర్థిక కులగణన జరిగినా, ఆ డేటా పూర్తిగా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఇప్పటి పరిస్థితుల్లో బిసిల జనాభా, వారి ఆర్థికసామాజిక స్థితి గురించి ఖచ్చితమైన డేటా లేకపోవడం వల్ల రిజర్వేషన్ల సముచిత పంపిణీ కష్టమవుతోంది. సంక్షేమ పథకాలు లక్ష్యానికి చేరడం లేదు. పాలసీ నిర్ణయాలు కేవలం అంచనాలపై మాత్రమే ఆధారపడుతున్నాయి. దేశవ్యాప్తంగా దశాబ్దాలుగా రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని, జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, ఒబిసి వర్గాలకు వాటా దక్కాలని వెనుకబడిన వర్గాలు డిమాండ్ చేస్తున్నారు.

ఈ క్రమంలో కులగణనను సామాజిక న్యాయాని కి పునాదిగా పలు వర్గాలు భావిస్తున్నాయి. దేశంలో 90 శాతం బిసి ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరగాలంటే కులగణన తప్పనిసరి. కానీ నేడు ఇందుకు విరుద్ధంగా బిసి కులాల ప్రస్తావన లేకుండానే గృహాల గణన జరుగుతున్నట్టు అనిపిస్తుంది. క్షేత్రస్థాయిలో ఇదే జరిగితే ఉద్యమాలు ఉధృతమయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే డాక్టర్ విశారదన్ మహారాజ్ సారథ్యంలో బిసి, ఎస్సీ, ఎస్టీ, జెఎసి ఏర్పడి, ఎవరెంతో వారికంత వాటా దక్కాలని 'మా భూమి' పోరాటం మొదలైనది. దళిత, బహుజనలంతా ఏకమై ఈ పోరాటంలో భాగం కావాలి. అప్పుడే ఈ దేశంలోని సమస్త భూమి, సంపద, అధికారంలో వాటా దక్కుతుంది. ఇదీ జరగాలంటే ముందుగా రాజ్యాంగబద్ధంగా జరిగే జనగణనతో పాటు కులగణన చేయాలని ఒత్తిడి తేవాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని వర్గాల ను ప్రతిబింబించే విధంగా సమగ్రమైన డేటాను సేకరించాలి. దీనికనుగుణంగా వనరులు పంపిణీ జరగాలి. అప్పుడే రాజ్యాంగ సమానత్వ లక్ష్యం నెరవేరుతుంది.

సంపతి రమేష్,
7989579428.

# ప్రతిఘటనా పోరాటాలకు మైలు రాయి 'మే డే' – 2026

**కామెరూన్ హ్యారీసన్**

1886 షికాగో హే మార్కెట్ సంఘటన 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచం సంబరాలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో, అమెరికాలో 'వర్కర్స్ ఓవర్ బిలియనీర్స్ (బిలియనీర్ల కన్నా కార్మికులే ప్రధానం)' అనే నినాదంతో భారీ ప్రదర్శనలు, ఆందోళనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మికుల హక్కులు, ప్రజాస్వామ్యం, శాంతి, సమానత్వం కోసం జరిగే పోరాటంలో ఈ 'మే డే' నాడు తమ శక్తులను సమీకరించుకోవాలని అంతర్జాతీయ కార్మిక వర్గానికి ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌టియు) పిలుపునిచ్చింది.

ప్రపంచ నలుమూలలా 10.5 కోట్ల మందికి పైగా కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న చారిత్రాత్మక అంతర్జాతీయ కార్మిక సంఘాల సంఘం డబ్ల్యుఎఫ్‌టియు 140 ఏళ్ల క్రితం షికాగో మార్గదర్శకుల డిమాండ్లు ఎంత అత్యవసరమో, నేటికీ అంతే అత్యవసరమని పేర్కొంది. 'పెట్టుబడిదారీ విధాన సంక్షోభం తీవ్రమవుతూ, విస్తరిస్తోంది,' అని డబ్ల్యుఎఫ్‌టియు మే డే ప్రకటనలో తెలిపింది. 'సామాజిక అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, కార్మిక సంఘాల హక్కులపై దాడులు జరుగుతున్నాయి. అదే సమయంలో సామ్రాజ్యవాద యుద్ధాలు, జోక్యాలు ఎజెండాలో ఉన్నాయి.' మహిళా కార్మికులు, యువత, వలస కార్మికులు తీవ్రమైన దోపిడీ, తక్కువ వేతనాలు, అధిక ఉద్యోగ అభద్రత, ఆరోగ్యం, విద్య, సంస్కృతికి పరిమితంగా అందుబాటులో ఉండటాన్ని ఎదుర్కొంటూనే ఉన్నారని తెలిపింది. 'కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక నియంత్రణల సడలింపునకు వారే మొదటి బాధితులు, ఇది వారిని పెట్టుబడిదారుల దాడులకు ప్రత్యేకంగా గురిచేస్తోంది.'

### భద్రత చర్యలు ఖర్చు ఎలా అవుతుంది?

పని ప్రదేశంలో ఆరోగ్యం, భద్రత ప్రపంచవ్యాప్తంగా క్రమపద్ధతిలో దిగజారుస్తోందని ఫెడరేషన్ పేర్కొంది. భద్రతా చర్యలను యజమానులు ఒక 'ఖర్చు'గా పరిగణిస్తుండంతో పని ప్రదేశంలో ప్రమాదాలు, మరణాల పెరుగుదలకు దారితీస్తోంది.'ప్రతిరోజూ, లాభం అనే బలిపీఠంపై కార్మికులు గాయపడుతున్నారు లేదా ప్రాణాలు కోల్పోతున్నారు, ఇది వ్యవస్థ ప్రాధాన్యతలను అత్యంత విషాదకరమైన రీతిలో బయటపెడుతోంది.' డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే నూతన శకంలో కార్మికులు సమాజ ప్రయోజనం కోసం ఉపయోగించబడటానికి బదులుగా, దోపిడీని తీవ్రతరం చేయడానికి, కార్మికులను పర్యవేక్షించడానికి, గిగ్‌వర్క్, 'స్వతంత్ర' కాంట్రాక్టర్ల వంటి సౌకర్యవంతమైన, అస్థిరమైన ఉపాధి రూపాలను విస్తరించడానికి వినియోగించబడుతోందని కూడా డబ్ల్యుఎఫ్‌టియు హెచ్చరించింది.

కార్మిక సంఘాల నాయకులపైనా, ప్రజాస్వామ్య స్వేచ్ఛలపైనా ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల అణచివేత ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతోందని వారు అన్నారు. సమ్మెలను నేరంగా పరిగణిస్తున్నారు. వలసదారులను, శరణార్థులను దాదాపు ఎలాంటి హక్కులు లేని చౌక శ్రమశక్తిగా వాడుకుంటున్నారు.జాతి వివక్ష, దోపిడీలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ఇంధన సంక్షోభం, ద్రవ్యోల్బణం, అధిక ధరలు కార్మికుల ఆదాయాలను క్షీణింపజేస్తుండగా, వేతనాలు స్తంభించిపోయాయి, బహుళజాతి సంస్థల లాభాలు ఆకాశాన్నంటుతున్నాయి.దీనిని ఎదుర్కొన్నప్పుడు, అంతర్జాతీయ కార్మిక వర్గం పోరాడటమే ప్రతిస్పందనగా ఉండాలని డబ్ల్యుఎఫ్‌టియు పేర్కొంది.

## డబ్ల్యుఎఫ్‌టియు డిక్లరేషన్




### సామ్రాజ్యవాద యుద్ధాలతో సంక్షోభం తీవ్రం

ప్రపంచవ్యాప్తంగా శ్రామిక ప్రజలు పోరాడవలసిన సమస్యలుగా, కొనసాగుతున్న సామ్రాజ్యవాద యుద్ధాలు, జోక్యాల వల్ల తీవ్రమవుతున్న సంక్షోభాన్ని కూడా డబ్ల్యుఎఫ్‌టియు ఎత్తి చూపింది. వీటిలో గాజాలో పాలస్తీనియన్ల జాతి నిర్మూలన, ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం, వెనిజులాపై దాడి, దాని అధ్యక్షుడి అపహరణ, క్యూబాపై కొనసాగుతున్న అమెరికా దిగ్బంధనం ఉన్నాయి.

ఈ సంఘటనలు, 'సామ్రాజ్యవాదం కపటత్వాన్ని, నిష్ఠురత్వాన్ని, అమానవీయ స్వభావాన్ని మరోసారి దాని పూర్తి స్థాయిలో బట్టబయలు చేశాయి' అని డబ్ల్యుఎఫ్‌టియు విమర్శించింది. అదే సమయంలో, ప్రభుత్వ సైనిక వ్యయం విపరీతంగా పెరిగిపోతోందని, ఇది ప్రతిచోటా శ్రామిక ప్రజలకు సైనికీకరణను, ప్రమాదాన్ని తీవ్రతరం చేస్తోందని ఫెడరేషన్ హెచ్చరించింది. ఇదిలా ఉండగా, ఈ 'యుద్ధ ఆర్థిక వ్యవస్థల' భారాన్ని పొదుపు చర్యలు, ప్రైవేటీకరణ,సామాజిక ప్రయోజనాలను నిర్వీర్యం చేయడం ద్వారా కార్మికులపై మోపుతున్నారు.

'అధికారంలో ఉన్నవారి యుద్ధాలు, వైరుధ్యాలతో కార్మికులకు ఎలాంటి సంబంధం లేదు. దానికి విరుద్ధంగా, ఐక్యత, సంఘీభావం,ఉమ్మడి పోరాటం ద్వారా కార్మికులు ప్రతీదీ పొందగలుగుతారు,' అని డబ్ల్యుఎఫ్‌టియు పేర్కొంది. ప్రతి కార్యాలయంలో, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి రంగంలో, ప్రతి దేశంలో తమ పోరాటాలను బలోపేతం చేసుకోవాలని, ప్రతిఘటనను నిర్వహించాలని ఫెడరేషన్ ప్రతిచోటా ఉన్న కార్మిక సంఘాలకు పిలుపునిచ్చింది.'Strength lies in organization. Hope lies in struggle (సంఘటితం కావడంలో బలం ఉంది. పోరాటంలో ఆశ ఉంది),' అని డబ్ల్యుఎఫ్‌టియు మే డే ప్రకటన పేర్కొంది. సామ్రాజ్యవాద యుద్ధాలు, జోక్యాలు లేని, వివక్ష, మనిషిపై మనిషి చేసే దోపిడీ లేని ప్రపంచం కోసం జరిగే పోరాటానికి, ప్రతిఘటనా పోరాటలకు ఈ ఏడాది మే డే ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశిస్తున్నట్లు డబ్ల్యుఎఫ్‌టియు పేర్కొంది.

**డబ్ల్యుఎఫ్‌టియు 'మే డే' డిమాండ్‌లు:**

- వేతనాల పెంపు, పూర్తి హక్కులతో కూడిన సామూహిక కార్మిక ఒప్పందాలు
- అధిక ధరలు, ద్రవ్యోల్బణం నుండి రక్షణకు సమర్థవంతమైన చర్యలు
- అందరికీ ప్రభుత్వ, ఉచిత ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక భద్రత
- పని గంటల తగ్గింపు, స్థిరమైన పని గంటలతో శాశ్వత ఉపాధి, 'ఫ్లెక్సిబుల్' కార్మిక రూపాల రద్దు, డిజిటల్ ప్లాట్ ఫామ్‌లపై కార్మికులకు రక్షణ
- అన్ని కార్యాలయాల్లో ఆరోగ్య, భద్రతా చర్యలు
- ట్రేడ్ యూనియన్ హక్కులు, ప్రజాస్వామ్య స్వేచ్ఛలను గౌరవించటం
- వలసదారులు, వలస కార్మికులకు రక్షణ, అందరికీ సమాన హక్కులు

2026 మే దినోత్సవం సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా కింది నినాదంతో శ్రామికుల సమీకరణకు డబ్ల్యుఎఫ్‌టియు పిలుపునిచ్చింది.

***మా జీవితాలు, మా అవసరాలా లేదా వారి లాభాలా!***
***పెట్టుబడిదారీ వర్గ యుద్ధాలకూ, లాభాలకూ ఎలాంటి త్యాగాలూ వద్దు!***
***సామూహిక ఒప్పందాల ద్వారా నియంత్రించబడే, హక్కులతో కూడిన పని!***
***కార్మికుల సమకాలీన అవసరాల పరిపూర్తి !***
***ఐకమత్యం, అంతర్జాతీయవాదమే కార్మిక వర్గ ఆయుధాలు!***

*(ఐపిఎ సర్వీస్)*

# వరి కాదు.. వైవిధ్య పంటలే మన భవిష్యత్తు!



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో పప్పు ధాన్యాల (పల్సెస్) సాగు విస్తీర్ణం తగ్గడం, వరి (ప్యాడీ) సాగు ప్రతి సంవత్స రం పెరగడం ఒక సంక్లిష్టమైన వ్యవసాయ పరిణామం. ఇది రాష్ట్ర వ్యవసాయం, ఆర్థికత, నీటి వనరులు, పర్యావరణం, ఆహార భద్రత అన్ని కోణాల్లోనూ లోతైన ప్రభావాలను చూపుతోంది.ఈ విషయాన్ని గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత (2014–15 నుంచి) వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 2015–16లో వానకాలంలో సుమారు 18.5లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే, 2023–24 నాటికి ఇది 65.9 లక్షల ఎకరాలకు చేరుకుంది. అదే సమయంలో పప్పు ధాన్యాల సాగు తగ్గుతోంది. వానకాలంలో పప్పుల సాగు విస్తీర్ణం 2015–16లో 9.21 లక్షల ఎకరాల నుంచి 2023–24లో 5.09 లక్షల ఎకరాలకు తగ్గింది. ఇతర పంటలైన కూరగాయలు, పండ్లు, నూనె గింజలు, చిరుధాన్యాల సాగు కూడా తగ్గుతోంది.

ఈ మార్పుకు బహుముఖ కారణాలు ఉన్నాయి. నీటి వనరుల అభివృద్ధి (మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు, ట్యాంకుల పునరుద్ధరణ), ఉచిత విద్యుత్ (24 గంటలు వ్యవసాయానికి) వంటి చర్యలు, భూగర్భ జలాలు, కాలువల ద్వారా నీటి సౌకర్యం పెంచాయి. వరి నీటిఆధారిత పంట కాబట్టి రైతులు దానిని ఎక్కువగా ఎంచుకుంటున్నారు. పప్పులు సాధారణంగా వర్షాధారిత లేదా మార్జినల్ భూముల్లో పండిస్తారు — నీటి సౌకర్యం పెరగడంతో ఆ భూములు కూడా వరికి మారుతున్నాయి. ఆర్థిక భద్రత కూడా ప్రధాన కారణం. వరికి కనీస మద్దతు ధర ఉంది. అలాగే ప్రభుత్వం భారీగా కొనుగోలు చేస్తుంది. పప్పులకు కనీస మద్దతు ధర ఉన్నప్పటి కీ, కొనుగోలు సమర్థవంతంగా లేదు — ధరల హెచ్చు తగ్గులు, మార్కెట్ రిస్క్ ఎక్కువ. రైతులు నష్టాలను ఇష్టపడరు కాబట్టి వరి వైపు మొగ్గు చూపుతారు. రైతుబంధు, ఉచిత విద్యుత్ వంటి స్కీములు కూడా ఈ ధోరణిని ప్రోత్సహిస్తున్నాయి.

గతంలో మన తెలంగాణ పల్లెల్లో వ్యవసాయం ఒక పూర్తి జీవన వ్యవస్థగా విరాజిల్లేది. ఒక్క పెరటి తోటలోనే పప్పు గింజలు, నూనె గింజ లు, వివిధ కూరగాయలు సాగవుతూ, ఆవులు, బర్రెలు, పాడి పశువుల మందలు, కోళ్లు, గొర్రెలు, మేకలు అన్నీ ఒకే కుటుంబం లా సహజీవనం చేసేవి. పొలం నుంచి వచ్చిన గడ్డి పశువులకు ఆహారమై, వాటి పేడ మూత్రం మట్టిని బలోపేతం చేసి, మర లా ఆరోగ్యకరమైన పంటల ను పండించేవి. ఇది కేవలం ఆదాయం కాదు.. స్వయం సమృద్ధి, పోషకాహారం, కుటుంబ ఆరోగ్యం, మట్టి ఫలదీకరణం అన్నీ ఒక్కటిగా మెలిపెట్టిన సమతుల్య జీవితం.



కానీ రానురాను ఆ సుందర చిత్రం మాయమవుతోంది. ఉచిత విద్యుత్, కాలువలు, భారీ నీటి ప్రాజెక్టులు, వరికి హామీ ధరలు, రైతు బంధు వంటి ప్రోత్సాహకాలతో రైతులు కేవలం వరి పంట వైపే దృష్టి సారించారు. పెరటి తోటలు, పప్పులు, నూనె గింజలు, కూరగాయలు కనుమరుగయ్యాయి. పశువు ల మందలు తగ్గి, కోళ్లు, గొర్రెలు దూరమయ్యాయి. ఇప్పుడు ఒకే పంట మీద ఆధారపడటం వల్ల మట్టి సారం క్షీణిస్తోంది, నీటి వనరులు ఎండిపోతున్నాయి. రైతు బాధ్యత కేవలం బియ్యం ఉత్పత్తి కాదు.. తన భూమిని, తన కుటుంబాన్ని, తన గ్రామాన్ని సమగ్రంగా పోషించడం.

ఈ ధోరణి సానుకూల ప్రతికూలాలను కలిగి ఉంది. సానుకూలంగా, తెలంగాణ భారతదేశంలో వరి ఉత్పత్తిలో ముందంజలో ఉంది. రైతుల ఆదాయం స్థిరంగా పెరిగింది. కానీ ప్రతికూలంగా, నీటి సంక్షోభం తీవ్రమవుతోంది. వరి నీటి అధిక వినియోగ పంట కాబట్టి భూగర్భ జలా లు హెచ్చరిక స్థాయిలో ఉన్నాయి. పంట వైవిధ్యం తగ్గడం వల్ల మట్టి సారం క్షీణిస్తోంది, తెగులు పెరుగుతోంది. పప్పులు నైట్రోజన్ ఫిక్సేషన్ చేసి మట్టిని మెరుగుపరుస్తాయి — వాటి తగ్గుదల మట్టి ఆరోగ్యానికి హాని. ఇది మన అందరి కనువిప్పు సమయం. వరి సాగు లాభదాయకమే కావచ్చు, కానీ దాని ఒంటరి ప్రయాణం దీర్ఘకాలికంగా మనను బలహీనపరుస్తుంది. గతంలో మన తాతలు అనుసరించిన ఆ సమీకృత వ్యవసాయంను (Integrated Farming)మళ్లీ తీసుకురావాలి. పప్పులు, నూనె గింజలు, కూరగాయలు, పండ్లు పక్కన పెట్టి, పశువులను తిరిగి పెంచి, మట్టిని స్వాభావికంగా బలపరచి సాగుచేయడం ద్వారా మనం స్వయం సమృద్ధి, ఆరోగ్యం, స్థిరమైన ఆదాయం అన్నీ సాధించవచ్చు. రైతు బంధు సోదరులారా, మన భూమి మనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం. ఒక్క వరి కాదు, వైవిధ్యమే మన భవిష్యత్తు — ఇది మన కుటుంబాలకు, మన రాష్ట్రానికి, మన తరువాతి తరాలకు చేసే నిజమైన సేవ. ఈ సమస్యను సమగ్రంగా పరిష్కరించాలంటే, పాలసీలు రైతు ఆదాయం + పర్యావరణ సమతుల్యం రెండింటినీ దృష్టిలో ఉంచాలి. పప్పులు/ఇతర పంటలకు ఎఫెక్టివ్ కనీస మద్దతు ధర + ప్రొక్యూర్‌మెంట్ హామీ, క్రాప్ డైవర్సిఫికేషన్ ఇన్సెంటి వ్స్, నీటిసమర్థ పద్ధతులు (డిఎస్ఆర్, మైక్రో ఇరిగేష న్), రైతులకు శిక్షణ, మార్కెట్ లింకేజీలు అవసరం. తెలంగాణ వ్యవసాయం ఇప్పటికే అనేక సవాళ్లను అధిగమించింది. ఇప్పుడు సమతుల్య, సుస్థిర నమూనా వైపు మారడం ద్వారా మరింత ముందుకు సాగవచ్చు. ఇది రైతులు, ప్రభు త్వం, వ్యవసాయ శాస్త్రవేత్తల సమన్వయంతో సాధ్యమవుతుంది.

ఈ మహత్తర మార్పు ఒక్కసారిగా రాదు.. చిన్న చిన్న ఆచరణలతోనే ఆరంభమవుతుంది. ప్రతి ఇంటి పెరటిలో ఒక కూరగాయ తోట నాటడం నుంచి, ప్రతి కుటుంబం ఒక పాడి పశువును ఆదరించడం నుంచి, ప్రతి రైతు తన పొలంలో వైవిధ్య పంటలకు చోటివ్వడం నుంచి ఈ పునరుజ్జీవనం మొదలవుతుంది. మనం సమష్టి గా అడుగులు వేస్తే, ఒకప్పుడు పంటల సిరి, పశుసంపద, పోషకాహారం, స్వయం సమృద్ధితో కళకళలాడిన ఆ పల్లె జీవనం మళ్లీ మన కళ్లముందు వికసిస్తుంది. భూమి సారం, కుటుంబ ఆరోగ్యం, గ్రామ ఆర్థిక బలం, ప్రకృతి సమతుల్యం అన్నీ కలిసిన ఆ సుసంపన్న గ్రామ సంస్కృతి తిరిగి పునర్జన్మిస్తుంది. చిన్న మార్పులే రేపటి గొప్ప వ్యవసాయ విప్లవానికి విత్తనాలు — మన చేతుల్లోనే మన పల్లె భవిష్యత్తు ఉంది.

## నాలుగు లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు పోరాటం



**ప్రజాపక్షం/ నేరడిగొండ:**కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాటం ఆపబోమని ఎఐటియుసి మండల అధ్యక్షుడు పేరుమండ్ల నరసయ్య అన్నారు. బుధవారం నేరడిగొండలో మే డే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద కాంక్షల వల్ల ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన యుద్ధ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే 141వ మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## కెజిబివిలో వంద శాతం ఉత్తీర్ణత

**ప్రజాపక్షం / తిర్యాని:**కొమురం భీం జిల్లా తిర్యాని మండలంలోని మనిక్యాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి విశేష విజయాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన మొత్తం 39 మంది విద్యార్థినులు అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న బుధవారం వెల్లడించారు. విద్యార్థినుల కృషి, ఉపాధ్యాయుల సమర్థవంతమైన మార్గదర్శకత్వం వల్లే ఈ అద్భుత ఫలితం సాధ్యమైందని ఆమె పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో ఆత్రం నందిని 515 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, సట్గారే గీతాంజలి 505 మార్కులు, జెల్ల సౌజన్య 502 మార్కులు సాధించి టాప్ మార్కులతో ప్రతిభ కనబరిచారు.

## శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థికి 595 మార్కులు



**ప్రజాపక్షం / మంచిర్యాల:**మంచిర్యాల పట్టణంలోని గోదావరి రోడ్‌లో గల శ్రీ చైతన్య హై స్కూల్‌కు చెందిన విద్యార్థి అమన్ అమృత పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఈ విద్యార్థి 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సంజీవ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థి అమన్ అమృత భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అమన్ అమృతను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ మేళా గోడ ప్రతుల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, యువతకు ఉద్యోగ కల్పన కొరకు ఏర్పాటు చేసిన జాబ్‌మేళా గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో, బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 6వ తేదీన ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళాలో అర్హులైన నిరుద్యోగ యువత పాల్గొనవచ్చునని అన్నారు. పోస్టర్‌లోని క్యూర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా లేదా https://satg. telang ana.g ov. in/prajapalana వెబ్ సైట్ ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చని అన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ గోడ ప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాది కల్పన అధికారి విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

## మొక్కజొన్న కేంద్రాల్లో రైతుల అవస్థలు

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని మొక్కజొన్న కేంద్రంలోని రైతులకు గన్నీ సంచులు అందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాజీ ఎంపిటిసి జై సాగర్‌రావు మాట్లాడుతూ మొక్కజొన్న సెంటర్లను ప్రారంభించడం ఆలస్యంగా ప్రారంభించిన సెంటర్లలో సంచుల కొరత ఉందని ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అలాగే జొన్న కేంద్రాలను ప్రారంభించాలని అలాగే వారం పది రోజులుగా వరి ధాన్యపు సెంటర్లలో వడ్లు కొనుగోలు చేయాలని సెంటర్లను ప్రారంభించాలని వర్షాలు పడే ప్రభావం ఉన్నందున కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని బిజెపి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రైతులు పాల్గొన్నారు.

## సశస్త్ర సీమ బల్ ఎస్ఐ, అసిస్టెంట్ ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :**సశస్త్ర సీమ బల్ (ఎస్ఎస్‌బి) లో సబ్ ఇన్‌స్పెక్టర్ ,అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ,కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబందించిన నోటిపికేషన్ విడుదల చేయబడింది. అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. పూర్తి వివరాల కోసం అదికారి వెబ్ సైటు (WWW recruitment ssb.gov in ,https // ssb.gov .in సందర్శించాలని సూచించారు. ఈ పోస్టుల రిజర్వేష నిబందనలకు ప్రకారం (ఓసి, బిసి, ఎస్సీ, ఎస్టీ,ఇడబ్ల్యుఎస్ కేటాయించబడతాయి, అర్హత కలిగిన అభ్యర్థులు అధికారిక నోటిపికేషన్ లోపేర్కొన్న విద్యార్హతలు వయస్సు పరిమితి ,ఇతర ప్రమాణాలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు విదానం ,ఎంపిక ప్రక్రియ ,పరీక్షల తేదీలు ,ఇతర పూర్తి వివరాల కోసంపై అదికారిక వెబ్ సైట్ ను సందర్శించగలరని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్



**ప్రజాపక్షం / చెన్నూర్:**నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి కేటాయిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ తెలిపారు. బుధవారం చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆయన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు రాని అర్హులు ఆందోళన చెందవద్దని, అందరికీ అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం 100 ఇండ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో రహదారులు, మురుగు కాలువల అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు నీటి సమస్య లేకుండా 300 బోర్ వెల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూ నిర్వాసితులకు 26 కోట్ల రూపాయల నష్టపరిహారం మంజూరు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో దాదాపు 5 వేల 500 కోట్ల రూపాయలు విడుదల చేశామని, రెండో విడత జూన్ మాసంలో ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిటీ వేస్తామని, నిరుద్యోగ యువతకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అనంతరం బావురావుపేటలో నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతకుముందు చెన్నూర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్, తహసిల్దార్లతో కలిసి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ చెన్నూర్ లోని 100 పడకల ఆసుపత్రి, బీసీ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు రాఘవేంద్రరావు, వనజ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ట్రై మోటారైజ్డ్ స్కూటీలు పంపిణీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**దివ్యాంగుల ఆత్మగౌరవంతో బతకడం ఏకైక లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో దివ్యాంగులకు ట్రై మోటారైజ్డ్ స్కూటీలు, బ్యాటరీ సైకిళ్లు, బిజినెస్ ఏంపవర్ కార్డ్స్, బిజినెస్ ఆటోలు, మోటారు సైకిళ్లు, ల్యాప్‌ల్యాప్‌లు, సహాయ ఉపకరణాలను మహిళా శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, రాకేష్‌రెడ్డిలు మేయర్ ఉమారాణి, కార్పొరేషన్ చైర్మన్లు అన్వేష్‌రెడ్డి, తాహిర్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర దిలీప్ కుమార్ చేతుల మీదుగా జిల్లా సంక్షేమాధికారి పద్మ అధ్యక్షతన తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో 75 స్కూటీలు, మొత్తంగా 140 మంది వికలాంగులకు ఉపకరణాలు స్కూటీలు, బ్యాటరీ వీల్‌చైర్లు, బిజినెస్ ఎంపవర్ కార్ట్స్, ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. వికలాంగుల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. దివ్యాంగుల ఆత్మగౌరవంతో బతకడం ఏకైక లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వికలాంగుల నిరుద్యోగుల కోసం జాబ్ పోర్టల్ ఏర్పాటు చేశామని, వికలాంగుల అంగవైకల్యం నిర్ధారణ కోసం అత్యాధునిక పరికరాలు కోసం 20 కోట్లు వెచ్చించామని తెలిపారు. అర్హులైన దివ్యాంగులను గుర్తించి వచ్చే బడ్జెట్‌లో స్కూటీలు, బ్యాటరీ వీల్‌చైర్లు మంజూరు చేస్తామన్నారు.

## స్టేట్ ఫస్ట్‌తో కాకతీయ విజయకేతనం

అత్యుత్తమ ఫలితాలకు కేరాఫ్ అడ్రస్ కాకతీయ

2026 ఎస్ఎస్‌సి ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు




**ప్రజాపక్షం/నిజామాబాద్ :**స్టేట్ ఫస్ట్‌తో కాకతీయ విజయకేతనం ఎగురవేసిందని అత్యుత్తమ ఫలితాలకు కేరాఫ్ అడ్రస్‌గా కాకతీయ నిలిచిందని కాకతీయ విద్యా సంస్థల చైర్‌పర్సన్ సిహెచ్ విజయలక్ష్మి తెలిపారు.2026 ఎస్ఎస్‌సి ఫలితాలను కాకతీయ విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి చైర్‌పర్సన్ మాట్లాడుతూ మరియా అరీష 589, సిహెచ్.వర్ష 586, బి.శ్రీకర్ 585, జాహ్నవి 583, కె.అక్షర 583 మార్కులతో స్టేట్ ర్యాంకులు సాధించారన్నారు. కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో ప్రాథమక స్థాయి నుంచి ఐఐటి బోధించడంతో పాటు ప్రణాళికాబద్ధంగా ఉండటంతో స్కూల్ తర్వాత ఇంటర్మీడియట్‌లో జాతీయస్థాయి ఐఐటి మెడికల్ పరీక్షలలో రాణిస్తున్నారన్నారు. అందుకు 202526 ఐఐటి, జెఈఈ మెయిన్స్ ఫలితాలు నిదర్శనమన్నారు. ఇంతటి అద్భుతమైన ఫలితాల కారకులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. విద్యార్థులను అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సందీప్, రణదీష్, శర్మ, నటరాజ్, చంద్రశేఖర్, సుచరిత, కవిత, ఫణిందర్ సిబ్బంది పాల్గొన్నారు.

## అందరికీ ఆధార్ కార్డు తప్పనిసరి

కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి అని, ప్రతి ఒక్కరు దీనిని కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ యువరాజ్ మారామ్‌ట్, అడిషనల్ ఎస్పి చిత్త రంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, యుఐడిఎఐ స్టేట్ అసిస్టెంట్ మేనేజర్ నరేష్‌తో కలిసి కలెక్టర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సున్నా నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ నమోదు తప్పనిసరి అని పేర్కొన్నారు. జిల్లాలో 5 నుండి 15 ఏళ్ల లోపు వారు 13,781 మంది, 15 ఏళ్లు దాటిన వారు 5,130 మంది ఇంకా ఆధార్ అప్‌డేట్ చేసుకోలేదని, వారంతా వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు బయోమెట్రిక్ హాజరు విధానం ఉంటుందని, ఆధార్ అప్‌డేట్ కాకపోతే విద్యార్థులు ఇబ్బందులు పడతారని తెలిపారు. పుట్టిన తేదీ రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆధార్ అనుసంధానం చేసుకోవాలని కోరారు. పివిటిజి గ్రామాలలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 87 ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఈ డిస్ట్రిక్ మేనేజర్ గౌతం రాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.దశరథ్..

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్భందీగా చేపట్టాలని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, మంచిర్యాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పరిశీలకులు ఆర్.ధశరథం అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాముల, మంచిర్యాల ఆర్‌డిఓ శ్రీనివాసరావు, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో మ్యాపింగ్ శాతాన్ని పెంపొందించడం అత్యవసరమని అన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 2002 ఓటర్ల జాబితాలు సర్వీస్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా మండల స్థాయి అధిఆరులు తమ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు రెగ్యులర్, ఒప్పంద, పొరుగు సేవలు, దినసరి కుటుంబ సభ్యులు తాము నమోదు చేయబడిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారులను సంప్రదించి2002 ఓటర్ల జాబితా ఎన్నికల మ్యాఫింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫారం 6,7,8 ద్వారా అందిన ధరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వవిరాలను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిశీలించి వివరాలను ధృవీకరించి తొలిగించడం గానీ, సవరించాలని తెలిపారు. ఓకె నియోజకవర్గంలో చిరునామా మార్చుకున్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి సరైన చిరునామాలో ఓటు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో డబుల్ ఓటర్లను గుర్తించి తొలిగించాలని, ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలలో అవగాహణ కల్పించేందుకు ప్రచార మాధ్యమాలు వాడుకోవాలని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో కృషి చేసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## స్వీయ గణన ద్వారా జనాభా లెక్కల నమోదు : కలెక్టర్ కుమార్‌దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల జిల్లాలో ప్రజలే తమ వివరాలను తామే నమోదు చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉందని దీన్ని ప్రజలంతా తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ప్రజాపక్షంతో మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఇప్పుడు ప్రజలే తమ వద్ద స్మాట్‌ఫోన్ ద్వారా స్వీయ గణన ద్వారా జనాభా లెక్కలలతో తమ కుటుంబానికి సంబంధించిన పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. చాలా సులభతరమైన పద్ధతి ద్వారా ఈ విధానం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన www.//se.census.gov.in వెబ్‌సైట్‌పై క్లిక్ చేసి లాగ్‌ఇన్ అయ్యాక తెలంగాణ ఎంపిక చేసి కాప్చర్‌ను ఎంటర్ చేసి వెరిఫై చేసుకుని ప్రాసెస్‌పై క్లిక్ చేస్తే ముందుకు వెళ్ళడం జరుగుతుందన్నారు. వెల్‌కమ్ పేజీలో కుటుంబపెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేసి తర్వాత ఒకే కుటుంమానికి ఒకే మోబైల్ నంబర్ ఉపయోగించి వచ్చిన ఓటిపిని ఎంటర్ చేసి వెరఫై ప్రాసెస్‌పై క్లిక్ చేయాలని తెలిపారు. తర్వాత మీకు నచ్చిన భాషను ఎంపిక చేసుకుని మీ జిల్లా, పట్టణం, గ్రామం, పిన్‌కోడ్ వివరాలు మోబైల్‌లో లోకేషన్ ఆన్ చేసి మీ ఇంటి నంబర్ రెడ్‌మార్క్ సెట్ చేయాలని తెలిపారు. అలాగే ఇళ్ళ వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నల సమాధానం ఇచ్చి ప్రివ్యుద్వారా చెక్ చేసుకుని సబ్‌మిట్ చేయాలన్నారు. సబ్‌మిట్ తర్వాత హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల ఎస్ఇ ఐడి వస్తుందని దాన్ని స్క్రీన్‌షాట్ చేసుకుని నోట్ చేసుకుని భద్రపర్చుకోవాలని తెలిపారు. ఈ విధానం అంతా మే 10వ తేదీ వరకు చేసుకున్నాక మే 11 తర్వాత మీ ఇంటికి వచ్చే గణన అధికారికి ఈ ఎస్ఇ ఐడి నంబర్ చూపిస్తే వారి అప్రూల్ చేస్తారని వివరించారు. ప్రభుత్వం నిర్వహించే స్వీయ జనాభా లెక్కల నమోదు కార్యక్రమంలో ప్రజలు అవగాహణ తో పాల్గోనాలని కలెక్టర్ కోరారు.

## పదో తరగతి ఫలితాల్లో కృష్ణవేణి పాఠశాల విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం / కాగజ్ నగర్:**బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో కాగజ్ నగర్ పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ సురవర్ధన్ తెలిపారు. ఈ ఏడాది ఫలితాల్లో పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించిందని ఆయన గర్వంగా వెల్లడించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్లో యమసాని వైష్ణవి 577 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, పర్వతి నైతిక 552, దోమల గగన్ రాణేష్ 551, తర్మని సాయి చందన 545, తేజస్ దత్రక్ 544 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. మొత్తం విద్యార్థుల్లో 15 మంది 500 కంటే ఎక్కువ మార్కులు సాధించడం విశేషమని ఆయన కొనియాడారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ సురవర్ధన్, డైరెక్టర్ వేద ప్రవీణ్, జియా ఉల్ హక్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

## నిజాంపేటలో అదనపు కలెక్టర్ పర్యటన

జనగణన, కొనుగోలు కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలో గత మూడు రోజుల నుండి నిర్వహిస్తున్న జనగణన ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను బుధవారం మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సందర్శించారు. అనంతరం సామాజిక, ఆర్థిక, విద్యాసర్వే, జనగణన ప్రక్రియ కార్యక్రమాన్ని సంబంధిత సర్వే బృందంతో పాల్గొని కుటుంబ యజమానులకు ఎక్కడ కూడా తప్పులు లేకుండా సభ్యుల వివరాలతో పాటు అన్ని వివరాలను సక్రమంగా తెల్పాలని సూచించారు. అనంతరం పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి తూకం కొలతలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు జరగకుండా టోకెన్ ప్రకారం సీరియల్ ప్రకారం కాంట నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ, ఆర్ఐ ప్రీతి, శ్రీకాంత్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## మెదక్ జిల్లాలో 96 శాతం ఉత్తీర్ణత



**ప్రజాపక్షం/మెదక్ :** తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో మెదక్ జిల్లాలో 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పది ఫలితాల్లో 97 శాతం మంది బాలికలు ఉత్తీర్ణిత సాధించి జిల్లాలో పై చేయిగా నిలిచారు. బాలురు 95 శాతం మంది ఉ త్తీర్ణులయ్యారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో మె దక్ జిల్లా 22 స్థానంలో నిలిచింది, మెదక్ జిల్లా వ్యాప్తంగా ప దవ తరగతి పరీక్షలకు 11,232 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 5572 మంది బాలురు ఉండగా, 5660 మంది బాలికలు పరీక్షలు రాశారు. ప్రభుత్వం వెలువరించిన పది ఫలితాల్లో జిల్లాలో 10853 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 5331 మంది ఉత్తీర్ణులు కాగా, బాలిక లు 5522 మంది విద్యార్థులు పాసయ్యారు. బాలికలు 97.56 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో పైచేయి సాధించారు. బాలురు 95.67 ఉత్తీర్ణత శాతం నమోదైంది. మెదక్ జిల్లాలో 379 మ ంది విద్యార్థులు ఫెయిలయ్యారు. జిల్లాలో ఎస్ఎస్‌సి ఫలితాల్లో నిజాంపేట్, వెల్దుర్తి, అల్లాదుర్గం మండలాలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. పదవ తరగతిలో ఫెయిల్ అయిన అభ్యర్థులు, అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రాసేవారు ఏప్రిల్ 30 తేదీ నుంచి మే 14 వ తేదీ గడువు వరకు సంబంధిత పాఠశాలల్లో పరీక్ష ఫీజును చెల్లించాలి. జూన్ 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తారు. ఉదయం 9:30 గంటల నుంచి 12: 30 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

## టెన్త్ ఫలితాల్లో నిర్మల్ రికార్డు

రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం...

కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

**ప్రజాపక్షం / నిర్మల్ :**పదవ తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుని సరికొత్త రికార్డు సృష్టించింది. జిల్లా సాధించిన ఈ ఘన విజయాన్ని పురస్కరించుకొని బుధవారం అధికారుల సమక్షంలో సంబురాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా విద్యాశాఖాధికారి దర్శనం భోజన్నతో కలిసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్, పరమేశ్వర్ తదితరులు పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లా విద్యార్థులు కనబరిచిన ప్రతిభ గర్వకారణమని, విద్యాశాఖాధికారులు , ఉపాధ్యాయుల సమిష్టికృషి వల్లే నిర్మల్ జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచిందని కొనియాడారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ , సబ్ కలెక్టర్ సంకేత్ మాట్లాడుత రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం జిల్లా విద్యా వ్యవస్థకు లభించిన గౌరవమని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి దర్శనం భోజన్న జిల్లా సాధించిన ఈ విజయానికి సహాకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి అడ్లూరి



ప్రజాపక్షం/ఎండపల్లి: ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలో బుధవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించారు.గ్రామానికి చెందిన భూసారపు భూమయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనంతరంభూసారపు భూమయ్య భూలక్ష్మి దంపతుల కుమారుడు రాకేష్ వివాహం అంజలితో కాగా మంత్రి లక్ష్మణ్ కుమార్ నూతన వధూవరులను ఈ సందర్భంగాఆశీర్వదించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామ రైతు వేదికలో బుధవారం తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బి.సౌజన్య పంట మార్పిడి, గిరాకీ ఉన్న వరి రకాలు, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. డా. కె. భవిత యూరియా, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతులు, నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఎ. రాజ్‌కుమార్ యూరియా బుకింగ్ యాప్, పంట అవశేషాలను కాల్చకుండా కలియ దున్నడం పై సూచనలు ఇచ్చారు. హెచ్ఈవో ఏ. శ్రీలత ఉద్యాన పంటల సబ్సిడీలపై వివరించారు. ఆయిల్ పామ్ మేనేజర్ వనోజ్ రెడ్డి ఆయిల్ పామ్ సాగు,మార్కెటింగ్ పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోన్ కంటి చిన్న వెంకట్, ఉప సర్పంచ్ రాపెల్లి మహేష్, ఏఈవోలు సాయికృప, రవళిక, సాగర్, రైతులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో నాలుగొవ స్థానం

ప్రజాపక్షం/జగిత్యాల : జగిత్యాల జిల్లా లో గత నెల మార్చి 13 నుంచి ఏప్రిల్ 15 వరకు నిర్వహించిన పదవ తరగతి పరీక్షలలో జగిత్యాల జిల్లా అద్భుత విజయంతో 98.87%తో రాష్ట్రంలోనే 4వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూజిల్లా మొత్తంగా 12687 మంది విద్యార్థులకు గాను 12544 మంది విద్యార్థులు అద్భుతంగా విజయాన్ని సాధించారని ,గతంలో నాలుగవ స్థానం, ఇప్పుడు కూడా అదే స్థానాన్ని నిలుపుకోవడం ఇట్టి విజయానికి కృషిచేసిన జిల్లా విద్యాశాఖ అధికారి రాము, వివిధ మండలాల విద్యాధికారులను , పాఠశాల సిబ్బందిని, విద్యార్థులను, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇదే స్ఫూర్తిని మునుముందు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని తెలిపారు.ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో విజయాలు సాధించి జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజ గౌడ్, జిల్లా విద్యాధికారి కె.రాము, ఎమ్ఇఒ లు, జిల్లా కోఆర్డినేటర్లు, విద్యా శాఖ సిబ్బందిపాల్గొన్నారు

## ఒసిపి–2 ప్రాజెక్టును సందర్శించిన ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు

ప్రజాపక్షం/రామగిరి : అర్జీ3 ఏరియా ఓసిపి2 ప్రాజెక్టుకు బుధవారం ఎఐటియుసి జనరల్ సెక్రెటరీ వైవి. రావు కార్మికుల యొక్క సమస్యలను తెలుసుకొనీ వెంటనే ప్రాజెక్ట్ అధికారులతో కార్మికుల యొక్క సమస్యలను చర్చించారు దానికి ప్రాజెక్ట్ అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు సింగరేణి కార్మికుల పక్షాన ఎల్లవేళలా ఎఐటియుసి యూనియన్ పోరాటాలు చేస్తుందని వైవీ.రావు కార్మికులకు తెలిపారుఈ కార్యక్రమం లో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బండారి. క్రాంతి గ, బ్రాంచ్ సెక్రటరీ ఎమ్మార్పీ రెడ్డి , పిట్ సెక్రటరీ ఎం.సురేష్ యూనియన్ ప్రతినిధులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలి: ఎస్ఐ రవికుమార్

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని రహదారులపై వరి ధాన్యం ఆరబోయడం వల్ల అనుకోని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మనం వేసే టార్పాలిన్ కవర్లు, బండరాళ్ల వల్ల వాహనదారులు, ముఖ్యంగా మన గ్రామస్తులే ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. అనేక కుటుంబాలు ఈ ప్రమాదాల వల్ల రోడ్డున పడుతున్నాయి. ప్రమాదాల నివారణ బాధ్యత మనందరిపై ఉందన్నారు.ఈ సందర్భంగా ఎస్సై ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు.వరి ధాన్యాన్ని కేవలం కల్లాల వద్ద,ఇంటి ప్రాంగణంలోనే ఆరబెట్టుకోవాలన్నారు.రహదారులపై ధాన్యం పోయడం పూర్తిగా నిషిద్ధం.అవసరమైతే గ్రామ పంచాయతీ కేటాయించిన నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే ధాన్యం ఆరబెట్టాలని,రాత్రి వేళల్లో రహదారులపై ఎలాంటి అడ్డంకులు (రాళ్లు, కవర్లు) ఉంచకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలు: రహదారులపై ధాన్యం పోసే వారికి తక్షణమే నోటీసులు జారీ చేయబడతాయి.నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.ప్రమాదాలకు కారణమైన వారిపై పోలీసు కేసులు నమోదు చేయబడతాయి.రైతు సోదరులందరూ ఈ విషయాన్ని గమనించి, పోలీసు శాఖకు సహకరించి, ప్రాణ నష్టాలను అరికట్టవలసిందిగా ఎస్సై రవికుమార్ కోరారు.

## 'ఆంగ్లోవేధిక్' విద్యార్థుల ప్రభంజనం



ప్రజాపక్షం/ధర్మపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం లోని ఆంగ్లోవేధిక్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు.ఆంగ్లో వేధిక్ పాఠశాలకు చెందిన షరియ 580,ఎస్.సాహితి 579,సీ హెచ్ శ్రీ మువ్వ 576,ఫారీస్ హుస్సేన్ 576, జి.జ్ఞానేశ్వర్ 571, ఏ.వినీల్ క్రిష్ణ 570,ఆర్.విఘ్నేష్ 570 మార్కులతో మండలంలోని ప్రయివేట్ పాఠధాలల్లో మొదటి అత్యధిక మార్కులు సాధించారు.అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను,ఫలితాల సాధనకై కృషిచేసిన పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని కరస్పాండెంట్ సంగనబట్ల దినేష్, ప్రిన్సిపాల్ తోట శంకర్ లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో మొత్తం 66 మంది విద్యార్థులు ఎస్సెస్సీ పరీక్ష రాయగా నూరు శాతం పాస్ అయినట్లు తెలిపారు.వీరిలో 23 మంది విద్యార్థులు 550 కి పైగా మార్కులు సాధించగా 500 కి పైగా 56 మంది విద్యార్థులు ఫలితాలు సాదించినట్లు తెలిపారు.

# మరింత వేగవంతంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



ప్రజాపక్షం/మానకొండూర్:ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని మానకొండూర్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. బుధవారం మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామంలో బొంగోని కవికృష్ణ, బొల్లం ఉమశ్రీనివాస్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల కు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పొందిన లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు మరింత వేగిరంగా పూర్తి చేసేలా ప్ర భుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇంటి పథకం సొంతింటి కలను సాకారం చేస్తున్నదని, అందుకే ఈ పథకానికి విశేష ఆదరణ లభిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నదని ఆయన చెప్పారు. అంతేకాకుండా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలు సత్వరం పరిష్కరించడం, దశల వారీ బిల్లుల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించడం వంటి తదితర సమస్యలతోపాటు రెవెన్యూశాఖకు సంబంధించిన పలు అంశాలపై గురువారం హైదరాబాద్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఆయా జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొంటారని ఎమ్మెల్యే వివరించారు.ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు లబ్ధిదారులకు మేలు చేకూర్చేవిధంగా ఉంటాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, కొండపల్కల సర్పంచ్ మాడ లక్ష్మితిరుపతిరెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రాములు గౌడ్, పార్టీ నాయకులు తోట శ్రీనివాస్, గడ్డం మార్కండేయ, నాగరాజు, బండి సంపత్, బండి వీరయ్య, పింగళి రవీందర్ రెడ్డి, కోంద్ర సురేష్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటి రిటర్న్‌లతో రేషన్ కార్డుల ఏరివేత

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:రేషన్ కార్డుల ఏరివేతలో ప్ర భుత్వం కొత్త ప్రమాణాలను అమలు చేస్తుండడం పేద ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. ముఖ్యంగా ఐటీ (ఇన్‌కమ్ ట్యాక్స్) రిటర్న్‌లు దాఖలు చేసిన వారిని అర్హుల జాబితా ను ంచి తొలగిస్తున్నారన్న ప్రచారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంప ట్నం మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో కలవరాన్ని రేపుతోంది.చిన్న వ్యాపారం నడపడానికి ఐటీ రిటర్న్ ఫైల్ చేశాం. దాని వల్లే ఇప్పుడు రేషన్ కార్డు పోతుందా?" అంటూ పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం పేదలకు అందించే సబ్సిడీ సరుకులు నిజమైన అర్హులకే చేరాలనే ఉద్దేశ్యం సరైనదే అయినప్పటికీ, ఐటి రిటర్న్‌లను మాత్రమే ప్రమాణంగా తీసుకోవడం సరైనదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.చాలా మంది చిన్న వ్యాపారులు, లోన్లు తీసుకుని ఇళ్లు కట్టుకున్న మధ్యతరగతి కుటుంబాలు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, విదేశీ విద్య కోసం ప్రయత్నిస్తున్న వారు కూడా నిబంధనల ప్రకారం ఐటీ రిటర్న్‌లు దాఖలు చేస్తుంటారు. అయితే వారి వాస్తవ ఆదాయం మాత్రం పరిమితంగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో రేషన్ కార్డుల తొలగింపు ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. లబ్ధిదారుల అసలు ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే కార్డులను రద్దు చేయాలని, లేకపోతే నిజమైన పేదలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 300 పై చిలుకు రేషన్ కార్డులను సంబంధిత సివిల్ సప్లై అధికారులు తొలగించినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది.స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు పేద ప్రజల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్మార్ట్ కిడ్స్ విద్యార్థుల విజయ కేతనం




ప్రజాపక్షం/కరీంనగర్:కరీంనగర్ లోని కాకతీయ స్మార్ట్ కిడ్స్ స్కూల్ విద్యార్థులు 2026 పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాల పేరును నిలబెట్టారు. క్రమశిక్షణతో కూడిన విద్య మరియు ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణ వల్లే ఈ ఘనవిజయం సాధ్యమైందని పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. టాప్ స్కోరర్లు మరియు వారి వివరాలు: పాఠశాల విద్యార్థులలో అత్యధికంగా ఎం.మధు శ్రీ 583/600 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఆమెతో పాటు మరికొందరు విద్యార్థులు సాధించిన మార్కులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: ఎం. మధు శ్రీ: 583, కె. వేణు: 581, కె. శశ్విత: 557, ఎన్. అంజలి: 554, ఎస్. లక్ష్మి ప్రసాద్: 546, ఏ. కాజల్: 523, వికాస్ రాజ్ 517, సాత్విక్ 509, హర్షిత 505 మార్కులు సాధించారు. మొత్తంగా 22 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 9 మంది విద్యార్థులకు 500 పైచిలుకు మార్కులతో పాటు 100 ఉత్తీర్ణత సాధించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల బోధనా పటిమకు ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ఇంతటి గొప్ప ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారికి సహకరించిన తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్, ప్రిన్సిపాల్ గున్నాల అర్చన, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించింది.

## తల్లిదండ్రులను వేధిస్తున్న కొడుకు,కోడలు

ఆర్‌డిఒకు ఫిర్యాదు



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రం లోని వాణీ నగర్ కు చెందిన బట్టు శంకర్ ,అనసూయ అనే వృద్ధ తల్లి దండ్రులను అనారోగ్యంతో భాద పడుతున్నప్పటికి ,పోషించని కనికరం లేని కొడుకు హరీష్,కోడలు జయలు ఇంట్లోంచి వెళ్లి పోవాలని తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో ఆర్డీవో మధుసూదన్ కు ఫిర్యాదు చేయగా కేసు నమోదుకు ఉత్తర్వులు జారీ చేశారు.బుధవారం జిల్లా సీనియర్ సిటిజెన్స్ కా ర్యాలయంలో వృద్ధ తల్లి బట్టు అనసూయ విలేకరులకు తన గోడు వినిపిస్తు రోధించారు.తాము కష్టార్జితంగా సంపాదించుకున్న ఆస్తులను అనుభవిస్తున్న కొడుకు హరీష్, కోడలు జయలు అస్తమా, షుగర్ రోగాలతో భాదపడుతున్న తండ్రి శంకర్ ను, తల్లి నైన మమ్మల్ని వైద్య ఖర్చులు పెట్టక, ఇల్లును అమ్ముకుంటానని మమ్మల్ని వెళ్లి పోవాలని తీవ్ర వేధింపుల, హింసలకు గురించేస్తున్న కొడుకు, కోడలుపై చర్యలు తీసుకోవాలని, మా ఇంటిని, ముంబయి లో మేము కట్టు కున్న ఇల్లు ను మా పేరిట మార్పించాలని, వేధింపులకు గురి చేస్తున్న కొడుకు, కోడలును ఇంట్లోంచి వెళ్లగొట్టి మా స్వాధీనం చేయించాలని కొడుకు, కోడలు పై ఆర్డీవో కు ఫిర్యాదు చేశామని, సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయం తో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని ఆవేదన వ్యక్తం చేసింది.వృద్ధ తల్లి అనసూయ వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు,న్యాయవాది హరి అశోక్ కుమార్, వృద్ధుల చట్టం కాన్సిలియేషన్ అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయం

కలెక్టర్ బి. సత్యప్రసాద్



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని చల్ గల్, తాటిపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా, వేగంగా కొనుగోలు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం స్వీకరణ పరిస్థితిని తూకం విధానాన్ని17% తేమ శాతం నిర్వహణను కేంద్రల వద్ద వసతులను కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యంపై ప్రభుత్వ నిబందనల మేరకు తేమశాతం తప్పనిసరిగా పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోళ్ళు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా తక్షణమే రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్లస్టర్ అధికారులకు కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన బరువు యంత్రాల నిర్వహణ, ఒ.ఆర్.ఎస్ ప్యాకెట్స్, త్రాగునీరు, షేడ్ నెట్ ల ఏర్పాటు, ధాన్యం కొనుగోళ్ళు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని క్లస్టర్ అధికారులకు సూచించారు. అలాగే వాతావరణం మార్పుల దృష్ట్యా టార్ఫలిన్ కవర్లులు అందుబాటులో ఉంచుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, డి.ఆర్.డి.ఓ రఘువరన్, ఎంపీడీవో రమాదేవి, ఎమ్మార్వో అకిమ్, ఎఎంసి చైర్మన్ నారాయణ రెడ్డి,సెక్రెటరీ వేణు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్‌క్రైమ్, సోషల్ మీడియా స్నేహాలకు దూరం

సిద్దిపేట కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/ సిద్దిపేట : సైబర్ క్రైమ్, సమాచార మాధ్యమాల ద్వారా ఏర్పడిన చెడు స్నేహాల వలలో పడి అనర్థాలకు గురికావద్దని జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో ప్రజాపాలన,ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నర్సింగ్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్ నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల భద్రత,నోడ్రగ్స్ ప్రచారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మీకందరికి ప్రతిది మాకు తెలుసు అనే భ్రమలో కలిగిన వయస్సు మీదని. నిజం, అబద్ధం అనేది గ్రహించకుండ త్వరగా అట్రాక్టివ్ అవుతారని తెలిపారు. ముందు రోజుల్లో ఇంటర్నెట్ టెక్నాలజీ అవసరం మేరకు వాడుకోవాలన్నారు. వాట్సాప్, సోషల్ మీడియాలో రకరకాల కొత్త వారితో స్నేహాలు చేస్తూ ఉంటారని, అలా చేయటం వల్ల సమయం ,చదువు, జీవితంలో చాల అనర్థాలకు గురవుతున్నారన్నారు. చాల మంది విద్యార్థులు అక్కడక్కడ ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు చూస్తున్నామని దీనికి కారణం సోషల్ మీడియా స్నేహాలు మాత్రమే అన్నారు. కుటుంబానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని బయట ఎంత తక్కువమంది స్నేహితులుంటే వారి జీవితం ప్రశాంతంగా ఉంటుందన్నారు. పిల్లలన తల్లిదండ్రులు 20 సంవత్సరాలు పెంచారని వారి కళలను ఏ లక్ష్యం మేరకు చదివిస్తున్నారో ఆ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అధ్యాత్మిక భావన, యోగ,ధ్యానం, చేసుకొని పాజిటివ్ దృక్పథం కలిగిఉండాలన్నారు. బయట సమాజంలో ఏలాంటి సమస్యలు ఎదురైన ముందుగా కుటుంబ సభ్యులకు మాత్రమే తెలుపాలన్నారు.విద్యాపరంగా సమస్యలు ఎదురైతే ఉపాధ్యాయులకు తెలుపాలన్నారు. సైబర్ క్రైమ్,డ్రగ్స్ బారిన పడకుండ జిల్లా సంక్షేమ శాఖ పోలీసుశాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఏలాంటి ఇబ్బందులు ఎదురైన టోల్‌ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారధ. సిడిపిఓ రాము, వన్‌టౌన్ సిఐ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో గాయత్రీ విద్యానికేతన్ ప్రతిభ




ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :ఏప్రిల్ 29, 2026 బుధవారం విడుదలైన ఎస్ఎస్సి ఫలితాలలో స్థానిక పెద్దపల్లి పట్టణం లోని గాయత్రీ విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి విశేష ప్రతిభ కనబర్చారు.ఈ సందర్భంగా విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. బి. వీక్షిత్ 583 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందగా, నూర్ ఫాతిమా 582, పి. సుబీక్షన్ 581, బి. గీతిక 579,అమీమా తహ్రీన్ 578, జే. సాహితీ ప్రియ 575, జి. అశ్విత్ కౌండిన్య 575, ఎన్. హరిని 572, యు.చక్రిక 571, సిహెచ్.లయవర్ధిని 571 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారు.గణితంలో ముగ్గురు విద్యార్థులు 100కు 100 మార్కులు సాధించగా, 25 మంది విద్యార్థులు 90కు పైగా మార్కులు పొందారు. అలాగే భూసారపు వీక్షిత్ తెలుగులో 100కు 100 మార్కులు సాధించడం పాఠశాలకు గర్వకారణమని సంస్థ చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ తెలిపారు.ఈ పరీక్షలకు హాజరైన మొత్తం 61 మంది విద్యార్థులు 61 మంది ఉత్తీర్ణత సాధించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. అదేవిధంగా 500 మార్కులకు పైగా 36 మంది విద్యార్థులు సాధించడం విశేషమని అన్నారు.ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా కరెస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపల్ విజయ్, వైస్ ప్రిన్సిపల్ ప్రియాంకతో పాటు ఉపాధ్యాయులు సృజన, గౌసియా, లింగేశ్వర్, రాజ్ కుమార్, సదానందం, సంయుక్త, మహేష్, రిజ్వాన్ విద్యార్థులను అభినందించారు.

## వెంటనే నాణ్యమైన ధాన్యం లోడింగ్

కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే లోడింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీ కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులతో సమన్వయం చేసుకుంటూ నాణ్యత ప్రమాణాలు పూర్తి చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేయాలని ఆదేశించారు. వాతావరణంలో మార్పుల కారణంగా వర్షపాతం అవకాశాలు ఉన్నందున ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు తూకం చేసి సురక్షితంగా నిల్వ చేయాలని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రస్తుతం 80 శాతం పూర్తయిందని, దీన్ని తక్షణమే 92 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు, ఏడీఏ,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలి

తెలంగాణ రైతు సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



ప్రజాపక్షం/జమ్మికుంట:రాష్ట్ర ప్రభుత్వం ఈ రబీ సీజన్లో ఐకెపి, ప్యాక్స్, డిసిఎంఎస్, హాకా సంస్థల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు సెంటర్లు ప్రారంభించి కొనుగోళ్ళు వేగవంతం చేయకపోవడం మూలంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో మడిపల్లి గ్రామం లోని ఐకెపి వద్ద కొనుగోలు సెంటర్ ను సందర్శించి, కొనుగోళ్ల తీరు పరిశీలించారు. నిర్వాహకులు సెంటర్లో కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. టార్పాలిన్లు రైతులకు ఇవ్వకుండా, నీడ కోసం టెంట్లు వేయకుండా, మంచినీటి సౌకర్యం కల్పించకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో అనేక కొర్రీలు పెడుతూ కొనుగోలు చేయడం లేదని, పక్షం రోజులుగా సెంటర్ లోనే ధాన్యం కాపలా ఉంటున్నారని ఆరోపించారు. తేమ పేరుతో కాటాలు వేయకపోవడం మూలంగా మబ్బులు వచ్చినప్పుడు ధాన్యాన్ని కుప్పలు పోస్తూ, ఆరబోస్తూ ప్రతినిత్యం ఇబ్బం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకత, అక్రమాలను అరికట్టేందుకు తెచ్చిన కొత్త విధానాలు జిపిఎస్ ట్రాకింగ్, రియల్ టైం డాటా ఎంట్రీ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. కొత్త నిబంధనలతొ కొనుగోళ్ళు మరింత ఆలస్యం చేస్తున్నాయన్నారు. కొనుగోలు సెంటర్లలో కుప్పలు తెప్పలుగా ధాన్యం రాశులు ఉన్నాయన్నారు.
అకాల వర్షాలు వస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందనీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీలు, ట్రాక్టర్లు, బొలెరో వాహనాలకు జిపిఎస్ సిస్టం ఏర్పాటు కోసం మూడు వేల నుండి 5000 ఖర్చు అవుతుందని దీంతో వాటి యజమానులు జిపిఎస్ చేసుకోవడానికి ముందుకు రావడం లేదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ట్రక్ షీట్, జిపిఎస్, ఆన్లైన్ విధానాలను తక్షణమే రద్దుచేసి పాత పద్ధతిలోనే ధాన్యం కొనుగోళ్ళు చేయాలన్నారు. నూతన విధానం తెచ్చి రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రధాని మోధిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ద్రోహులుగా మిగిలిపోతారని ధ్వజమెత్తారు. కౌలు రైతుల దయనీయ స్థితి పాలకులు అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 100 సెంటర్ల లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రజా ప్రతినిధులు, పాలక పార్టీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారని సుమారు 14 కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోలు చేశారని, గత ఏడాదితో పోల్చుకుంటే చాలా తక్కువగా కొనుగోలు చేశారన్నారు. ఈ రబీ సీజన్లో సుమారు 3.70 లక్షల మెట్రిక్ టన్ల దిగుబడి వస్తుందని సివిల్ సప్లై అధికారులు అంచనా వేయగా ఇప్పటివరకు కేవలం పదివేల టన్నుల లోపే కొనుగోలు చేయడం చూస్తుంటే ప్రభుత్వ అధికార యంత్రాంగం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతుందన్నారు. సెంటర్లలో కనీస సౌకర్యాలు కల్పించి, పాత పద్ధతిలోనే ఎలాంటి ఆంక్షలు లేకుండా, యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా కలెక్టరేట్ను, మంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు శీలం అశోక్, కాయిత లింగారెడ్డి, రైతు నాయకులు రాజిరెడ్డి, కస్తూరి రవి, బండి ఓదెలు, వరికల రాజేశ్వరరావు, సింగవేన కుమారస్వామి, సురేష్‌పాల్గొన్నా రు.

# రాజస్థాన్ రాయల్స్‌దే విజయం

## పంజాబ్ జైత్రయాత్రకు బ్రేక్.. దూబే, ఫెరీరా విధ్వంసంతో మురిసిన రాజస్థాన్!



పంతొమ్మిదో సీజన్‌లో భారీ లక్ష్యాలను అలవోకగా ఛేదిస్తూ అజేయంగా దూసుకెళ్తున్న పంజాబ్ కింగ్స్‌కు షాకిచ్చింది రాజస్థాన్ రాయల్స్. ఆరు విజయాలతో టాపర్‌గా కొనసాగుతున్న పంజాబ్‌కు తొలి ఓటమి రుచి చూపించింది. 223 లక్ష్య ఛేదనలో యశస్వీ జైస్వాల్(51), వైభవ్ సూర్యవంశీ(43)లు మెరుపు ఆరంభమివ్వగా.. డొనొవాన్ ఫెరీరా(52 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ శుభం దూబే(31 నాటౌట్)లు డెత్ ఓవర్లలో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఆరో విజయంతో మూడో స్థానానికి దూసుకెళ్లింది రాజస్థాన్. ఐపిఎల్19లో పంజాబ్ కింగ్స్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తున్న పంజాబ్‌కు సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ ఊహించని పంచ్ ఇచ్చింది. ముల్లన్‌పూర్‌లో నిర్దేశించిన 223 పరుగుల ఛేదనను రాజస్థాన్ రాయల్స్ ధాటిగా మొదలెట్టింది. తొలి ఓవర్లోనే అర్షదీప్ సింగ్‌కు చుక్కలు చూపిస్తూ వైభవ్ సూర్యవంశీ(43) 6, 4, 4 బాదాడు. అనంతరం యాన్సెన్, ఫెర్గూసన్ ఓవర్లోనూ వైభవ్ విధ్వంసంతో 20 బంతుల్లోనే 51 పరుగులు చేసింది రాజస్థాన్.

అర్ధ శతకానికి చేరువైన వైభవ్ ఆ తర్వాతి బంతికే అయ్యర్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్()ను చాహల్ ఔట్ చేసి రెండో వికెట్ అందించాడు. షాట్లతో అలరించిన యశస్వీ జైస్వాల్()ను సైతం వెనక్కి పంపిన చాహల్.. కెప్టెన్ రియాన్ పరాగ్()ను పెవిలియన్ చేర్చాడు. చాహల్ వేసిన 14వ ఓవర్లో తొలి రెండు బంతుల్ని 6,4గా మలిచిన పరాగ్ చివరిబంతికి ఔటయ్యాడు.

### దూబే, ఫెరీరా ధనాధన్

వెంట వెంటనే వికెట్లు పడినా ఇంప్యాక్ట్ సబ్గా వచ్చిన శుభమ్ దూబే(31 నాటౌట్) డొనొవాన్ ఫెరారా(52 నాటౌట్)లు అదరలేదు. గెలుపు బాధ్యత తీసుకున్న ఈ జోడీ పంజాబ్ నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. అర్షదీప్ వేసిన 18వ ఓవర్లో ఫెరీరా 6, 4.. చివరి బంతిని దూబే స్టాండ్స్‌లోకి పంపగా మ్యాచ్ రాజస్థాన్ వైపు మళ్లింది. 12 బంతుల్లో 18 రన్స్ అవసరమైన వేళ.. ఫెర్గూసన్ బౌలింగ్లో 4, 6 బాదిన ఫెరీరా పంజాబ్ ఓటమిని ఖాయం చేశాడు. యాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో స్ట్రెయిట్ సిక్సర్‌తో అర్ధ శతకం సాధించిన ఫెరీరా.. రాజస్థాన్‌కు 6 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు.

## ప్రపంచ 'టిటి'లో భారత్ శుభారంభం



**లండన్:** ప్రతిష్ఠాత్మక ప్రపంచ టీమ్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల టీమ్ శుభారంభం చేసింది. మంగళవారం మొదలైన మెగాటోర్నీలో భారత్ 3–0తో ట్యునీషియాపై అద్భుత విజయం సాధించింది. మానుశ్ షా, మానవ్ థక్కర్, హర్మీత్ దేశాయ్ జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారు. మానుశ్ షా 11–5, 9–11, 11–3, 11–5తో ఎసిద్ వస్సి్న అలవోకగా గెలిచాడు. పూర్తి ఏకపక్షంగా సాగిన మరో గేమ్లో మానవ్ థక్కర్ 11–3, 11–3, 11–3తో యూసెఫ్ అద్లిపై సునాయాస విజయం ఖాతాలో వేసుకున్నాడు. హర్మీత్దేశాయ్ 11–5, 11–4, 11–8తో అబుబాకెర్ బౌరెస్సు ఓడించాడు. స్లోవేకియా, గ్వాటెమాల, ట్యునీషియాతో కలిసి గ్రూపు7లో ఉన్న భారత్ ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతున్నది. మరోవైపు మహిళల విభాగంలో ఉగాండ పోటీకి గైర్హాజరు కావడంతో భారత్ 3–0తో ముందంజ వేసింది.

## వెయిట్ లిఫ్టర్లకు నాలుగు స్వర్ణాలు



**ఢిల్లీ:** సమోవాలో జరుగుతున్న కామన్వెల్త్ యూత్ అండ్ జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో భారత యువ వెయిట్ లిఫ్టర్లు సత్తా చాటారు. రెండో రోజు పోటీల్లో భాగంగా దేశానికి నాలుగు పసిడి పతకాలు అందించారు. పురుషుల 65 కిలోల విభాగంలో సునీల్‌సింగ్ 271 కిలోల బరువు (126 కి. స్నాచ్, 145 కి. క్లీన్ అండ్ జెర్క్) ఎత్తి పసిడి నెగ్గగా మహిళల 58 కి. క్యాటగిరీలో ఐసంగ గొగొయ్ 185 కి. (79 కి. స్నాచ్, 106 కి. క్లీన్ అండ్ జెర్క్)తో స్వర్ణం గెలిచింది.

## తొలి మానవ హక్కుల ప్రకటన






సైరస్ సిలిండర్ అనేది మానవ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పురాతన స్మృతిచిహ్నాలలో ఒకటి. ఇది సుమారు క్రీస్తు పూర్వం 539 సంవత్సరానికి చెందినది. ఆ కాలంలో పర్షియన్ సామ్రాజ్య స్థాపకుడైన సైరస్ ది గ్రేట్ బాబిలోన్‌ను జయించిన అనంతరం రూపొందించిన పాలనా ప్రకటనగా దీనిని భావిస్తున్నారు. నేటి ఇరాక్ ప్రాంతమైన ప్రాచీన బాబిలోన్‌లో లభించిన ఈ మట్టి సిలిండర్, ప్రపంచంలోనే తొలి మానవ హక్కుల ప్రకటనలలో ఒకటిగా విస్తృతంగా గుర్తింపు పొందింది. ఈ సిలిండర్ బంకీ ఆకారంలో ఉండే కాల్చిన మట్టితో తయారైంది. దానిపై అకడియన్ భాషలో క్యూనిఫామ్ లిపిలో వాక్యాలు చెక్కారు. ఈ లిపిలో సైరస్ తన పాలన విధానాన్ని వివరించాడు. ముఖ్యంగా బాబిలోన్ ప్రజలపై జరిగిన అణచివేతలను తాను ముగించినట్లు, బలవంతపు బానిసత్వాన్ని రద్దు చేసినట్లు, వివిధ జాతుల ప్రజలను వారి స్వదేశాలకు తిరిగి పంపించినట్లు, వారి దేవతల విగ్రహాలను ఆయా దేవాలయాలకు తిరిగి ప్రతిష్ఠించినట్లు ఈ శాసనం పేర్కొంటుంది. అప్పటివరకు యుద్ధ విజేతలు చేసిన విధ్వంసానికి భిన్నంగా, సైరస్ అనుసరించిన సహన, మానవీయ పాలన విధానం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. శిల్పకళ పరంగా ఇది సాధారణంగా కనిపించినా, దాని ఆలోచనాత్మక విలువ అపారమైనది. మత స్వేచ్ఛ, వ్యక్తిగత గౌరవం, సమానత్వం వంటి భావనలు ఈ సిలిండర్ ద్వారా తొలిసారిగా అధికారికంగా వ్యక్తమయ్యాయని చరిత్రకారులు భావిస్తారు. అందుకే దీనిని అంతర్జాతీయ మానవ హక్కుల చరిత్రకు మూలస్తంభంగా పరిగణిస్తారు. ఐక్యరాజ్యసమితి కూడా దీనిని మానవ హక్కుల చిహ్నంగా గుర్తించింది. సైరస్ సిలిండర్ మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. కాలాలు మారినా, నాగరికతలు ఎదిగినా, మానవ గౌరవం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలు శాశ్వతమైనవని ఇది గుర్తుచేస్తుంది. మట్టితో తయారైన ఒక చిన్న సిలిండర్ అయినప్పటికీ, అది మానవత్వానికి దిశానిర్దేశం చేసిన గొప్ప ఆలోచనల వాహకంగా నిలిచింది. అందువల్ల ఇది కేవలం పురావస్తు అవశేషం మాత్రమే కాదు , ప్రపంచ సాంస్కృతిక వారసత్వంలో మానవ హక్కుల ఆత్మను ప్రతిబింబించే చిరస్థాయి స్మారక చిహ్నంగా నిలుస్తోంది.

## 'టెట్రాపిలోన్' అద్భుత శిల్పకళ



ఆఫ్రోడిశియాస్ నగరంలో ఉన్న ఆ టెట్రాపిలోన్ ప్రాచీన రోమన్ వాస్తు శిల్పకళకు ప్రతీకగా నిలిచే అద్భుత నిర్మాణం. నేటి టర్కీ దేశ పరిధిలో ఉన్న ఈ పురాతన నగరం, ప్రేమ సౌందర్య దేవత అయిన ఆఫ్రోడైట్‌కు అంకితమైన ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఆ దేవాలయానికి ప్రధాన ప్రవేశ ద్వారంగా టెట్రాపిలోన్‌ను సుమారు క్రీ.శ. రెండో శతాబ్దంలో నిర్మించారు. ఇది అప్పటి కళ, మతం, శిల్ప నైపుణ్యాల సమ్మిళిత రూపంగా నిలుస్తున్నది. టెట్రాపిలోన్ అనే పేరు దాని నిర్మాణ విధానాన్నే సూచిస్తుంది. ఇది నాలుగు వైపులా తెరుచుకునే నిర్మాణం. మొత్తం నాలుగు సమూహాలుగా ఏర్పడిన 16 కొరింథియన్ శైలిలోని స్తంభాలు దీనికి ప్రధాన ఆకర్షణ. ఈ స్తంభాలపై ఆకుల రూపకల్పన, వంకర తిరిగిన అలంకారాలు, శిల్పకారుల సూక్ష్మ నైపుణ్యాన్ని స్పష్టంగా చూపిస్తాయి. స్తంభాల మధ్య ఏర్పాటైన లోతైన రిలీఫ్ శిల్పాలు, పుష్పాల అలంకరణలు, దేవతా రూపాలు ఆఫ్రోడిశియాస్ శిల్ప పాఠశాల ఎంత గొప్పదో తెలియజేస్తాయి. పాలరాతితో చేసిన ఈ నిర్మాణం, వెలుతురు పడినప్పుడు మరింత వైభవంగా మెరిసిపోతుంది. రోమన్ యుగంలో దేవాలయాలకు ఇలాంటి వైభవమైన ప్రవేశ ద్వారాలు నిర్మించడం ద్వారా, దేవతల గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయాలనే ఆలోచన స్పష్టంగా కనిపిస్తుంది. కాలక్రమంలో టెట్రాపిలోన్ కొంత మేర ధ్వంసమైంది. అయితే 20వ శతాబ్దంలో జరిగిన పురావస్తు తవ్వకాలు, పునఃనిర్మాణ ప్రయత్నాల వల్ల దీని అసలు వైభవం తిరిగి వెలుగులోకి వచ్చింది. నేడు ఇది యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తించిన ఆఫ్రోడిశియాస్‌లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.

## రహస్య నాలాలు



పెరూ దేశంలోని ఒలంటయటాంబో ప్రాంతంలో, సరస్సు సమీపంలో కనిపించే రహస్యమైన రాతి నాలాలు ప్రాచీన ఇన్కా నాగరికతకు చెందిన అసాధారణ ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తాయి. ఎంతో శ్రద్ధతో చెక్కినట్టు కనిపిస్తున్న ఈ నిర్మాణాలు 15వ శతాబ్దం నాటివని చరిత్రకారులు భావిస్తున్నారు. రాతితో నిర్మించిన ఈ మార్గాలు భూమి ఉపరితలానికి సమతూకంగా అమర్చబడి ఉండటం వాటి నిర్మాణ నైపుణ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. వీటిని పరిశీలించినప్పుడు, ఇన్కా ప్రజల తర్కబద్ధ ఆలోచన, ఖచ్చితమైన ప్రణాళిక, వినియోగానికి అనుకూలమైన రూపకల్పన మనకు స్పష్టంగా కనిపిస్తుంది. కాలక్రమేణా గాలి, వర్షాల ప్రభావంతో ఈ రాతి నిర్మాణాలపై ఏర్పడిన గీతలు వాటి ప్రాచీనతకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. అవి కేవలం ప్రకృతి ప్రభావాల గుర్తులే కాదు.. ఈ నిర్మాణాలు ఎన్నో శతాబ్దాల చరిత్రను మోస్తున్నాయని తెలియజేసే జీవన చిహ్నాలు కూడా. ఈ నీటి నాళాలు ఇన్కా ప్రజల హైడ్రాలిక్ వ్యవస్థలపై ఉన్న అధునాతన సాంకేతిక జ్ఞానాన్ని ప్రతిబింబిస్తాయి. ఇవి కేవలం నీటిని తరలించే మార్గాలుగా మాత్రమే కాకుండా, భూభాగాన్ని సమర్థవంతంగా వినియోగించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం వంటి అంశాల్లో వారి లోతైన అవగాహనను సూచిస్తాయి. అంతేకాక, ఈ నాలాలు మనలను గత కాలానికి తీసుకెళ్లి, మానవ అభివృద్ధి అసలు అర్థాన్ని గుర్తు చేస్తాయి. సాంకేతికత, ప్రకృతి, మానవ సంక్షేమం మధ్య సమతుల్యతను ఎలా సాధించాలో ఇన్కా నాగరికత చూపించిన మార్గాన్ని ఇవి ప్రతిబింబిస్తాయి. శతాబ్దాలు గడిచినా ప్రాచీన జ్ఞానం, నాగరికతల శాశ్వత విలువలను గుర్తుచేస్తూ చరిత్రలో అమూల్య సంపదగా నిలుస్తున్నాయి.

## ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

### సిపిఐ సీనియర్ నేత చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని, వారు పండించిన వరి, మొక్కజొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి మిల్లర్ల వద్దకు చేర్చాలని సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం నాగెల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వరి కోతల సమయంలో రైతుల కష్టాలు వర్ణానతీతమన్నారు. ఎండాకాలంలో పంటలు సాగునీరు అంది అందక పంటలు ఎండి, తక్కువ దిగుబడి రావడంతో నష్టాల్లో కూరుకుపోయి ఉంటే, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొన్నప్పటికీ వాటిని గతంలో మాదిరిగా కాకుండా రైస్ మిల్లులకు తీసుకువెళ్లి వాటిని అప్పగించే విధానంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మిల్లర్లు వాటిని అన్‌లోడ్ చేసుకోకుండా హమాలీ కొరత సాకు చూపుతూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఆన్‌లైన్ సిస్టమ్ తెచ్చి మిల్లులను అలాట్ చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని, పౌర సరఫరాలశాఖ కానీ, సహకార సంఘాల ద్వారా కానీ కొనుగోలు చేసి మిల్లులకు పంపడం వల్ల రైతులకు మేలు కలుగుతుందన్నారు. తక్షణమే అధికారులు స్పందించాలని, ఇది కేవలం ఒక ప్రాంతం సమస్య కాదని రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్య అన్నారు. వరి ఒక్కటే కాదు మక్కల కొనుగోలు చేయకపోతే అకాల వర్షాలకు తడిసి రైతులకు నష్టం కలుగుతుందన్నారు. రైతు పండించిన పంటను కొనుగోలు చేయడానికి తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం పూనుకోవాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ధర్నాలు, నిరసనలు తెలియజేస్తామని చాడ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ నాయుకులు పొనగంటి కేదారి, అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, నాగెల్లి లక్ష్మారెడ్డి, సమ్మయ్య, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ పిలుపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్‌తో కలిసి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు నోటిఫికేషన్ జారీ చేసిందని, వీటిని కొన్ని రాష్ట్రాలు అమలు చేయమని చెప్పడం జరిగిందని, కాని తెలంగాణలో అమలు చేయమని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు చెప్పలేదని, వీటిని రాష్ట్రంలో, సింగరేణిలో అమలు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంతో, యూనియన్‌లతో, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ముందడుగు వేయలేదని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వం సింగరేణిని పట్టించుకోకపోవడంతో కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వీడి వెంటనే పరిష్కరించాలని, లేకుంటే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. సమావేశంలో గోసికమోహన్, ఎం.ఎ.గౌస్, బిట్టి వెంకటేశ్వర్లు, తొడుపునూరి రమేశ్‌కుమార్, పడాల కనక రాజు, బూడిద మల్లేష్, చెప్యాల మహేందర్ రావు, మీసాల మల్లయ్య, కోడూరి మునిందర్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మే డే స్ఫూర్తితో కార్మికోద్యమాలు బలోపేతం చేద్దాం

### మేడే పోస్టర్ ఆవిష్కరణలో పలువురు పిలుపు


భువనగిరిలో...


భద్రాచలంలో...


మహబూబ్‌నగర్‌లో...

**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఉద్యమ స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌ల రద్దుకై కార్మికులు ఉద్యమించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ పిలుపునిచ్చారు. బుధవారం భువనగిరి పట్టణంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయకార్యదర్శి గనబోయిన వెంకటేష్, నాయకులు సామల శోభన్‌బాబు, సామల భాస్కర్, పుట్ట రమేష్, వల్లస్ నర్సింహా, జయేందర్, రాములు, వెంకటేష్, కృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**మహబూబ్ నగర్ :** కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మహబూబ్ నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి అన్నారు. మేడే సంబరాలను పురస్కరించుకొని ఎఐటియుసి రూపొందించిన పోస్టర్స్‌ను బుధవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, సిపిఐ హన్వాడ మండల కార్యదర్శి ఎస్.శంకర్ నాయక్, నాయకులు దేవానంద్, రంగన్న, మొగులయ్య, అంజి, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**జనగామ :** మేడే రోజు జనగామ జిల్లాలోని అన్ని గ్రామాలు, వాడవాడల్లో ఎర్రజెండా ఎగరవేసి కార్మిక శక్తి చాటాలని ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు సిహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జనగామలోని సిపిఐ కార్యాలయం గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన సిపిఐ జిల్లా సమితి సమావేశం జరిగింది. సమావేశంలో పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న, సొప్పరి సోమయ్య, రావుల సదానందం, కావటి యాదగిరి, జువారి రమేష్, పాతూరి ప్రశాంత్, మాలోతు సీతారాంనాయక్, జీడి ఎల్లయ్య, మోటె శ్రీశైలం, చామకూర యాకూబ్, చల్లోజు మల్లేశం, సముద్రాల రాజు, నీలా కనకయ్య, గుగులోతు సఖి పాల్గొన్నారు.

**కాగజ్ నగర్ :** మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై కార్మిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. బుధవారం కాగజ్ నగర్ ఏరియా ఆసుపత్రిలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలోనాయకులు సిద్ధార్థ, సాయి, బురాణ్, ఇమ్రాన్, మీనాక్షి, శారద పాల్గొన్నారు.

**మంచిర్యాల :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేసి, గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో మేడే ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు మధు, రాజమల్లు, ప్రశాంత్, రాకేష్, అశోక్, చంద్రయ్య, సత్తయ్య, లతా, దుబ్బమ్మ, మాణిక్య పాల్గొన్నారు.

**ఖిలా వరంగల్ :** వరంగల్ ఇఎస్ఐ హాస్పటల్‌లో మే డే పోస్టర్లను ఇఎస్ఐ హాస్పటల్ కార్యదర్శి భాస్కర్ల సతీష్ అధ్యక్షతన ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, ఇఎస్ఐ హాస్పటల్ కార్మికులు మధుసూదనాచారి, కవిత కుమారి, స్వప్న చిన్న బాబు, మధు, భారతి, రేణుక, స్వాతి, ఐలయ్య, నితిన్, భవితవ్య పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** మేడే వేడుకలను జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేద్దామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెం ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్యతో కలిసి ఆయన మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి జి.నగేష్, జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లిఖార్జున్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, మర్రి కృష్ణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ :** నిర్మల్‌లోని సిపిఐ కార్యాలయంలో మే డే పోస్టర్లను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై కార్మిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలనిమేడే పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కార్మిక వర్గం ఏఐటియూసి జెండాలను ఎగురవేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసచారి మాట్లాడుతూ కార్మికుల హక్కులను రక్షించుకోవడమే లక్ష్యంగా ఐక్యంగా పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎస్.ఎన్.రెడ్డి పండరీ, ముత్యం, ఫయాజ్, డీకొండ రాజేశ్, బాపురావు, సాయి కొట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.


జనగాంలో...



ఖిలా వరంగల్‌లో...


మంచిర్యాలలో...


నిర్మల్‌లో...


కాగజ్‌నగర్‌లో...

## ఎస్ఎస్‌సి ఫలితాలలో స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విజయకేతనం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఎస్‌సి ఫలితాల్లో ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి విజయకేతనం ఎగురవేశారని పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు జి. సాయితేజ అశ్రీత్ 600 మార్కులకు 586, ఎస్‌కె యాసినా 578, ఎం. భావనరెడ్డి 577, బి. సాయిషణ్ముక శ్రీనివాస్ 577, ఎం. సౌమ్యశ్రీ 576, వై. సిరిఆకాంక్ష 574, డి. ప్రసన్న 573, జి. రిషిత 572 మార్కులు సాధించారని తెలిపారు. 550కు పైగా మార్కులు 20 మంది, 540కు పైగా 27 మంది, 520కు పైగా 38 మంది, 500లకు పైగా 51 మంది విద్యార్థులతో పాటు నూరు శాతం ఫలితాలను సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు అభినందించారు. సామాన్య విద్యార్థులతో అసమాన ఫలితాలు సాధించినట్లు వారు తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన ‘న్యూఇరా’



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఎస్‌సి ఫలితాల్లో న్యూఇరా విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి సత్తా చాటారని పాఠశాల ఛైర్మన్ ఐవి రమణారావు, డైరెక్టర్ డా॥ పి.భూమేశ్వరరావు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎస్. రక్షిత 600 మార్కులకు గాను 579, జి. జశ్విక 578, జి. భవిష్య 578, వి. అనుష్క 572, ఆర్. శ్రీలక్ష్మి మేఘనరెడ్డి 571 మార్కులు సాధించారన్నారు. పరీక్షలు రాసిన ప్రతి ముగ్గురిలో ఒకరు 500లకు పైగా మార్కులు సాధించారన్నారు. అన్ని సబ్జెక్టులలో నూటికి నూరు శాతం పలువురు విద్యార్థులు సాధించారన్నారు. 174 మంది పరీక్షకు హాజరై నూరు శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ ఐవి రమణారావు, డైరెక్టర్ పి. భుమేశ్వరరావు లు అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన విద్యార్థులను, సహకరించిన ఉపాధ్యాయులకు , తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ‘టెన్త్’ గీతాంజలి జైత్రయాత్ర



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి ఫలితాల్లో ఖమ్మం నగరంలో ని శ్రీనివాస్ నగర్‌లో గల గీతాంజలి విద్యానికేతన్ ఉత్తమ ఫలితాలు సాధించి జైత్రయాత్ర సాగించిందని పాఠశాల కరస్పాండెంట్ టివి అప్పారావు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పి. నవదీప్ 600 మార్కులకు 591, ఎం. యశశ్విత 591, యు. వేదశ్రీ 588, ఎస్. షాన్విత 585, ఎస్‌కె ఆసిఫ్ 582, పి. సృష్టి 575, ఎస్‌డి ఫజల్ 570, సిహెచ్ వెంకటలక్ష్మి 569, ఆర్. కళ్యాణ్ రెడ్డి 564, వి. దీక్షిత 560, ఎం. చరణ్ 559, జే. సాత్విక్ 557, ఎస్‌కె ఖాజా 556, జి. మోక్షజ్ఞ 554 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు కరస్పాండెంట్ టివి అప్పారావు, డైరెక్టర్లు ఉపాధ్యాయులు అభినందించారు.

## హార్వెస్ట్‌కు ఉన్నతశ్రేణి ఫలితాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు ఉన్నతశ్రేణి ఫలితాలు సాధించి అగ్రభాగాన నిలిచారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజమాన్యం తెలిపింది. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన గుండ్ల జశ్వంతి 600 మార్కులకు 584 మార్కులు సాధించిందని తెలిపారు. మహిరా మీర్జా 583, ఉదారపు చరణ్ 579, కొల్లి సిద్దార్థ్ 579, కె. శ్రీరేష్మ 576, చింతల సాయితరుణ్ 576, వై. దీపిక రెడ్డి 574, వి. హర్షిత్ 574 మార్కులు సాధించినట్లు తెలిపారు. 550 మార్కులకు పైగా 28 మంది, 500లకు పైగా మార్కులు 80 మంది సాధించారని తెలిపారు.

## గురుకులలో మెరుగైన ఫలితాలు





### -95శాతం ఉత్తీర్ణత, సౌమ్య శ్రీకి 556 మార్కులు

**ప్రజాపక్షం/ములకలపల్లి:**ములకలపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర కళాశాల(బాలికలు)లో ఎస్ఎస్‌సి 2026 ఫలితాల్లో విద్యార్థినులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. మొత్తం 77 మంది విద్యార్థినుల్లో 73 మంది ఉత్తీర్ణులై సుమారు 95శాతం ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. ఈ ఫలితాల్లో బింగి సౌమ్య శ్రీ 556/600 మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. అనంతరం జి చార్మినీ 527 మార్కులు, జి సౌజన్య 526 మార్కులు సాధించారు. అలాగే 500కు పైగా మార్కులు 11 మంది, 400 నుండి 500 మధ్య 57 మంది, 300కు పైగా 5 మంది విద్యార్థినులు సాధించారు. మండలంలో అత్యధిక ఉత్తీర్ణత శాతం, మెరుగైన మార్కులు సాధించినందుకు ప్రిన్సిపాల్ జి సునీత విద్యార్థినులు, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

# ప్రజల ముంగిటకే పాలన

### 3 నెలల్లో దరఖాస్తుల కొలిక్కి కార్యాచరణ
### పాలేరు ‘ప్రజాదర్బార్’లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజాపక్షం/కూసుమంచి:**ప్రజల సమస్యలను వారి గడప వద్దే పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి వెల్లడించిన కీలక అంశాలు ఇలా ఉన్నాయి. ప్రజల నుండి వచ్చిన న్యాయబద్ధమైన దరఖాస్తులన్నింటినీ మూడు నెలల్లోగా పరిష్కరించేందుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించామన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని 3 క్లస్టర్లుగా విభజించి, ప్రతి దరఖాస్తుపై జవాబుదారీతనంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం మనిషికి ఆధార్ లాగే, ప్రతి భూమికి భూదార్ నంబర్ ఇస్తున్నాం అని కూసుమంచి మండలంలో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్దిదారుల ఖాతాలో నేరుగా బిల్లులు జమ చేస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం మే 4న ఖమ్మంలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. 80కి పైగా కంపెనీలు ఇందులో పాల్గొంటాయి అని తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వరి, మొక్కజొన్న పంటను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామన్నారు. నిధులను రికార్డు సమయంలో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. భూ సేకరణ వంటి పెండింగ్ అంశాలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని యంత్రాంగాన్ని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# రైతు ముంగిట ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### పెనగడపలో ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని
### కొనుగోళ్లు, చెల్లింపులు పారదర్శకంగా ఉండాలని సూచన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** నియోజకవర్గానికి ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని, రైతులు కష్టాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. బుధవారం చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప గ్రామంలో నూతనంగా మంజూరైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టాలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కృషితో గతంల ఎన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో కేంద్రఆలను మంజూరు చేశామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఐకేపీ సిబ్బంది చూడాలని, తూకంగా విషయంలో పారదర్శకత పాటించాలని సూచించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బందుల పాలు చేయవద్దని, సరిపడా గిన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేయడం జరుగుతుందని, దళారుల మాయ మాటలు నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని చెప్పారు. కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని, విక్రయం అనంతరం రైతులకు ఖాతాల్లో నగదు జమలు సకాలంలో జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతు పక్షపాతిగా ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, ఎంపిడిఓ శుభాషిణి, తహశిల్దార్ నాగరాజు, సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ గోరె బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, నాయకులు నీడాల సుధాకర్, కుంచం కుమార్, కట్ట సత్యనారాయణ, మేఘనాధం, తాజుద్దీన్, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అన్నపురెడ్డిపల్లిలో కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన

### ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టోద్దు
### -ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:**అన్నపురెడ్డిపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని పలు గ్రామాలను సందర్శించిన ఆయన, ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తేమ శాతం కొలతలు, తూకం విధానం, చెల్లింపుల ప్రక్రియలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. రైతులు తమ పంటను సరైన ధరకు అమ్ముకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా పెంట్లం గ్రామంలో నిర్మిస్తున్నటువంటి ఇందిరమ్మ ఇండ్ల పనితీరును కూడా కలెక్టర్ సమీక్షించారు. లబ్దిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి పెంట్లమ్మ సర్పంచ్ కారం శివ పలు సమస్యలపై కలెక్టర్‌కు వివరించారు. ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని, లబ్దిదారులకు నాణ్యమైన గృహాలు అందేలా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పనుల్లో ఆలస్యం జరిగితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యటన సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన కలెక్టర్, వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో మహాలక్ష్మీ , వ్యవసాయ శాఖ అధికారి అనూష, హౌసింగ్ ఏఈ, పంచాయితీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీలో ఎన్ఎంఎంఎస్ పద్ధతిని రద్దు చేయాలి




### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ వలన ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులకు నష్టం జరుగుతుందని దీనిని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పగిడిపల్లి ఏసు లు డిమాండ్ చేశారు. బుధవారం చింతకాని మండలం రామకృష్ణాపురం, బస్వాపురం గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వారు పరిశీలించారు. ఎన్ఎంఎంఎస్ పద్ధతిలో రోజుకు రెండుసార్లు ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలని పైన సర్వర్ బాగుంటేనే ఫోటోలు అప్‌లోడ్ అవుతాయని, గ్రామాల్లో టెలిఫోన్ సిగ్నల్ సరిగ్గా లేకపోతే ఫోటోలు అప్‌లోడ్ కాకపోవడంతో ఉపాధి హామీ కూలీలు పనిలో చేరడం కుదరదు. రెండో సారి గ్రూప్‌గా ఫోటో తీసుకోవాలని సాంకేతిక కారణాల వల్ల రెండో సారి ఫోటో తీసుకోనందున ఆ కార్మికులు రెండో రోజున పనికి రావడం కుదరదు. మూడో రోజు తిరిగి పేరు నమోదు చేసుకుని పనిలో చేరాలి. ఏ రోజుకారోజు నమోదు కాకపోతే వేతనాలు జమ కావడం లేదని వారు తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ నిబంధనను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రోజు కూలీ డబ్బులు వారం వారం ఖాతాలో జమ చేయాలి కానీ సుమారు జనవరి నెల నుంచి జమ కావడం లేదన్నారు. వారి ఖాతాలో వేశామని కార్మికులకు చెబుతున్నారు కానీ ఖాతాలో జమ కావడం లేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని కూలీ డబ్బులు అందేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుత ధరల కనుగుణంగా రోజు కూలీ రూ. 700లు చెల్లించేలా షెడ్యూల్ రేట్లు మార్చాలని వారు కోరారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో అదనపు అలవెన్సులు తక్షణమే ఇవ్వాలన్నారు. వడగాల్పులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని వారు కోరారు.

## పది ఫలితాల్లో న్యూవిజన్ విజయకేతనం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి ఫలితాల్లో ఖమ్మం నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థిని పసుపులేటి హంసిని 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు న్యూవిజన్ విద్యా సంస్థల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో తమ పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 90 శాతానికి పైగా మార్కులు 290 మంది విద్యార్థులు సాధించారన్నారు. 550కు పైగా మార్కులు 230 మంది, 500లకు పైగా మార్కులు 460 మంది ఉన్నారని మిగిలిన విద్యార్థులంతా 430కు పైగా మార్కులు సాధించి ఏ పాఠశాల సాధించని ఘనత న్యూవిజన్ సాధించిందన్నారు. అన్ని సబ్జెక్టులలో నూటికి నూరు మార్కులు తమ పాఠశాల విద్యార్థులు సాధించడం హర్షణీయమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్లు సిహెచ్ కార్తీక్, డైరెక్టర్ సిహెచ్ గోపీచంద్, ప్రిన్సిపాల్ ఎండి అబాద్‌అలీ, జెవి మైఖేల్ తదితరులు అభినందించారు. ఇంతటి విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఇగ్నైట్ పాఠశాల విజయదుందుభి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఎస్‌సి ఫలితాల్లో ఖమ్మం నగరంలోని ఇగ్నైట్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి విజయదుందుబి మ్రోగించారని పాఠశాల డైరెక్టర్ పాటి మాధవరావు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు గుర్రం సర్వేష్ 600 మార్కులకు 582 మార్కులు, నారుగుల మనీష్ 571, చిట్టలూరి తేజస్ 562, అభిరామ్ నాయక్ ఇస్లావత్ 561, భూక్యా ప్రియ నిచిత 560, దారవత్ మోక్షిత్ 560, లికితశ్రీ బానోత్ 559, కేసగాని చరిత్ నాగ్ 558, కొనకాల సుహాస్ 554, చిట్టలూరి హద్విత 550 మార్కులు సాధించారన్నారు.తమ పాఠశాలలో క్రమశిక్షణకు, కఠిన సాధనకు ఉత్తమ ఫలితాలే నిదర్శనమని తెలిపారు.

# ‘టెన్త్’ ఫలితాల్లో త్రివేణి ప్రభంజనం




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:**విడుదలైన పదో తరగతి ఫలితాల్లో త్రివేణి విద్యా సంస్థల విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. లక్ష్మీశెట్టి నేహా 600ల మార్కులకు గానూ 595 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అదే విధంగా 32 మంది విద్యార్థులు 580కి పైగా మార్కులు సాధించారు. 570కి పైగా సాధించిన వారు 81 మంది ఉన్నారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులను విద్యార్థులు కైవసం చేసుకుని సత్తా చాటారు. కొత్తగూడెం త్రివేణి స్కూల్లో బైరెడ్డి అక్షయ శివాని 592 మార్కులు, పి అక్షయ్ 580, కే వర్షిత 586, టి కుందనిక 585 మార్కులను కైవసం చేసుకుని ఖ్యాతిని చాటాలు. 580కి పైగా ఐదుగురు, 570కి పైగా 17 మంది, 550పై 57 మంది, 500పైన 198 మంది మార్కులను సాధించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్ మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు ప్రతీ ఏటా రాష్ట్ర స్థాయి ర్యాంకులను కైవసం చేసుకుంటున్నారని, అనుభవం, అంకిత భావం గల బోధనా సిబ్బంది ఉండటం వల్ల ఈ సంచలన విజయాలు సాధించడం సాధ్యమైందన్నారు. విజయం సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రనాద్ చౌదరి, గొల్లపూడి జగదీష్, సిఐర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపల్ సూర్య నారాయణ మూర్తి, శ్రీనివాస్‌సింగ్, నేతాజీ తదితరులు అభినందించారు.

## ‘సర్వజ్ఞ’ విజయకేతనం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఎస్‌సి ఫలితాల్లో సర్వజ్ఞ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి ఉత్తమ మార్కులతో విజయకేతనం ఎగురవేసినట్లు పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమ తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో కె. హ్రిషికేశ్ 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించారని అదేవిధంగా సిహెచ్ వెంకటరంగ దీక్షిత 588, ఎల్. ఆర్షియాఖాన్ 584, సిహెచ్ సాయి హితేష్ కుమార్ 575, బి. యశస్విని 572, వాసిరెడ్డి కృష్ణ 557, ఎస్. హర్షిత 551, పి. వేదవర్షిత్ 547, ఎస్. అభిషేక్ రెడ్డి 545, పి. సనారెడ్డి 544, డి. హన్సిత 542 మార్కులు సాధించినట్లు తెలిపారు. నూరు శాతం ఉత్తీర్ణతతో పాటు పరిమిత సంఖ్యలో విద్యార్థులతో అత్యుత్తమ ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రభంజనం సృష్టించినట్లు ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్ర కుమార్ తెలిపారు. పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 60 శాతం మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమ లు అభినందించారు.

## 10 లోనూ బాలికలదే హవా

### ప్రభుత్వ బడుల్లో 90.58 శాతం ఫలితాలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:**బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లోనూ బాలికలే పై చేయి సాధించారు. మొత్తంగా 90.58 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పరీలకు 12703 మంది విద్యార్థుళు హాజరుకాగా, 11506 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 6192 మందికి గానూ 5502 మంది పాస్ కాగా 88.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 6511 మందికి గానూ 6004 మంది ఉత్తీర్ణత సాధించి 92.21శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. బాలుర కంటే బాలికలు 3.35 శాతం ఉత్తీర్ణ సాధించారు. 302 పాఠశాలల నుండి విద్యార్థులు పరీక్షలు రాయగా 62 పాఠశాలల వారు నూరు శాతం ఫలితాలు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఇఓ నాగలక్ష్మి అభినందిస్తూ ఆశీర్వదించారు. విద్యార్థులు రీ కౌటింగ్, రీ వెరిఫికేషన్ వచ్చే నెల 14లోపు దరఖాస్తులు చేసుకోవాలని. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 5వ తేది నుండి 12వ తేది వరకు జరుగుతాయని చెప్పారు.

## వేముల మృతి బాధాకరం: కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ:**సిపిఐ పట్టణ మాజీ కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు మృతి బాధాకరమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే సాంబశివరావు ఆయన మృతదేహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో కలిసి పూల మాలలు వేసి నివాళ్లర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేముల సిపిఐ పట్టణ కార్యదర్శిగా పనిచేస్తూ ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు చేశారని, ఆయన సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, ఆయన మృత దేహాన్ని సిపిఐ కార్యాలయం వద్ద కొద్ది సేపు సందర్శనార్థం ఉంచి అంతిమ యాత్ర నిర్వహించారు. ఆయన మృతదేహానికి కుమార్తె వేముల కౌముది తలకొరిమి పెట్టారు. ఈ అంతిమ యాత్రలో మేయర్ మూడ్ గణేష్, డా.రామ్మోహన్ రావు, సిపిఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, విశ్వేశ్వర రావు, సాయిబాబా, పూర్ణ చంద్రరావుతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ‘విన్‌ఫీల్డ్’ ప్రభంజనం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఎస్‌సి ఫలితాల్లో విన్‌ఫీల్డ్ హైస్కూల్ అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించిందని పాఠశాల యజమాన్యం గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో మన్నె అక్షిత్‌కుమార్ 600 మార్కులకు గానూ 589 రాష్ట్ర స్థాయి మార్కులు సాధించారన్నారు. బి. హర్షవర్ధన్ 584, బి. దేకేశ్వర్ 579, సయ్యద్ ఖుతిజా మిస్కిన్ 578, టి. యశస్విని 576, టి. జసిక 576, బి. అచ్యుత్ నాయక్ 575, టి. రేవంత్ 574, ఎల్. లిఖిత్ సాయి 574 మార్కులు సాధించారన్నారు.




## పది ఫలితాలలో న్యూకౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హై స్కూల్ విద్యార్థులు

**ప్రజాపక్షం/ఖిలావరంగల్ :** అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హైస్కూల్ విద్యార్థులు పదోతరగతి పరీక్ష ఫలితాలలో ప్రభంజనం సృష్టించారని పాఠశాల కరస్పాండెంట్ కోడం శ్రీధర్ అన్నారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందించారు. కోడం శ్రీధర్ మాట్లాడుతూ 29 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించి వంద శాతం ఫలితాలలో కరీమాబాద్ ప్రాంతంలో విజయకేతనం ఎగురవేశారని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సవిత మాట్లాడుతూ డి.రిషిత 577, ఎం.ప్రకీర్తి 576, కె.ప్రవర్ష 567, ఎం.వెన్నెల 566 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. నిరంతర కృషి పట్టుదల ద్వారా మాత్రమే ఇలాంటి విజయాలు పునరావృతం అవుతాయని అన్నారు. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనగామలో 97.66శాతం ఉత్తీర్ణత

### కస్తూరిబాలో 99 శాతం పాస్




**ప్రజాపక్షం/జనగామ :** పదవ తరగతి ఫలితాలు బుధవారం విడుదల కాగా జనగామ జిల్లాలో 97.66 శాతం మంది విద్యార్థిని, విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 6443 మంది పరీక్షలు వ్రాయగా 6292 మంది ఉత్తీర్ణులు కాగా 151 మంది పేయిల్ అయ్యారు. దీనితో 97.66 శాతం ఉత్తీర్ణ సాధించినట్లు అయ్యింది. అయితే కస్తూరిబా పాఠశాలల్లో మాత్రం 99 శాతం మంది విద్యార్థినీలు ఉత్తీర్ణులయ్యారు. కెజిబివి తరిగొప్పుల, రఘునాథపల్లి, లింగాలఘనపురం, జనగామ, చిల్పూర్,జఫర్‌గడ్, కొడకండ్ల, పాలకుర్తిలో వంద శాతం మంది విద్యార్థినీలు ఉత్తీర్ణత కాగా దేవరుప్పులలో 89 శాతం, స్టేషన్‌ఘనపూర్‌లో 98 శాతం, బచ్చన్నపేటలో 95 శాతం, నర్మెటలో 98 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కెజివిబిలలో 500లకు పైగా మార్కులు సాధించిన వారు 80 మంది ఉన్నారు. మండల స్థాయిలో పరిశీలిస్తే జఫర్‌గడ్‌లో వంద శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 369 మంది పరీక్షలు వ్రాయగా 369 మంది ఉత్తీర్ణులు అయ్యారు. జనగామలో అత్యధికంగా 56 మంది పేయిల్ అయ్యారు. గతేడాది జనగామ మూడో స్థానంలో నిలవగా ఈ ఏడాది మొదటి స్థానంలో నిలుస్తుందన్న ఆశలు ఉండేవి. కానీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు రాష్ట్రంఓనే మొదటి స్థానంలో నిలిచింది.

## సత్తా చాటిన శ్రీరామకృష్ణ విద్యాలయ విద్యార్థులు

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** టెన్త్ ఫలితాలలో శ్రీరామకృష్ణ విద్యాలయ విద్యార్థులు సత్తా చాటారు. మండల స్థాయిలో ప్రతమ స్థానం పోలోజు భావన 563, ద్వితీయ స్థానం సుహాన బేగం 557, గొడుగు అభినవ్ కిరణ్ 543, కటకం లక్ష్మి ప్రసన్న 539, తేలుకంటి నందిని 502 మార్కులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం కరికె ఊర్మిల, ప్రసాద్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. హెచ్‌ఎం నిమ్మ రాంరెడ్డి, పాఠశాల ఆచార్యుల బృందం, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

## 10వ తరగతి మండల టాపర్‌గా కెజిబివి స్కూల్ విద్యార్థిని శరణ్య

**ప్రజాపక్షం/వేలేరు :** 10వ తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన సంధర్భంగా వేలేరు మండలంలో పదవతరగతి ఉత్తీర్ణత 98 శాతం సాధించగా గొల్లకిష్టంపల్లిలోని కెజిబివి పాఠశాల విద్యార్థిని కె శరణ్య 572 మార్కులతో మండలటాపర్‌గా ఉత్తీర్ణత సాధించగా పిఎంశ్రీ గురకుల పాఠశాల విద్యార్థి దాసరి అక్షిత్‌రెడ్డి 571 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థాయిలో నిలువడంతో ఆయాపాఠశాలల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.ఈసంధర్భంగా మండల విద్యాశాఖ అధికారి మొగిళిచెర్ల చంద్రమౌళి మాట్లాడుతూ గతంలో మండలంలో పదవతరగతి విద్యార్థులు 93 శాతం ఉత్తీర్ణత సాధింగా ఈ 2025 2026 విద్యాసంవత్సరం 98 శాతం ఉత్తీర్ణ సాధించడం ప్రభుత్వ పాఠశాలలో విద్యానైపుణ్యం మెరుగు పడిందని అన్నారు.మండలంలోని విద్యార్థుల తల్లిదండ్రులు మీచిన్నారులను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరారు.



## రాష్ట్ర స్థాయిలో షైన్ విద్యార్థుల ప్రభంజనం

### షైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవతరగతి పరీక్షా ఫలితాలలో షైన్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని షైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ వెల్లడించారు. పదవతరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, వారి ఉన్నతికి శ్రమించిన అధ్యాపకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాలలో మొత్తం 600 మార్కులకు గాను ఏ. అక్షర 588 మార్కులు సాధించగా, యల్. రేవంత్, ఎండ్. అఫ్రోజ్ 586 మార్కులు, సమీరా నయీమ్ 585 మార్కులు, వెలుదండి సీమ, జి.సంహిత, కే. సుమిత్ 584 మార్కులు, టి. హాసిని, ఏ. ప్రశాంతి, ఏ. సుశాంత్, సీహెచ్.సిరి, 583 మార్కులు, వి.జాహ్నవి, మార్క శ్రీధన్ 582 మార్కులు, ఏ. హర్షిని 581, పి.యతిస్, పి.హర్షిత 580 మార్కులు సాధించినట్టు షైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ వెల్లడించారు.500 పైన మార్కులు 362 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. 302 విద్యార్థులు 85 శాతాలకు పైగా విద్యార్థులు మాథ్స్ లో సాధించడం గర్వకారణం అని చెప్పుకొచ్చారు. ఐఐటీ ఫౌండేషన్, నీట్ తో పాటు పదవ తరగతి పరీక్షలకు ప్రత్యేక శిక్షణా ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాలలో కూడా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని అధిరోహించారని గర్వంగా చెప్పారు.ఈ సందర్భంగా విద్యార్థుల అభినందన కార్యక్రమానికి విచ్చేసిన షైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్, కరెస్పాండెంట్ మూగల రమ, షైన్ పబ్లిక్ స్కూల్, ఎర్రగట్టుగుట్ట బ్రాంచ్ సెక్రటరీ జక్కుల శ్రీనివాస్ యాదవ్, ఐఐటీ కోఆర్డినేటర్ మూగల రమేష్ యాదవ్, ప్రిన్సిపల్స్ పి.విశాల్, కే.దినేష్, రాజకుమార్, కవిత, ప్రగతిరెడ్డి, సబితా, మానస, కాలేజీ ప్రిన్సిపల్స్ రాజుగౌడ్, పి. శ్రీనివాస్ ఉపాధ్యాయబృందం, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరాపై

# అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడంతో పాటు, వేసవికాలంలో తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పురోగతిపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని దూర ప్రాంతాల మిల్లులకు కాకుండా ములుకనూరు, ఎల్కతుర్తి పరిధిలోని సమీప మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా ఎక్కడా అంతరాయం కలగకుండా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. తెలంగాణ మోడల్ స్కూల్ వద్ద మురుగునీరు నిల్వ ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో మరింత వేగం తీసుకురావాలని, లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సహకరించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. గృహ ప్రవేశాలు త్వరితగతిన నిర్వహించేలా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్‌ను ఆదేశించారు.మండలంలోని రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలకు పెయింటింగ్ పనులు చేపట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ఉద్యాన శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయంలో సర్పంచ్‌లు కూడా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్‌డీవో మేన్ శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా ఉద్యాన అధికారి అనసూయ, డీఈవో గిరిరాజ్ గౌడ్, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, ఎంపిడిఒ వీరేశం, తహసీల్దార్ రాజేష్, ఇతర అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## మరోసారి మెరిసిన 'ఏకశిల' విద్యార్థుల ప్రతిభ

### "పది" ఫలితాలలో విజేత... ప్రతి విజయంలో ఏకశిల




**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో ఏకశిలా విద్యాసంస్థలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఈ సంవత్సరం కూడా సీబీఎస్ఈ, స్టేట్ బోర్డ్ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి మరో విజయకేతనం నమోదు చేసింది ఏకశిల విద్యా సంస్థలు 585, 582, 580, 578, 577, 576, 574, 573,572,571,570 మార్కులు సాధించి ఏకశిల విద్యార్థిని విద్యార్థులను తమ ప్రతిభ, కృషి, పట్టుదలను నిరూపించారు.ఈ సందర్భంగా ఏకశిల టెక్నో స్కూల్ పెంబర్తిలో నందు జరిగిన అభినందన కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఏకశిల విద్యసంస్థలలో విద్య అంటే మార్కులు మాత్రమే కాదు... భవిష్యత్తును నిర్మించే శక్తి అని, ఏకశిలలో ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉందని తాము నమ్ముతున్నామని, ఆ ప్రతిభను వెలికి తీసి విజయంగా మలచడం మా లక్ష్యం అని, నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, జీవిత నైపుణ్యాలను పెంపొందిస్తున్నామన్నారు.

తాము విద్యార్థులను కేవలం పరీక్షల కోసమే కాదని, భవిష్యత్ జీవితానికి కూడా సిద్ధం చేస్తున్నామని తెలియజేసారు. ఈ విజయంతో మా సంస్థకు, గుర్తింపు మరింత పెరిగింది అని ఈ సందర్భంగా మా మీద విశ్వాసం ఉంచిన తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలని తెలియజేసారు.మీ పిల్లల భవిష్యత్తుకు ఉత్తమ విద్యను అందించాలనుకునే తల్లిదండ్రులు మా విజయ యాత్రలో భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నామని తెలియచేస్తూ, చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్స్ బేతి కొండల్ రెడ్డి, గౌరు సువిజా రెడ్డి , ప్రిన్సిపాల్స్ బేతి శైలజ రెడ్డి, ముచ్చ స్వప్న రెడ్డి, సిహెచ్ దినేష్ రెడ్డి, ఎండి. బాబా, కే డి స్వర్ణ రాజ్, లవ కుమార్, కే బిక్షపతి, అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జి జి రామ్ ప్రసాద్,ఉపాధ్యాయని ఉపాధ్యాయులు , విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## పదిలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులదే హవా

**ప్రజాపక్షం/నల్లబెల్లి :** పది పరీక్షలో ప్రయివేట్ విద్యార్థులదే హవా కొనసాగడంతో పాఠశాల యాజమాన్యం సంతోషాన్ని వ్యక్తం చేశారు . వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో కాకతీయ బ్రిలియంట్ గురుకుల పాఠశాల ,కారుణ్యజ్యోతి హైస్కూల్‌లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం విశేషం .

బుధవారం రాష్ట్ర ప్రభుత్వం పది పరీక్ష ఫలితాలు వెల్లడించడంతో నల్లబెల్లి మండలంలో 376 మంది పరీక్షలో పాల్గోని 353 మంది విద్యార్థులు ఉత్తీర్ణతలైనారు. రుద్రగూడెం గ్రామం పరిధిలోని కాకతీయ బ్రిలింట్ గురుకుల విద్యార్థులు 112 మంది పరీక్షలో పాల్గొనగా నలుగురు విద్యార్థులు మొదటి స్థానం ఉండగా 550 మార్కులపై 9 మంది 500 పైన 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగ 500 లోపు 52 మంది ఉత్తీర్ణులై వంద శాతం విధార్థులు ఉత్తీర్ణులైనారు.

మండల మొదటి స్థానం చరన్‌సాత్విక్ 576 మార్కులు సాధించారు కారుణ్యజ్యోతి హైస్కూల్ విద్యార్థులు 45 మంది పరీక్షలో పాల్గోనగా 15 మంది విద్యార్థులు 500 పై మార్కులు సాధించగా మండల ద్వితీయ స్థానం పొగుల చందిన 571 మార్కులు సాధించినారు. ప్రభుత్వ పాఠశాల విధార్థులు 219 మంది పరీక్షలో పాల్గోనగా 196 మంది మాత్రమే ఉత్తీర్ణత సాదించారు.

నారక్కపేట జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థిని కె.మనస్వీని 559 మార్కులు సాధించి మండలంలో తృతీయ స్థానం కైవసం చేసుకుంది . ప్రభుత్వ పాఠశాలలో 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణతలైనారు . నల్లబెల్లి మండలంలో 94 శాతం విద్యార్థులు పది పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి అనురాధ తెలిపారు .




## నారాయణలో వంద శాతం ఉత్తీర్ణత

**ప్రజాపక్షం/జనగామ :** 10వ తరగతి ఫలితాల్లో జనగామలోని నారాయణ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బుధవారం 10వ తరగతి ఫలితాలు విడుదల కాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించిజిల్లాలో నాల్గొవ స్థానంలో నిలిచి నాన్యత, భోదనకు మారుపేరుగా నిలిచారు. 41 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా చాట్ల సంజన 580 మార్కులతో మొదటి స్థానం, చింతకింది శ్రీరామ్ అనే విద్యార్థికి 578 మార్కులు సాధించి ద్వితీయ ఎనగందుల నేహా 577 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. 41 మందిలో ఐదుగురికి 570కి పైగా మార్కులు, 13 మందికి 550 మార్కులు 27 మంది 500 మార్కులు వచ్చాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులను ప్రిన్సిపాల్ ఫర్హానా, హై స్కూల్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, అకడమిక్ డీన్ విక్రమ్, ఏఓ బిఇఎన్ చారి అభినందనలు తెలిపారు.




## పది ఫలితాలలో "ఆర్యభట్ట" ప్రభంజనం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో హన్మకొండలోని ఆర్యభట్ట విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పాఠశాల నుంచి అర్జున్ రెడ్డి కి 570 మార్కులతో పాటు నిత్య నాయక్ 568,సాత్విక 551 మార్కులు సాధించారు. దీనితో పాటు పాఠశాలలో చదివిన విద్యార్థులలో 50 శాతం విద్యార్థులకు మాథెమాటిక్స్ లో 10 జిపిఎ సాధించారు. సైన్సులో 40 శాతం విద్యార్థులు 10 జిపిఎ సాధించడం జరిగినది.వీరందరినీ ఆర్యభట్ట స్కూల్ కరస్పాండెంట్ నరేష్ చంద్ర భారత, ప్రిన్సిపాల్ భారత వీణ, ఉపాధ్యాయులు వేణుగోపాల్, విజయ్, వెంకట్, సౌజన్య అభినందించారు.

## ఎస్సెస్సీ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల100 శాతం ఉత్తీర్ణత

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిర్మాజీపేట (ఆటోనగర్) విద్యార్థులు 2026 సంవత్సరానికి సంబంధించిన ఎస్సెస్సీ వార్షిక ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్యనాయుడు, కార్పొరేటర్లు ఆడెపు స్వప్న,బస్వరాజు కుమార్, స్థానిక నాయకులు ఎలుగం సత్యనారాయణ, చిప్ప వెంకటేశ్వర్లు, ఎపిపిసి చైర్పర్సన్ డి. ధనలక్ష్మి , విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.భూపాల్ మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సి పరీక్షలకు మొత్తం 55 మంది విద్యార్థులు హాజరై, అందరూ ఉత్తీర్ణులు కావడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు.



పాఠశాలలో అత్యధికంగా 562 మార్కులతో జె. కీర్తన ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. అదే విధంగా 500కు పైగా మార్కులు సాధించిన 6 మంది, 450 నుండి 500 మధ్య మార్కులు సాధించిన 26 మంది, 400 నుండి 450 మధ్య మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు.పాఠశాల ఉపాధ్యాయులు పి. బుచ్చిరెడ్డి, డా. ఏ.సదయ్య, ఎం.డి. అఫ్సర్, టి. భాస్కర్, జె. రాజు, ఎస్.రమాదేవి, శకుంతల దేవి, అరుణ్, తబస్సుమ్ తదితరులు విద్యార్థుల విజయంపై ఆనందం వ్యక్తం చేశారు.ఈ విజయానికి విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శనం అని, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని పాఠశాల ఏపిపిసి చైర్పర్సన్ డిధనలక్ష్మి తెలిపారు

## ఎస్ఆర్ విద్యార్థుల విజయభేరి




**ప్రజాపక్షం/హనుమకొండ :** బుధవారం విడుదల చేసిన పదవతరగతి పరీక్ష ఫలితాలలో ఈసారి కూడా జిల్లాలో, రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తూ ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఈ సంవత్సరం మరోమారు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు.ఇంతటి విజయానికి కారణం క్రమశిక్షణతో కూడిన విద్యా పటిష్టమైన పాఠ్య ప్రణాళిక, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయ బృందమేనని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదా రెడ్డి తెలిపారు. ఈ ఫలితాలలో సి.సంస్కృతా రెడ్డి 589/600, ఫిరాన్జీ వంశీ 588/600, ఎస్.కీర్తన 587/600, అంకం సౌజన్య 587/600, ఏ. సంజయ్ 586/600, టి. వైష్ణవి 585/600, బాసెట్టి సాయి శ్రీ 584/600 మార్కులు సాధించారని తెలిపారు.

ఇప్పటివరకు 580కి పైగా మార్కులు 22 పైగా విద్యార్థులు సాధించి రాష్ట్రంలో ఎస్ఆర్ విజయపథాన్ని ఎగురవేసారని తెలిపారు.ప్రస్తుత పరిస్థితులలో విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరణ పరుస్తూ ఒత్తిడి లేని వాతావరణంలో, క్రమశిక్షణ సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తున్నామని ఆయన తెలిపారు. తమ విద్యా సంస్థలలో పోటీ పరీక్షలను ఎదుర్కొనేవిధంగా ఎస్సెస్సీ విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ లలో ఎక్కువ శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులను అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేయడానికి గాను ఒక బృహత్తరమైన పద్ధతిలో ప్రైమ్ స్కూల్స్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. ఈ అఖండ విజయాన్ని సాధించి విద్యార్థులను ప్రోత్సహించిన వారి తల్లితండ్రులను, ఆధ్యాపక బృందానికి ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధూకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి అభినందనలు, శుభాకాంక్షలను తెలియజేశారు.



## మార్మోగిన 'మాస్టర్ జీ'

### విద్యార్థులను అభినందించిన మాస్టర్ జీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత సుందర్ రాజ్ యాదవ్

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** పదోవతరగతి ఫలితాల్లో మాస్టర్ జీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి, అత్యుత్తమ మార్కులతో మాస్టర్ జీ కీర్తిని దశదిశలా చాటారు.పాఠశాల విద్యార్థులు సాధించిన ర్యాంకుల పట్ల మేనేజ్మెంట్ తో పాటు అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.కుంభ శ్రేష్టి నిధి 580 మార్కులు ,సయ్యద్ బుష్రా లోరీన్ 579, దీక్షా గంగోత్రి 575,ఉమ్మె హబీబా 574,చిలగాని లాస్య 573,ఉప్పు గీతిక 572,సోమ హన్సిక 567,జీ. శ్రీశాంత్ రెడ్డి 567 ,శ్రీలయ 566 మార్కులు సాధించారు.పరీక్షలకు హాజరైన 146 మంది విద్యార్థులలో, ఏకంగా 29 మందికి 550 పైగా మార్కులు,87 మంది విద్యార్థులు 500 పైచిలుకు మార్కులు సాధించి రికార్డు సృష్టించారు.అంకితభావంతో చదివిన విద్యార్థులు, వారికి దిశానిర్దేశం చేసిన ఉపాధ్యాయుల కృషితో అత్యుత్తమ మార్కుల సాధించామని మాస్టర్ జీ విద్యాసంస్థల చైర్మన్, కాకతీయ కార్బన్ డెవలప్మెంట్ అథారిటీ మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ అన్నారు.టెన్త్ ఫలితాలో రాణించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులు సాధించిన ఈ విజయం మా పాఠశాల నాణ్యమైన విద్యాబోధనకు నిదర్శనం. అన్నారు.కష్టపడి చదివి టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు, వారికి వెన్నుదన్నుగా నిలిచిన తల్లిదండ్రులకు, నిరంతరం శ్రమించిన ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు అన్నారు.రాబోయే రోజుల్లో కూడా ఇదే విధమైన నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తామని మాస్టర్ జీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## సత్తా చాటిన మండల విద్యార్థులు



**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు) :** పదవ తరగతి ఫలితాలు బుధవారం వెలువడగా ఈ ఫలితాల్లో మండలానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మండలంలో టాపర్‌గా వై చరణ్య లక్ష్మి 553(జడ్పీఎస్ఎస్ వెంకటాపురం), జి యువరాజ్ 553( భారతి స్కూల్), రెండవ స్థానంలో పి నిహారిక 552(జడ్పీఎస్ఎస్ వెంకటాపురం), మూడవ స్థానంలో బి ప్రసన్న 548 మార్కులు సాధించారు. జడ్పీహెచ్ఎస్ వెంకటాపురం పాఠశాల నుండి తెలుగు మీడియం నుండి 58/58 మంది, ఇంగ్లీష్ మీడియం నుండి 78/78 మంది వంద శాతం ఫలితాలు సాధించారు. అదేవిధంగా జడ్పీఎస్ఎస్ ఆలుబాక పాఠశాల నుండి 36/36 మంది 100 శాతం ఏహెచ్ఎస్ లక్ష్మీనగరం 45/45 మంది, ఏహెచ్ఎస్ చిరుతపల్లి 1 నుండి 43/43, చిరుతపల్లి 2 పాఠశాల నుండి 20/20 మంది 100 శాతం కెజిబివి పాఠశాల నుండి 27/27 మంది 100 శాతం భారతి స్కూల్ నుండి 19/19 ఉత్తీర్ణన సాధించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి జివివి సత్యనారాయణ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన వెంకటాపూర్ పాఠశాల విద్యార్థులు



**ప్రజాపక్షం/ములుగు:** పదవ తరగతి ఫలితా లు బుధవారం వెలువడగా ఈ ఫలితాలలో వెంకటాపూర్ మండలంలోని అన్ని పాఠశా లలో యాజమాన్యంలో వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన జరుపుల అంజలి 560 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచింది. రెండవ స్థానంలో మెట్టు జయశ్రీ 556, రాయవేన శ్రీజ 553 మూడవ స్థానంలో నిలిచింది. 40 మంది విద్యార్థులలో 15మందికి పైగా 500మార్కుల పైచిలుకు ఫలితాలు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులకు, డిఎన్ఆర్ ట్రస్టు, ఆర్‌డిటి ట్రస్టు మీడియా మిత్రులకు మండల విద్యాశాఖాధికారి ఎంపిడిలో, ఎంఆర్ఓలకు వెంకటాపూర్ గ్రామ ప్రజలు, అన్ని డిపార్ట్‌మెంట్‌లకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు టి రాధిక, సీనియర్ ఉపాధ్యాయులు జనగాం బాబురావు, కృతజ్ఞతలు తెలిపారు.

సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

## రీల్

## 'రాక్షసపురం' విడుదల తేదీలో మార్పు



ప్రముఖ నిర్మాణ సంస్థ క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత, సీనియర్ నిర్మాత కేఎస్ రామారావు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాక్షసపురం'. కన్నడలో సంచలన విజయం సాధించిన 'రాక్షసపుర' చిత్రానికి ఇది తెలుగు అనువాదం. ఈ చిత్రాన్ని మే 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాత కేఎస్ రామారావు అధికారికంగా ప్రకటించారు.విడుదల తేదీ మార్పుపై నిర్మాత కేఎస్ రామారావు స్పందిస్తూ ఈ సినిమాలోని మేకింగ్ విలువలు, సస్పెన్స్ ఎలిమెంట్స్ నన్ను బాగా ఆకట్టుకున్నాయి. అందుకే ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించాలని నిర్ణయించుకున్నాం. సినిమాను మే 1న విడుదల చేయాలని ముందుగా అనుకున్నప్పటికీ, మరిన్ని మెరుగైన థియేటర్లు, గరిష్ట స్థాయిలో ప్రేక్షకులకు చేరువయ్యేలా చేసేందుకు వీలుగా మే 7న విడుదల చేస్తున్నాం. వేసవి సెలవుల దృష్ట్యా ఈ తేదీ సినిమాకు కలిసి వస్తుందని భావిస్తున్నాం.' అని ఆయన తెలిపారు.షోల వివరాలు: మే 7న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నామని, మార్నింగ్ మరియు మ్యాట్నీ షోలకు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు డిస్ట్రిబ్యూటర్లు పేర్కొన్నారు.

## 'అలెల్లె అలెల్లె' పాడుకుంటున్న 'సూపర్‌స్టార్' మనవడు



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' ప్రాజెక్ట్‌తో హీరోగా పరిచయం అవుతున్నారు. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. అశ్విని దత్ సమర్పణలో, చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్లు, టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. నేచురల్ స్టార్ నాని ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ 'అలెల్లె అలెల్లె'ను లాంచ్ చేశారు. కొన్ని పాటలు కేవలం బ్యాక్ గ్రౌండ్‌లో వినిపిస్తాయి& కొన్ని పాటలు కథ నుంచి వస్తాయి. 'అలెల్లె అలెల్లె' అలాంటి ప్రత్యేకమైన పాట. జివి ప్రకాష్ కుమార్ అద్భుతంగా కంపోజ్ చేసిన ఈ సాంగ్ వినగానే ఆకట్టుకుంటుంది. మొదట మెలోడియస్‌గా మొదలై, తర్వాత ఉత్సాహభరితమైన ట్రాక్‌గా అలరిస్తుంది. ప్రతి నోట్ మనసుని తాకుతోంది. శ్రీమణి రాసిన సాహిత్యం ప్రేమలో ఉండే ఆ మధురమైన ఎమోషన్ ని అద్భుతంగా వ్యక్తపరుస్తుంది.జయ కృష్ణ, రషా జోడి ఈ పాటకు ప్రాణం పోసారు. వాకెమిస్ట్రీ ఎంతో సహజంగా వుంది. అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరించిన విజువల్స్ ఈ పాటను ఒక మధురమైన జ్ఞాపకంలా మార్చాయి. 'శ్రీనివాస మంగాపురం' చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. ఎడిటింగ్ మాధవ్ కుమార్ గుల్లపాటి. ప్రొడక్షన్ డిజైనర్ సాహి సురేష్. యాక్షన్ సన్నివేశాలను రియల్ సతీష్ రూపొందిస్తున్నారు. షూటింగ్ తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది.

## 'అమ్మోరు దిగినాది' జాతర పాట విడుదల




భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్న చిత్రం 'అనకాపల్లి'. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. కంద్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కిన ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేయగా అది అందరిలోనూ బజ్‌ను క్రియేట్ చేసింది. తాజాగా 'అనకాపల్లి' నుంచి జాతర సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటలో సంగీత స్టెప్పులు, గ్రాండియర్‌గా పాటను తెరకెక్కించిన తీరు, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ, మంగ్లీ గాత్రం ఇలా అన్నీ హైలెట్‌గా నిలుస్తున్నాయి. నిజంగానే ఓ జాతర చూస్తున్నామా? అన్న రేంజ్‌లో విజువల్స్ కనిపిస్తున్నాయి. ఇక ఈ పాటకు గణేష్ సలాది లిరిక్స్, దేవజ్‌ండ బాణీ మరింత స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. త్వరలోనే ఈ మూవీని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి మాయా.వి కెమెరామెన్‌గా, శ్రీకృష్ణ అట్లూరి ఎడిటర్‌గా పని చేశారు. త్రినాథరావు నక్కిన కథ, స్క్రీన్ ప్లే అందించిన ఈ చిత్రానికి ఉదయ్ భాగవతులు డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప, త్రినాథరావు నక్కిన, ఇంద్రజ అబ్బర్, మహబూబ్ బాషా, శ్రీనివాస్ వడ్లమాని, కాంద్రేగుల నాయుడు, నందిని రాయ్, సంగీత క్రిష్ నటించారు.

## గ్రాండ్‌గా 'గాయపడ్డ సింహం' ప్రీ రిలీజ్



తరుణ్ భాస్కర్ హీరోగా, ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా కశ్యాప్ శ్రీనివాస్ దర్శకత్వంలో పవన్ సాధినేని సమర్పిస్తున్న చిత్రం గాయపడ్డ సింహం. జే డి చక్రవర్తి, శ్రీ విష్ణు కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హీరో శ్రీ విష్ణు కథ విని ఫ్రెండ్షిప్‌తో ముందుకు వచ్చి చేశారు. సినిమాలో మంచి ఫ్రెండ్షిప్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ వేడుకకు రోహిత్ గారు రావడం ఆనందంగా ఉంది. కశ్యప్‌కు తనకంటూ ప్రత్యేకమైన మార్క్ ఉంది అని అన్నారు. కోప్రొడ్యూసర్ దివ్య మాట్లాడుతూ.. ఈ సినిమా కాన్సెప్ట్ మాకు చాలా నచ్చింది. రెండు గంటల పాటు మీ జీవితంలో ఉన్న ఒత్తిడిని మర్చిపోయి ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు. మే 1న ఈ సినిమా విడుదల అవుతోంది. తప్పకుండా థియేటర్‌లలో చూడండి. ప్రొడ్యూసర్ పవన్ సాదినేని మాట్లాడుతూ ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. కశ్యప్ చెప్పిన ఐడియా నాకు చాలా నచ్చింది. ఆయనపై నమ్మకంతో ముందుకు తీసుకెళ్లాం. కశ్యప్ డ్రీమ్‌ను నిజం చేయడానికి మేము నలుగురు ఫ్రెండ్స్ కలిసి వచ్చాం. ఇందులో ఒక ముఖ్యమైన పాత్ర కోసం శ్రీ విష్ణుని అడిగితే, ఆయన ఫ్రెండ్షిప్‌తో చేశారు. జేడీ చక్రవర్తితో కూడా మంచి అనుబంధం ఉంది. నటుడు జేడి చక్రవర్తి మాట్లాడుతూ ఈ సినిమా విడుదల ఆపడానికి చాలా పెద్ద స్థాయి నుంచి పైరవీలు జరిగాయని చెప్పారు. ఒకానొకదశలో సినిమా ఆగిపోతుందని అనుకున్నాము. అమెరికాకు, భారత్ యుద్ధం వస్తుందని ప్రచారం జరిగింది ఏదేమైనా ఈ సినిమా ఖచ్చితంగా సక్సెస్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు స్వీకర్, హీరోయిన్లు, నిర్మాతలు పాల్గొన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ ఈ సినిమా చూస్తున్నంతసేపు నవ్వుతూనే ఉంటారని అన్నారు.

## 'ఫస్ట్ టైం' ట్రైలర్ లాంచ్ చేసిన పాయల్ రాజ్ పుత్



హేమంత్ ఇప్పలపల్లి కథ రాసుకుని తానే దర్శక నిర్మాతగా వ్యవహరిస్తూ తక్కువ బడ్జెట్‌తో నిర్మిస్తున్న సినిమా అయినా భారతదేశంలోనే అతిపెద్ద ప్రతిష్టాత్మక వి ఎఫ్ ఎక్స్ సినిమాగా నిర్మించబడుతున్న 'ఫస్ట్ టైం' సినిమాకి సంబంధించిన ట్రైలర్‌ను నటి అందాల తార పాయల్ రాజ్ పుత్ చేతుల మీదగా లాంచ్ ఘనంగా జరిగింది. ఈ సినిమాలో సౌరబ్ ధింగ్ర హీరోగా పరిచయం అవుతుండగా 'బిగ్ బాస్' ఫేమ్ అఖిల్ సార్థక్ సెకండ లీడ్‌గా అనిక్క విక్రమన్ హీరోయిన్ గా ఇతర ముఖ్య పాత్రల్లో మైమ్ గోపి, శివ, భూపాల్ రాజు, గాయత్రి గుప్త, అన్నపూర్ణమ్మ, అజయ్ రత్నం, ధీ పందు నటిస్తున్నారు. శ్రీ వెంకట్ మరియు సూరజ్ ఎస్ కురుప్ సంగీతాన్ని అందించగా వేణు మురళీధర్ మరియు రామ్ సినిమాటోగ్రాఫర్లుగా పనిచేశారు.హేమంత్ ఇప్పలపల్లి. ఏఐని ఎక్కడ ఇన్వాల్వ్ చేయకుండా హై రేంజ్ గ్రాఫిక్స్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈవెంట్ కి అతిథులుగా సీనియర్ నిర్మాత దర్శకుడు బెల్లం రామకృష్ణ రెడ్డి , బిజెపి అధికార ప్రతినిధి ప్రభ గౌడ్ హీరో అభినవ్ శౌర్య ముఖ్యఅతిథిగా అందాల తార పాయల్ రాజ్ పుత్ విచ్చేశారు. ఆయనతో కలిసి పని చేయడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ముఖ్య అతిథి నటి పాయల్ రాజ్ పుత్' మాట్లాడుతూ కొన్ని తమిళ , పంజాబీ చిత్రాల వల్ల నేను హైదరాబాద్ కు రాలేకపోతున్నాను. ఫస్ట్ టైం చిత్ర ట్రైలర్ చూస్తుంటే చాలా అద్భుతంగా అనిపించింది. చిత్ర దర్శక నిర్మాత హేమంత్ కి ఆల్ ద బెస్ట్. ప్రస్తుతం సినిమా చాలా మారిపోయింది. గత రోజులతో పోలిస్తే ఇప్పుడు కథలు చాలా కొత్తగా ఉన్నాయి. తెలుగు ప్రేక్షకులు కచ్చితంగా షౌరబ్ ను ఆదరిస్తారని అనుకుంటున్నాను. మే 22న ఈ చిత్ర విడుదల కోసం నేను ఎదురు చూస్తున్నాను అన్నారు.సౌరబ్ ధింగ్ర హీరోగా, అఖిల్ సార్థక్ సెకండ లీడ గా అనిక్క విక్రమన్ హీరోయిన్ నటిస్తుండగా ఇతర ముఖ్య పాత్రల్లో మైమ్ గోపి, శివ, ౖభూపాల్ రాజు, గాయత్రి గుప్త, అన్నపూర్ణమ్మ, అజయ్ రత్నం, ధీ పందు నటిస్తున్నారు. రచయిత ఎడిటర్ విఎఫ్ఎక్స్ లీడ నిర్మాత, దర్శకుడు : హేమంత్ ఇప్పలపల్లి సంగీతం : శ్రీ వెంకట్ మరియు సూరజ్ ఎస్ కురుప్, సినిమాటోగ్రఫీ : వేణు మురళీధర్ మరియు రామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : పి. రాజశేఖర్.

## ఉన్న చట్టాలు చాలు

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం 'ద్వేషపూరిత ప్రసంగాల రంగం శాసనపరంగా ఖాళీగా ఉందనే వాదన అపోహతో కూడుకున్నది' అని తన తీర్పులో తెలిపింది. మారుతున్న సామాజిక సవాళ్ల దృష్ట్యా తదుపరి శాసనపరమైన లేదా విధానపరమైన చర్యలు అవసరమా? లేదా? అనే విషయమై 2017మార్చి నాటి లా కమిషన్ 267వ నివేదిక సూచించిన విధంగా తగిన సవరణలను తీసుకురావాలా అనే విషయాలనే కేంద్రం, సంబంధిత శాసన అధికార సంస్థలు తమ విజ్ఞతతో పరిశీలించేందుకు అధికారం ఉంటుందని ధర్మాసనం వివరించింది. 'నేరాలను సృష్టించడం, శిక్షలను నిర్దేశించడం అనేవి పూర్తిగా శాసననిర్మాణ పరిధిలోకి వస్తాయి' అని సుప్రీంకోర్టు పేర్కొంది. అధికారాల విభజన సిద్ధాంతంపై ఆధారపడిన రాజ్యాంగ పథకం న్యాయపరమైన ఆదేశాల ద్వారా కొత్త నేరాలను సృష్టించడానికి లేదా నేర బాధ్యత పరిధిని విస్తరించడానికి న్యాయవ్యవస్థను అనుమతించదని అది పేర్కొంది. రాజ్యాంగ న్యాయస్థానాలు చట్టాన్ని వ్యాఖ్యానించి ప్రాథమిక హక్కుల అమలును నిర్ధారించడానికి ఆదేశాలను జరీచేయగలవు కానీ, అవి చట్టాలను రూపొందించలేవని, లేదా బలవంతం చేయలేవని ఈ కోర్టు పూర్వ తీర్పులు ధృవీకరిస్తున్నాయని ధర్మా సనం తెలియజేసింది. పూర్వపు భారత శిక్షా స్మృతిలోని 4 నిబంధనలతో సహా, ప్రస్తుతం ఉన్న మౌలిక క్రిమినల్ చట్టం యొక్క చట్రం, అనుబంధ శాసనాలు, శతృత్వాన్ని ప్రోత్సహించే, మతపరమైన మనోభావాలను దెబ్బతీసే, లేదా ప్రజాశాంతికి భంగం కలిగించే చర్యలను తగిన విధంగా పరిష్కరిస్తాయని, 'అందువల్ల ఆ మైదానం ఖాళీగా లేదు' అని ధర్మాసనం పేర్కొంది. విచారణ అర్హమైన నేరం వెలుగులోకి వచ్చినప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం పోలీసుల విధి అని, ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదు చేయని పక్షంలో సిఆర్‌పిసి లేదా బిఎన్‌ఎస్ఎస్ సమర్థవంతమైన పరిష్కారాన్నిఅందిస్తాయని బెంచ్ తెలిపింది. వివరణాత్మక తీర్పు రావాల్సి ఉంది. కాగా, జనవరి 20న పిటిషన్లపై తన తీర్పును అత్యున్నత న్యాయస్థానం రిజర్వ్ చేసింది.

## 91.66% పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఇవిఎంలో నిక్షిప్తం చేశారు. ఇందుకోసం 41వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఇసి ఏర్పాటు చేసింది. పలుచోట్ల ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. భవానీపుర్ నియోజవర్గంలో సిఎం మమతా బెనర్జీ ఓటు హక్కు వినియోగించున్నారు. టిఎంసి ఎంపిలు మహువా మెయిత్రా, అభిషేక్ బెనర్జీ, బిజెపి నేత, నటుడు మిథున్ చక్రవర్తి, మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ సహా పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండో దశలో పోటీ పడుతున్న కీలక అభ్యర్థుల్లో సిఎం దీదీ, ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఉన్నారు. భవానీపూర్ నియోజకవర్గంలో మమతపై సువేందు అధికారిని బిజెపి పోటీకి నిలిపింది. భాత్ పాడా, రాణాఘాట్, కోల్‌కతా ఉత్తర్, కోల్‌కతా దక్షిణ్, రాశ్ బెహారీ, జాధవ్ పుర్, బాలీగంజ్‌లు రెండో దశలో కీలకంగా ఉన్నాయి.

బంగాల్‌లో తుదిదశ పోలింగ్ సందర్భంగా పలు చోట్ల ఘర్షణలు చెలరేగాయి. అనేకచోట్ల హింస, ఆస్తుల ధ్వంసం వంటి ఘటనలు జరిగాయి. చాప్ర, శాంతిపూర్, నిమ్తలా, భాంగర్ తదితర ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరిగినట్లు పోలీసులు ధ్రువీకరించారు. చాప్రాలో ఉన్న బూత్ నంబర్ 53లో బిజెపి ఏజెంట్ మోషారెఫ్ మీర్‌పై దాడి జరిగింది. వెంటనే అతడిని సమీప ఆస్పత్రికి తరలించారు. అధికార టిఎంసికి చెందిన దుండగులు తమ పోలింగ్ ఏజెంట్‌పై దాడి చేశారని బిజెపి నేతలు ఆరోపించారు. ఈ ఆరోపణలను టిఎంసి ఖండించింది. అటు హావ్‌డా జిల్లా బల్లి ప్రాంతంలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. దీని వల్ల అక్కడున్న వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి అది కాస్తా ఘర్షణకు దారితీసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. ఘర్షణను అదుపు చేసి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నాయి. ఓటింగ్ సందర్భంగా హుగ్లీ జిల్లాలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. నకిలీ పోలింగ్ ఏజెంట్లను నియమించారన్న ఆరోపణలతో టిఎంసి, ఐఎస్ఎఫ్ మద్దతుదారుల మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. పోలీసులు జోక్యం చేసుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

## హైదరాబాద్ గ్లోబల్ బిజినెస్ హబ్ తీర్చిదిద్దే దిశగా మరో అడుగు

### హైనెకెన్ జిసిసి ప్రారంభంతో పెట్టుబడులకు కొత్త ఊపు: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ స్థాయి వ్యాపార కేంద్రంగా హైదరాబాద్ స్థానం మరింత బలపడుతోంది. అంతర్జాతీయ దిగ్గజ సంస్థ హైనెకెన్ తమ 'బిజినెస్ సర్వీసెస్ ఇండియా' గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జిసిసి)ను నగరంలో ప్రారంభించడం ద్వారా తెలంగాణలో పెట్టుబడుల ఆకర్షణకు కొత్త ఊపు లభించింది. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను కేవలం ఐటి నగరంగా కాకుండా గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ హబ్‌గా అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను (జిసిసి) కేవలం బ్యాక్‌ఆఫీస్ కార్యకలాపాలకు పరిమితం చేయకుండా, స్ట్రాటెజిక్ ఇన్నోవేషన్, హై వాల్యూ సేవల కేంద్రాలైన గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా (జివిసి)గా మార్చేందుకు సమగ్ర రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సంస్థలు ఎందుకు ఎంచుకుంటున్నాయంటే ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యంతో కూడిన 'రెడీ టూ వర్క్' మానవ వనరులు, అనుకూల పారిశ్రామిక విధానాలే ప్రధాన కారణాలని మంత్రి పేర్కొన్నారు. ఐటీ దిగ్గజాల నుంచి తయారీ, వినియోగ వస్తు కంపెనీల వరకు తమ వ్యూహాత్మక కేంద్రాల కోసం హైదరాబాద్‌కే ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. తాజాగా ప్రారంభమైన హైనెకెన్ జిసిసి ఫైనాన్స్, డిజిటల్, టెక్నాలజీ, అనలిటిక్స్ రంగాల్లో గ్లోబల్ సేవలను అందించే కీలక కేంద్రంగా పని చేయనుంది. ప్రస్తుతం 300 మందికి పైగా నిపుణులకు ఉపాధి కల్పిస్తున్న ఈ కేంద్రం, త్వరలోనే 1600 మందికి ఉద్యోగావకాశాలు సృష్టించే సామర్థ్యం కలిగి ఉందని వెల్లడించారు. తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ ఎకానమీ లో కీలక భాగస్వామిగా నిలబెట్టడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. హైనెకెన్ వంటి అంతర్జాతీయ సంస్థల ప్రవేశం రాష్ట్ర బ్రాండ్‌ను ప్రపంచ పటంలో మరింత బలపరుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి క్రిష్ణారావు, హైనెకెన్ ఉన్నతాధికారులు మరియు పలువురు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.



## షకీల్ నుంచి డబ్బులిప్పించగలరా?

### హరీష్‌రావుకు బీర్ల సవాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైస్ మిల్లర్లు సిఎంఆర్ కింద ధాన్యం సేకరించి ప్రభుత్వానికి రూ.15 వేల కోట్లు ఎగవేశారని, బిఆర్ఎస్ బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ వంద కోట్లకు పైగా విలువైన వడ్లను తీసుకుని బియ్యం ఇవ్వకుండా ప్రభుత్వానికి ఎగవేశారని, బిఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఆ డబ్బును ఆయన నుంచి ప్రభుత్వానికి ఇప్పిస్తారా? అని మాజీ మంత్రి హరీష్‌రావుకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య బహిరంగ సవాల్ చేశారు. రాష్ట్రంలో గత కొన్ని రోజుల నుంచి రైతులు పండించిన పంటలను ప్రభుత్వం శరవేగంగా కొనుగోలు చేస్తున్న విషయం హరీష్‌రావుకు కనపడుతున్నట్లు లేదని ఆయన పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను గాలికి వదిలి అధికారం పోయిన అనంతరం హరీష్‌రావు రైతుబాంధవుడి అవతారం ఎత్తారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో వరి వేస్తే ఉరేనని ప్రభుత్వం వడ్లు కొనుగోలు చెయవద్దని ముఖ్యమంత్రి రైతులను బెదిరించినప్పుడు మీరెక్కడికి పోయారని ప్రశ్నించారు. రైతుల పట్ల బిఆర్ఎస్ దమనకాండను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని, గిట్టుబాటు ధర అడిగిన ఖమ్మం మిర్చి రైతులకు సంకెళ్లు వేసి నడిపించిన చరిత్ర బిఆర్ఎస్‌దని విమర్శించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో వరి 7,70,053 మెట్రిక్ టన్నులు, మొక్కజొన్న 3,46,121 మెట్రిక్ టన్నులు, శనగలు 30,220 మెట్రిక్ టన్నులు, సన్‌ఫ్లవర్ 3,492 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని వివరించారు. కుటిల రాజకీయాలు, అర్థం పర్థం లేని విమర్శలు ఆపి రైతన్న కోసం ఇంకా ఏం చేయాలో నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇవ్వాలని బీర్ల ఐలయ్య సూచించారు.

## పొంతనేదీ ?

(మొదటి పేజీ తరువాయి)

పెట్రోల్ , డీజిల్ దొరుకుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. బంకుల్లో నో స్టాక్ బోర్డులు కనిపిస్తుండడంతో , రైతులు, వాహనదారులతో పాటు వ్యవసాయ పనులు, సరుకు రవాణా, అత్యవసర సేవలు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మంత్రులు, అధికారులు మాత్రం సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని, ఎక్కడా కొరతలేదని, సరఫరాలో తాత్కాలిక ఆలస్యాలు మాత్రమే ఉన్నాయని పేర్కొంటున్నారు. దీంతో వారి మాటలు నమ్మిన కొంత మంది వాహనదారులు గతంలో తరహా పెట్రోల్, డీజిల్ ఎక్కడైనా పోయించుకోవచ్చు అనే ధీమాతో వెళ్లి చమురు దొరకక మార్గమధ్యలో అష్ట కష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. వాహనదారులు తెలిపిన వివరాల ప్రకారం, సరఫరా, ట్రాన్స్‌పోర్ట్ సమస్యలతో పాటు, ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో కొరత ఏర్పడుతున్నట్లు పెట్రోల్ బంక్ నిర్వాహకులు వెల్లడిస్తున్నారు. కొందరు వినియోగదారులు అవసరానికి మించిన నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించడం కూడా ఓ కారణమనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. మంత్రులు, అధికారుల మాటలను చేతలతో చూపాల్సిన అవసముందని, సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని, నిల్వలపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టడంతో పాటు ఇంధన కొరతపై స్పష్టమైన సమాచారం, పారదర్శక చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ప్రజలకు కావల్సినంత పెట్రోల్,డీజిల్ అందుబాటులో ఉంది: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

ప్రజలకు కావల్సినంత పెట్రోల్,డీజిల్ అందుబాటులో ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. డీజిల్,పెట్రోలు కొరత ఉన్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని ప్రజలు అనవసరంగా ఆందోళకు గురికావద్దని ఉద్బోధించారు. ఇప్పటికే ఇంధన సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదుల కోసం 1967 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి వెల్లడించారు. 210 శాతం డీజిల్ ను 132 శాతం పెట్రోలు సరఫరాల పెంచడంతో పాటు అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచామన్నారు. వ్యవసాయ అవసరాలకు అవసరమైన డీజిల్ సరఫరాకు ప్రత్యేక దృష్టి సారించామని, ఎప్పటికప్పుడు జిల్లాల స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తోందని చెప్పారు. రోజుకు పెట్రోల్ ,డీజిల్ కలిపి 36,404 కిలో లీటర్లు సరఫరా జరుగుతోందని, సగటున రోజువారీ మీద 175 శాతం అధికమని మంత్రి వెల్లడించారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com